ఆదివారం
6•1•2019
కరీంనగర్
• వెల. రూ.8
• సంపుటి 8 • సంచిక 192
• పేజీలు: 16 + 16 + 32 పేజీల ఆదివారం అనుబంధం

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD





శనివారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు. చిత్రంలో ఎమ్మెల్యేలు టీ రాజయ్య, బాల్క సుమన్, ఎమ్మెల్సీలు ఎం శ్రీనివాస్‌రెడ్డి, కర్నె ప్రభాకర్, కే జనార్దన్‌రెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టు రాంచందర్‌రావు, సహాయ కార్యదర్శి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

మోదీ.. బీజేపీకే ప్రధానా?

- తెలంగాణ పథకాలకు ప్రశంసలు తప్ప పైసలేవి?
- బీజేపీయేతర రాష్ట్రాలపై కేంద్రం సవతి తల్లి ప్రేమ
- తెలంగాణలో బీజేపీ లేదనే ఒక్క పైసా ఇవ్వడంలేదు
- పైగా రాష్ట్ర పథకాలను కాపీకొట్టడానికి సిద్ధమయ్యారు
- రాష్ట్రంలో ఒక్క ఎంపీ సీటులోనూ బీజేపీకి డిపాజిట్ దక్కదు
- నిప్పులు చెరిగిన టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- బీజేపీ ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలని హితవు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

బీజేపీయేతర రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపుతున్నదని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను కేంద్రం, ప్రధాని మోదీ ప్రశంసించడమే తప్ప వాటికి ఒక్క పైసా నిధులు ఇవ్వలేదని మండిపడ్డారు. నరేంద్రమోదీ బీజేపీకే ప్రధాని అనుకుంటున్నారా? బీజేపీ పాలిత రాష్ట్రాలకే ఆయన ప్రధానమంత్రా? అంటూ నిప్పులు చెరిగారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న మిషన్ భగీరథ, మిషన్ కాకతీయకు నిధులు ఇవ్వబోమని పార్లమెంటులో కేంద్ర జలవనరులశాఖ సహాయమంత్రి అర్జున్ రామ్‌మేఘ్‌వాల్ ప్రకటించడంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. కేంద్ర వైఖరి ఇదేవిధంగా ఉంటే రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీకి ఒక్క ఎంపీ సీట్లో కూడా డిపాజిట్ దక్కదని హెచ్చరించారు. శనివారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. మిషన్ భగీరథకు రూ.19,205 కోట్లు, మిషన్ కాకతీయకు రూ.5 వేల కోట్లు నిధులు ఇవ్వాలని

మిగతా 2వ పేజీలో

17 నుంచి అసెంబ్లీ

20 వరకు తొలి సమావేశాలు

- 16 సాయంత్రం ప్రొటెం స్పీకర్ శపథ స్వీకారం
- 17న నూతన శాసనసభ్యుల ప్రమాణ కార్యక్రమం
- 18న స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ప్రక్రియ.. అదేరోజు బీఏసీ సమావేశం
- 19న ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగం
- 20న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా జరిగిన శాసనసభ ఎన్నికల్లో గెలుపొందిన సభ్యులతో ఈ నెల 17న అసెంబ్లీ కొలువుదీరనుంది. నాలుగురోజులపాటు (20వ తేదీవరకు) తొలి సమావేశాలు కొనసాగుతాయి. సీనియర్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్ ఈ నెల 16న ప్రొటెం స్పీకర్‌గా శపథం స్వీకరిస్తారు. 17న కొత్త ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం నిర్వహిస్తారు. 18న స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ప్రక్రియ ఉంటుంది. అదేరోజు సభా వ్యవహారాల సలహాసంఘం సమావేశమవుతుంది. 19న ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగిస్తారు. 20న

మిగతా 2వ పేజీలో



ప్రొటెం స్పీకర్‌గా మజ్లిస్ ఎమ్మెల్యే అహ్మద్‌ఖాన్‌కు అరుదైన గౌరవం

గులాబీ హవా

- వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనూ గులాబీ పార్టీకే ప్రజల ఓటు
- 16 స్థానాల్లో విజయం సాధించనున్న టీఆర్‌ఎస్
- సీఎం కేసీఆర్ నాయకత్వానికి జనం జయహో
- ప్రతిపక్షాలు లా పతా
- వీడీపీ అసోసియేట్స్ తాజా సర్వేలో వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

టీఆర్‌ఎస్ పాలనే తమకు శ్రీరామరక్ష అని తెలంగాణ ప్రజలు మరోసారి స్పష్టంచేశారు. ఎన్నికలు ఏవైనా తమకు పాలకపక్షంగా సీఎం కేసీఆర్ నాయకత్వంలోని టీఆర్‌ఎస్ పార్టీయే ఉండాలని భారీ మెజార్టీతో పట్టం కడుతున్న ప్రజలు.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోనూ గులాబీ పార్టీకే విజయం కట్టబెడుతారని వీడీపీ అసోసియేట్స్ తాజా సర్వే వెల్లడించింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఏకపక్షంగా తీర్పునివ్వనున్నారని సర్వే స్పష్టంచేసింది. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 17 ఎంపీ సీట్లుండగా.. అందులో 16 స్థానాలను టీఆర్‌ఎస్ కైవసం చేసుకుంటుందని తెలిపింది. మిగిలిన హైదరాబాద్ లోక్‌సభ

మిగతా 2వ పేజీలో



2

కేసీఆరే ప్రధాని కావాలి

వీడీపీ అసోసియేట్స్ సర్వేలో తెలంగాణవాసుల ఆకాంక్ష

బీజేపీ: 201 (-81), కాంగ్రెస్ :110 (+66)

ఓట్ల శాతం: ఎన్డీఏ 36%, యూపీఏ 32% 5

8,9 తేదీల్లో బ్యాంకుల సమ్మె

- కేంద్ర ప్రభుత్వ విధానాలపై కార్మిక సంఘాల ఆందోళనకు మద్దతుగా బ్యాంకింగ్ యూనియన్ల ప్రకటన 9
- బ్యాంకుల కార్యకలాపాలపై ప్రభావం

మే 3 నుంచి ఎంసెట్

- 3, 4, 6 తేదీల్లో ఇంజినీరింగ్
- 8, 9 తేదీల్లో అగ్రికల్చర్ విభాగాలకు పరీక్షలు
- ప్రవేశపరీక్షలన్నీ ఆన్‌లైన్‌లోనే
- 2019-20 ప్రవేశపరీక్షల తేదీలు వెల్లడించిన ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 2019-20 విద్యాసంవత్సరానికి సంబంధించిన అన్ని ప్రవేశపరీక్షలు మే నెలలోనే జరుగనున్నాయి. జాతీయస్థాయిలో, ఏపీలో జరిగే పరీక్షలకు ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర ఉన్నత విద్యామండలి పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఇంజినీరింగ్, అగ్రికల్చర్ కళాశాలల్లో సీట్ల భర్తీ కోసం మే మూడు నుంచి తొమ్మిది వరకు ఆన్‌లైన్‌లో ఎంసెట్-2019 పరీక్షలను

మిగతా 2వ పేజీలో

2019-20లో ప్రవేశ పరీక్షలవారీగా తేదీలు, యూనివర్సిటీల వివరాలు

టీఎస్ సెట్స్	యూనివర్సిటీ	ప్రవేశ పరీక్ష తేదీ	ఉదయం	మధ్యాహ్నం
ఎంసెట్	జేఎన్టీయూహెచ్	మే 3, 4, 6 (ఇంజినీరింగ్)	10-1	3-6
		మే 8, 9, (అగ్రికల్చర్)	10-1	3-6
ఈసెట్	జేఎన్టీయూహెచ్	మే 11	10-1	3-6
పీఈసెట్	ఎంజీయూ నల్లగొండ	మే 20	ఆఫ్‌లైన్‌లో పరీక్షలు	
ఐసెట్	కేయూ వరంగల్	మే 23, 24	10-12.30	2.30 -5
లాసెట్	ఓయూ	మే 26	11-12.30	-
పీజీలాసెట్	ఓయూ	మే 26	-	2.30-4
పీజీఈసెట్	ఓయూ	మే 27, 28, 29	10-12	2 -4
ఎడ్‌సెట్	ఓయూ	మే 30, 31	11-1	3-5



• సండే స్పెషల్



కూరగాయలు, పండ్ల వ్యర్థాలతో వివిధ ఉత్పత్తులను తయారుచేస్తున్న హైదరాబాద్ పద్మారావునగర్ వాసి శైలేంద్ర

తొక్క మంచిదే!

కూరగాయలు, పండ్ల వ్యర్థాలతోనూ ఆరోగ్యం

షాంపూలు, వంటిసబ్బులకు చెక్ పెట్టొచ్చు

పూలతో రూమ్‌ఫ్రెషనర్స్ తయారుచేయొచ్చు

నిమ్మకాయలు, సంత్రా, మామిడి వంటి పండ్లనుంచి రసంతీసిన తర్వాత మిగిలే తొక్కలు చెత్తబుట్టలో పడిపోతుంటాయి! దానిమ్మ పండ్లు ఒలిచి.. గింజలు తీశాక మిగిలే తొక్క పనికిరానిదిగా భావిస్తాం! కానీ.. తొక్కేకదా అని తీసిపారేయకండి! వాటిని వాడాల్సిన పద్ధతిలో వాడితే ఎన్నోలాభాలున్నాయి! మామిడి తొక్కలతో ఫ్లోర్ క్లీనర్ తయారుచేయొచ్చు! కుంకుడుకాయలతో అంట్లుతోమొచ్చు.. టాయ్‌లెట్ క్లీనర్ తయారుచేయొచ్చు.. దుస్తులు ఉతకొచ్చు! గులాబీ, మల్లె, చామంతి వంటి పూలతో రూమ్‌ఫ్రెషనర్ తయారుచేయొచ్చు! ఆఖరుకు బూడిద కూడా పనికివచ్చేదే! బయట మార్కెట్‌లో దొరికే వాటిలో ఉండే రసాయన గుణాలే.. పండ్లు, కూరగాయల వ్యర్థాలతో తయారుచేసే పదార్థంలోనూ ఉంటాయి! మన వంటిని, ఇంటిని శుభ్రంగా ఉంచుకునేందుకు సహాయపడుతాయి! ఆ వివరాలతో ప్రత్యేక కథనం..

12

ఐఏఎస్ చంద్రకళపై సీబీఐ



- యూపీలో ఇసుక అక్రమ తవ్వకాల కేసులో..
- ఆమె ఇండ్లు, కార్యాలయాల్లో తనిఖీలు
- ఇది చంద్రకళను వేధించడమే
- సీబీఐ సోదాలపై అధికారుల ఖండన

5

కాలిఫోర్నియాలో కాల్పులు

గేమింగ్ కాంప్లెక్స్‌లో ఘటన.. ముగ్గురి మృతి 5





శనివారం తెలంగాణభవన్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్తున్న ఎమ్మెల్యేలు బాల్క సుమన్, కొప్పుల ఈశ్వర్, కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



తెలంగాణభవన్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావుకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న శాసనమండలి వైస్ చైర్మన్ నేతి విద్యాసాగర్, ఎమ్మెల్సీ ఆకుల లలిత, మాజీ స్పీకర్ సురేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్, టీఆర్‌ఎస్ ఎన్నారై సెల్ కన్వీనర్ అనిల్ కూర్మాచలం, సినీ మాటల రచయిత పరుచూరి వెంకటేశ్వర్‌రావు, నటుడు వినోద్ బాల

మోదీ.. బీజేపీకే ప్రధానా?

మొదటిపేజీ తరువాయి...



శనివారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు. చిత్రంలో ఎమ్మెల్యేలు టీ రాజయ్య, బాల్క సుమన్, కోరుకంటి చందర్, ఎమ్మెల్సీలు శ్రీనివాస్‌రెడ్డి, కర్నె ప్రభాకర్, కే జనార్దన్‌రెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టు రాంచందర్‌రావు, సహాయ కార్యదర్శి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ కే వాసుదేవరెడ్డి, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, రైతు రుణవిముక్తి కమిటీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్‌రావు కూడా ఉన్నారు.

కేంద్రప్రభుత్వానికి నీతిఅయోగ్ సిఫార్సుచేసిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే నిధులను ఇచ్చేదిలేదని పార్లమెంట్‌లో కేంద్రమంత్రి తెలిపారన్నారు. బీజేపీ బలంగా లేని తెలంగాణకు నిధులు ఎందుకు ఇవ్వాలన్న ఉద్దేశంతో కేంద్రం ఉన్నట్టు కనిపిస్తున్నదని వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలో కూడా ఇంటింటికీ నల్లా నీటిని అందించే మిషన్‌భగీరథ మంచి కార్యక్రమమంటూ ప్రశంసించారని, ఆయనే స్వయంగా గజ్వేల్‌లో ఈ పథకాన్ని ప్రారంభించారని కేటీఆర్ ప్రస్తావించారు. ఈ పథకాన్ని ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, బీహార్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఒడిశా, మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాలకు చెందిన అధికారులు, మంత్రులు ఇక్కడికి వచ్చి అధ్యయనం చేసి ప్రశంసించారని చెప్పారు. ఈ పథకం బాగుందని, దేశంలోని అన్ని రాష్ట్రాలు అధ్యయనం చేయాలని కేంద్ర ప్రభుత్వం లేఖలు రాసిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలను నోబెల్ అవార్డు గ్రహీత కైలాశ్ సత్యార్థి, వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా, రామన్‌మెగసెసె అవార్డు గ్రహీత రాజేందర్‌సింగ్ సహా పలువురు ప్రముఖులు అభినందించారని కేటీఆర్ చెప్పారు. ఒక వైపు రాష్ట్ర పథకాలను కేంద్ర ప్రశంసిస్తూ మరోవైపు ఆ పథకాలను కాపీ కొట్టి, పేరు మార్చి అమలుచేయడంద్వారా ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు బీజేపీ తాపత్రయపడుతున్నదని విమర్శించారు.

కేంద్రానిది పక్షపాత ధోరణి

బీజేపీ పాలిత రాష్ట్రాలపట్ల ఒక తీరుగా, బీజేపీయేతర ప్రభుత్వాలపట్ల మరోతీరుగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని కేటీఆర్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ పక్షపాత వైఖరిని ఆయన తీవ్రంగా ఖండించారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఆ రాష్ట్ర నీటిపారుదల ప్రాజెక్టులకు నిధులు అడుగగానే అంచనా వ్యయంలో 25% భరించడానికి కేంద్రం ముందుకొచ్చిందని, ఇప్పటికే రూ.3831 కోట్లు విడుదలచేసిందని తెలిపారు. మహారాష్ట్రలో బీజేపీ అధికారంలో ఉండటంతో కేంద్ర జలవనరుల మంత్రి నితిన్‌గడ్కరీ ఆ రాష్ట్రానికి నిధులు ఇచ్చారన్నారు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయహోదా ఇచ్చారని, 90% నిధులు కేం ద్రమే విడుదలచేస్తున్నదని గుర్తుచేశారు. కానీ.. తెలంగాణలో కాళేశ్వరంసహా దేనికైనా ఒకదానికి జాతీయహోదా కోరుతుంటే ఇవ్వడం లేదని విమర్శించారు. కేంద్రం అన్ని రాష్ట్రాలను సమదృష్టితో చూడాలని కోరారు. తెలంగాణ విషయంలో కేంద్రం వైఖరి బాధాకరంగా ఉన్నదని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. కంపా నిధులు రాలేదని, జీఎస్టీ బకాయిలు విడుదలచేయలేదని చెప్పారు. వీటితోపాటు రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను కేంద్రం నెరవేర్చలేదని విమర్శించారు. ఐటీఐఆర్‌పై అనేకమార్లు సీఎం కేసీఆర్ ప్రధానికి వినతిపత్రం ఇచ్చారని, బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, గిరిజన విశ్వవిద్యాలయం, కాజీపేటలో కోచ్‌ల తయారీ పరిశ్రమ ఏర్పాటు అంశాలపైనా స్పందన లేదని చెప్పారు. ఇటీవలే 16 అంశాలతో కూడి వినతి పత్రాన్ని ప్రధానికి కేసీఆర్ ఇచ్చారని గుర్తుచేశారు. వాటిపై స్పందన లేదన్నారు. 'నరేంద్రమోదీ బీజేపీకి ప్రధానమంత్రా? బీజేపీపాలిత రాష్ట్రాలకే ప్రధానమంత్రా?' అని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. ఈ రకమైన వ్యవహారం ప్రజాస్వామ్యానికి మంచిదికాదన్నారు. బీజేపీ బలంగా లేని తెలంగాణకు ఎందుకు సాయం చేయాలన్నట్టు కేంద్రం వైఖరి ఉన్నదని విమర్శించారు. ఇది బీజేపీ నీచరాజకీయానికి పరాకాష్ట అన్నారు. నోటితో పొగిడి నొసటితో వెక్కిరించినట్టు కేంద్రం వైఖరి ఉందని చెప్పారు. దీనిపై పార్లమెంట్‌లో అనేకమార్లు నిలదీశామని, ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనూ నిలదీస్తామని తెలిపారు.

బీజేపీ ఇప్పటికైనా బుద్ధితెచ్చుకోవాలి

నాలుగున్నరేండ్లలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రం పట్ల అవలంబించిన వైఖరిని చూసే తెలంగాణ ప్రజలు బీజేపీకి బుద్ధి చెప్పారన్న కేటీఆర్.. ఇకనైనా ఆ పార్టీ బుద్ధితెచ్చుకోవాలని హితవు పలికారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి పోటీచేసిన 103 స్థానాల్లోనూ డిపాజిట్లు దక్కలేదన్న కేటీఆర్.. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో ఉన్న ఒక్క ఎంపీ సీటును కూడా బీజేపీ నిలుపుకోలేదని, 17 స్థానాల్లోనూ డిపాజిట్ దక్కదని, ఆ పార్టీకి భంగపాటు తప్పదని స్పష్టంచేశారు. దశాబ్దాలపాటు వివక్షకు గురైన తెలంగాణకు నిధులు కేటాయించాల్సిందిపోయి ఒక్క ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వనివాళ్లు మళ్లీ ఏ మొహం పెట్టుకొని వస్తారు? అని ప్రశ్నించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలను మోసం చేసేందుకు బీజేపీ నేతలు ప్రయత్నిస్తారు కాబట్టి.. ప్రజలను అప్రమత్తంచేసేందుకే జరుగుతున్న విషయాలన్నింటినీ ప్రజల ముందు పెడుతున్నామని తెలిపారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమను తామే నిర్మిస్తామని, అయితే ఏపీలో చంద్రబాబులా అదరాబాదరాగా చెయ్యబోమని స్పష్టంచేశారు. ప్రజల నెత్తిన టోపీపెట్టే ఆలోచన తమకు లేదన్నారు. కేంద్రం ఉక్కు పరిశ్రమ పెట్టబోవటం లేదని తెలిపిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వమే పరిశ్రమను ఏర్పాటుచేస్తుందని స్పష్టంచేశారు. ఇప్పటికే దీనిపై కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటన చేశారని గుర్తుచేశారు. సమావేశంలో ఎమ్మెల్యేలు టీ రాజయ్య, బాల్క సుమన్, కోరుకంటి చందర్, ఎమ్మెల్సీలు ఎం శ్రీనివాస్‌రెడ్డి, కర్నె ప్రభాకర్, కే జనార్దన్‌రెడ్డి, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, రైతు రుణవిముక్తి కమిటీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్‌రావు, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టు రాంచందర్‌రావు, సహాయ కార్యదర్శి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ కే వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి అసెంబ్లీ

మొదటిపేజీ తరువాయి...

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం ఉంటుంది. ప్రజలు గొప్ప మెజార్టీతో తమను గెలిపించారని, ఆ స్ఫూర్తితో ఉత్తరాయణ పుణ్యకాలంలో ఏకాదశి తిథినాడు శాసనసభ కార్యకలాపాలు ప్రారంభించాలని నిర్ణయించినట్లు సీఎం కేసీఆర్ తెలిపారు.

అహ్మద్‌ఖాన్‌కు అరుదైన గౌరవం

మజ్లిస్ పార్టీ శాసనసభ్యుడు ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌కు అరుదైన గౌరవం లభించింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో చార్మినార్ నియోజకవర్గం నుంచి గెలుపొందిన అహ్మద్‌ఖాన్ శాసనసభకు ఆరోసారి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సాధారణంగా నూతనంగా ఎన్నికైన శాసనసభ్యుల్లో సీనియర్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమిస్తారు. ఈ నేపథ్యంలో ఆరుసార్లు గెలుపొందిన అహ్మద్‌ఖాన్ సీనియర్ కావడంతో ఆయనను ప్రొటెం స్పీకర్‌గా నియమించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. మజ్లిస్ పార్టీ శాసనసభ్యుడికి ఈ అరుదైన గౌరవం లభించడం పట్ల ఆ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సంతోషం వ్యక్తం చేశారు. అహ్మద్‌ఖాన్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమించినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ట్వీట్ చేశారు.

16న ప్రొటెం స్పీకర్ శపథ స్వీకారం

శాసనసభ సమావేశాల ప్రారంభానికి ముందురోజు.. ఈ నెల 16న ప్రొటెం స్పీకర్‌గా ముంతాజ్ అహ్మద్‌ఖాన్ శపథ స్వీకార కార్యక్రమం ఉంటుంది. సాయంత్రం ఐదుగంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ ఆయనతో శపథం చేయిస్తారు. అనంతరం 17వ తేదీనుంచి తొలి శాసనసభ సమావేశాలు ప్రారంభమవుతాయి. ఆరోజు ఉదయం 11.30 గంటలకు నూతనంగా ఎన్నికైన శాసనసభ్యులు ఒకరి తర్వాత ఒకరు ప్రమాణం స్వీకరిస్తారు. ఈ కార్యక్రమం సుమారు రెండుగంటలపాటు కొనసాగుతుంది. ఆరోజు మధ్యాహ్నం జూబ్లీహాల్ ప్రాంగణంలోని కౌన్సిల్ లాన్స్‌లో శాసనసభ్యులకు ప్రభుత్వం ఆతిథ్యం ఇవ్వనుంది. అదేరోజున స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక షెడ్యూల్ ప్రకటన, నామినేషన్ల ప్రక్రియ నిర్వహించనున్నారు. మరుసటిరోజు అంటే ఈ నెల 18న స్పీకర్ ఎన్నిక, అనంతరం అధికారిక ప్రకటన వెలువడుతుంది. ఆ తర్వాత నూతనంగా ఎన్నికైన స్పీకర్‌ను సభానాయకుడు, సీఎం కేసీఆర్, ప్రతిపక్ష నాయకులు, ఇతర రాజకీయ శాసనసభాపక్ష నాయకులు స్పీకర్ స్థానానికి మర్యాదపూర్వకంగా తోడ్కొని పోతారు. స్పీకర్ అధ్యక్షతన సభాకార్యక్రమాలు కొనసాగుతాయి. అదేరోజు స్పీకర్ అధ్యక్షతన సభా వ్యవహారాల సలహా సంఘం (బీఏసీ) సమావేశాన్ని నిర్వహించనున్నారు. అందులో భాగంగా మరుసటిరోజు గవర్నర్ ప్రసంగంపై నిర్ణయం తీసుకుంటారు. ఈ నెల 19న కొత్తగా కొలువుదీరిన శాసనసభతోపాటుగా మండలి సభ్యులతో కూడిన ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్ర గవర్నర్ నరసింహన్ ప్రసంగించనున్నారు. మరుసటిరోజు.. 20న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం ప్రవేశపెడుతారు. అనంతరం దానికి సభ ఆమోదం తెలుపడం వంటి ప్రక్రియలుంటాయి. అదే రోజు శాసనమండలి సమావేశాలు కూడా కొనసాగనున్నాయి.

మజ్లిస్‌కు ఇది రెండోసారి..

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: తెలంగాణ శాసనసభ ప్రొటెం స్పీకర్ బాధ్యతలు నిర్వహించనున్న చార్మినార్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్‌ఖాన్ సీనియర్ నాయకుడు. మజ్లిస్‌కు ఈ అవకాశం లభించడం ఇది రెండోసారి. ఇదివరలో ఎంఐఎం పార్టీ మాజీ అధినేత, సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ 1984లో ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించారు. అప్పటికాయన ఐదుసార్లు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. అప్పుడు నాదెండ్ల భాస్కరరావు ముఖ్యమంత్రిగా ఉన్నారు. సలావుద్దీన్ ఒవైసీ తర్వాత ఇప్పుడు మజ్లిస్ పార్టీ నుంచి ముంతాజ్‌ఖాన్‌కు ఆ అవకాశం దక్కింది. సాధారణంగా పార్టీలతో నిమిత్తం లేకుండా సీనియర్ ఎమ్మెల్యేలను ప్రొటెం స్పీకర్లుగా నియమిస్తారు. ప్రొటెం స్పీకర్‌గా ఎవరిని నియమించాలనేది గవర్నర్‌కు ముఖ్యమంత్రి సిఫారసు చేస్తారు. గవర్నర్ నియమిస్తారు. ముంతాజ్‌ఖాన్ మొదటిసారిగా 1986లో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు రియాసత్‌నగర్ వార్డు కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. 1994లో యాకుత్‌పురా నియోజకవర్గం నుంచి మొదటిసారిగా ఎమ్మెల్యే అయ్యారు. అదే నియోజకవర్గం నుంచి వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తాజాగా జరిగిన శాసనసభ ఎన్నికలలో ఆయన చార్మినార్ నియోజకవర్గం నుంచి పోటీచేసి గెలిచారు.

గులాబీ హవా

మొదటిపేజీ తరువాయి...

స్థానాన్ని ఎప్పటిలాగే ఎంఐఎం పార్టీ గెలుచుకుంటుందని స్పష్టంచేసింది. తెలంగాణ ప్రజలు టీఆర్‌ఎస్‌ను అక్కున చేర్చుకోవడానికి అనేక కారణాలున్నాయని, 57 ఏండ్ల కాంగ్రెస్, టీడీపీ పాలనకంటే నాలుగున్నరేండ్ల సీఎం కేసీఆర్ పాలన మెరుగ్గా ఉన్నదని ప్రజలంతా ఆనందంగా అంగీకరించారు. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు కోటిన్నరకుపైగా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేరడంతో సీఎం కేసీఆర్ నాయకత్వానికే జైకొడుతున్నారు.

ఎవరికి ఎంతశాతం ఓట్లు?

ఈ ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఏయే పార్టీకి ఎంత శాతం ఓట్లు పోలవుతాయనే విషయంలోనూ వీడీపీ అసోసియేట్స్ చేసిన సర్వేలో స్పష్టతవచ్చింది. టీఆర్‌ఎస్‌కు దాదాపు 44.4 శాతం ఓట్లు పోలవుతాయని వెల్లడించింది. 2014 ఎన్నికల్లో 11 లోక్‌సభ స్థానాలు గెలుచుకున్న టీఆర్‌ఎస్‌లో వైసీపీనుంచి గెలుపొందిన ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, నల్లగొండలో కాంగ్రెస్ నుంచి గెలిచిన గుత్తా సుఖేందర్‌రెడ్డి, మల్కాజిగిరిలో టీడీపీనుంచి గెలిచిన చామకూర మల్లారెడ్డి టీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో లోక్‌సభలో టీఆర్‌ఎస్ బలం 14కు పెరిగింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో చావుదెబ్బతిన్న కాంగ్రెస్‌కు 31 శాతం ఓట్లు మాత్రమే వస్తాయని తేల్చిన సర్వే.. ఒక్కసీటు కూడా గెలిచే అవకాశమే లేదని పేర్కొన్నది. తెలంగాణ ప్రజలు పూర్తిగా తిరస్కరించిన బీజేపీ 11.4 శాతం ఓట్లను పొందుతుందని తెలిపింది. గత ఎన్నికల్లో బీజేపీ గెలుపొందిన సికింద్రాబాద్ స్థానాన్ని ఈసారి కోల్పోయి చతికిలపడే అవకాశమున్నది. హైదరాబాద్ ఎంపీ స్థానాన్ని నిలబెట్టుకొనే ఆనవాయితీని ఎంఐఎం ఈసారి కూడా కొనసాగిస్తుందని తెలిపింది. మజ్లిస్‌కు ఈసారి దాదాపు 4 శాతం ఓట్లు పోలవుతాయని సర్వే తెలిపింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో వామపక్షాల చిరునామా గల్లంతయ్యే అవకాశమున్నదని వీడీపీ తాజా సర్వేలో పేర్కొన్నది. సీపీఐ, సీపీఎంకు చెరో 0.5 శాతం, కోదండరాం పార్టీ టీజేఎస్‌కు 0.4 శాతం ఓట్లు మాత్రమే లభిస్తాయని వెల్లడించింది. ఈ సర్వే ప్రకారం ప్రతిపక్షాలు కూకటివేళ్లతోసహా కుప్పకూలనున్నాయని అర్థమవుతున్నది.

కేసీఆరే ప్రధాని కావాలి

తెలంగాణవాసుల ఆకాంక్ష

న్యూఢిల్లీ: తెలంగాణకు సుభిక్షమైన పాలననందించిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు దేశానికి కూడా ప్రధాని కావాలని రాష్ట్ర ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. వీడీపీ అసోసియేట్స్ నిర్వహించిన సర్వేలో తెలంగాణవాసులు తమ మనోభావాలను వ్యక్తంచేశారు. కేసీఆర్, మోదీ, రాహుల్‌గాంధీలలో తదుపరి ప్రధాని ఎవరు కావాలని కోరుకుంటున్నారన్న ప్రశ్నకు అత్యధికులు తమ ముఖ్యమంత్రి వైపే మొగ్గు చూపారు. తదుపరి ప్రధానిగా కేసీఆర్ ఉండాలని 35 శాతం, 28 శాతం మంది రాహుల్ గాంధీని ఎంపిక చేసుకున్నారు. ఇక ప్రస్తుత ప్రధాని నరేంద్రమోదీ వైపు 27 శాతం మంది మొగ్గు చూపారు.

మే 3 నుంచి ఎంసెట్

మొదటిపేజీ తరువాయి...

నిర్వహించాలని విద్యామండలి నిర్ణయించింది. మే 3, 4, 6 తేదీల్లో ఇంజినీరింగ్, 8, 9 తేదీల్లో అగ్రికల్చర్ విభాగాలకు పరీక్షలు జరుపనున్నది. మే 5న జాతీయస్థాయిలో నీట్ పరీక్ష ఉన్నందున ఆ రోజు ఎంసెట్ పరీక్షలు నిర్వహించడం లేదు. మే ఏడును రిజర్వ్‌డేగా ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్రంలో నిర్వహించే అన్నిరకాల ప్రవేశ పరీక్షల తేదీలను, నిర్వహణ బాధ్యతలు అప్పగించిన యూనివర్సిటీల వివరాలను శనివారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి తుమ్మల పాపిరెడ్డి మీడియాకు వెల్లడించారు. జాతీయస్థాయిలో, ఏపీలో జరిగే ప్రవేశ పరీక్షలకు ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా ఈ తేదీలను నిర్ణయించామని పాపిరెడ్డి చెప్పారు.

ఆన్‌లైన్లో ప్రవేశ పరీక్షలు

గత ఏడాది మాదిరిగానే 2019-20 విద్యా సంవత్సరంలోనూ అన్నిరకాల ప్రవేశ పరీక్షలను ఆన్‌లైన్‌లో (సీబీటీ) నిర్వహించనున్నట్టు, నిర్వహణ బాధ్యతలను టీసీఎస్ సంస్థకు అప్పగించినట్టు పాపిరెడ్డి తెలిపారు. గత ఏడాది కంటే ఈ సారి మరింత పకడ్బందీగా జరుపాలని టీసీఎస్‌ను కోరామన్నారు. ఆ వెంటనే కన్వీనర్లను యూనివర్సిటీలు ప్రకటించాల్సి ఉంది. కన్వీనర్ల నియామకం పూర్తయిన తర్వాత ప్రవేశ పరీక్షలవారీగా సమావేశాలను ఏర్పాటుచేసి, పూర్తిస్థాయి షెడ్యూల్‌తోపాటు నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఆయన వెల్లడించారు.

జేఎన్టీయూహెచ్‌కే ఎంసెట్, ఈసెట్ నిర్వహణ బాధ్యతలు

ఎంసెట్, ఈసెట్ నిర్వహణ బాధ్యతలను ఈ సారి కూడా జేఎన్టీయూహెచ్‌కే అప్పగించామని పాపిరెడ్డి చెప్పారు. లాసెట్, పీజీ లాసెట్, పీజీ ఈసెట్, ఎడ్‌సెట్ పరీక్షల బాధ్యతలను ఉస్మానియా యూనివర్సిటీకి, ఐసెట్‌ను కాకతీయ యూనివర్సిటీకి, ఈసెట్‌ను జేఎన్టీయూహెచ్‌కు, పీఈసెట్‌ను మహాత్మాగాంధీ యూనివర్సిటీకి అప్పగించామని వివరించారు.

కాంగ్రెస్ సంక్షోభంలో ఉంది

- పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసే పరిస్థితిలో లేదు
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలతో కాంగ్రెస్ సంక్షోభంలో ఉన్నదని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కే తారకరామారావు వ్యాఖ్యానించారు. ఆ పార్టీ ఇప్పుడిప్పుడే కోలుకుని ఎన్నికల ఓటమిపై విశ్లేషించుకుంటున్నదన్న కేటీఆర్.. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీ పోటీచేసే పరిస్థితి లేదన్నారు. ఎంపీలుగా పోటీచేయడానికి అభ్యర్థులు కూడా కాంగ్రెస్‌కు దొరకరని ఎద్దేవాచేశారు. తెలంగాణభవన్‌లో శనివారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన కేటీఆర్.. అసెంబ్లీ ఫలితాలకు లోక్‌సభ ఫలితాలకు పెద్దగా తేడా ఉండదని, ఉండటానికి కారణాలు కూడా లేవన్నారు. ఈసారి టీఆర్‌ఎస్‌కు 50%పైగా ఓట్లు రావచ్చన్నారు.

హామీలు నెరవేరుస్తున్నాం

అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేస్తున్నామని కేటీఆర్ చెప్పారు. టీఆర్‌ఎస్‌పై యువతలో వ్యతిరేకత ఉండి ఉంటే అసెంబ్లీ ఎన్నికల్లో ఇంత పెద్దఎత్తున ఓట్లు వచ్చి ఉండేవి కావని విశ్లేషించారు. టీఆర్‌ఎస్‌పై ప్రజల్లో వ్యతిరేకత, కసి ఎక్కడా కనిపించలేదని, అందుకే తామే గెలుస్తామని ధీమాగా చెప్పామని అన్నారు. వేలమంది హాజరైన అనేక సభల్లో పాల్గొన్నామని, ప్రభుత్వంపై వ్యతిరేకత ఉండి ఉంటే కొందరి నుంచైనా నిరసన వ్యక్తమయ్యేదని చెప్పారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ అమలుచేసిన పథకాలపట్ల ప్రజలు పూర్తి విశ్వాసంతో ఉన్నారని, అందుకే భారీ విజయం నమోదైందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ 16 స్థానాల్లో గెలువబోతున్నదనే ధీమాను వ్యక్తంచేశారు. గడియారంలో టీఆర్‌ఎస్ స్టిక్కర్ పైనా ఏపీ సీఎం చంద్రబాబు స్పందించాల్సిన అవసరం ఉందా? అని ఎద్దేవాచేశారు.

కేంద్రంలో వాళ్లూ రారు.. వీళ్లూ రారు..

రాబోయే ఎన్నికల తర్వాత కేంద్రంలో కాంగ్రెస్, బీజేపీలు సొంతంగా అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని కేటీఆర్ విశ్లేషించారు. ఉత్తరాదిలో బీజేపీ తీవ్రంగా దెబ్బతిని ఉందన్నారు. యూపీలో చాలా తక్కువ స్థానాలు బీజేపీకి వచ్చే అవకాశముందని చెప్పారు. అదే సమయంలో కాంగ్రెస్‌కు కూడా పూర్తిగా సీట్లు రావన్నారు. టీఆర్‌ఎస్‌లో నాయకత్వ కొరతలేదని, ఉన్న నాయకులను సవ్యంగా ఉపయోగించుకుని పక్కా ప్రణాళికతో రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ స్థానాల్లో గెలుస్తామని విశ్వాసం వ్యక్తంచేశారు. ప్రస్తుతానికి ఓటరు నమోదు, జిల్లా పార్టీ కార్యాలయాల నిర్మాణాలపై దృష్టి పెట్టామని, వీటిపైనే తన జిల్లా పర్యటనలు ఉంటాయని తెలిపారు. సిరిసిల్లలో తాను ఎంపీ అభ్యర్థిని ప్రకటించలేదని, అయితే రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించానని చెప్పారు. బోయినపల్లి వినోద్‌కుమార్ మంచి వ్యక్తని, అందరినీ కలుపుకొనిపోయే స్వభావమని చెప్పారు. మంచి విషయపరిజ్ఞానం ఉందని, రాష్ట్రానికి, నియోజకవర్గానికి సంబంధించిన అనేక అంశాల పరిష్కారంలో ఆయన చొరవ చూపారని ప్రశంసించారు. ఆయన అభ్యర్థి అయితే తామే అభ్యర్థి అయినట్టు ప్రతి ఎమ్మెల్యే భావిస్తారని, దీంతో భారీ మెజార్టీ వస్తుందని చెప్పారు.


టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్లో రేపటినుంచి

పలు పరీక్షల ప్రాథమిక కీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నోటిఫికేషన్ నంబర్లు 19/2018 నుంచి 28/2018 వరకు సంబంధించిన పోస్టుల పరీక్షల ప్రాథమిక కీ తమ వెబ్‌సైట్‌లో ఏడోతేదీ నుంచి అందుబాటులో ఉంటుందని టీఎస్‌పీఎస్సీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. శానిటరీ ఇన్‌స్పెక్టర్, హెల్త్‌అసిస్టెంట్, ఫీల్డ్‌అసిస్టెంట్, అసిస్టెంట్ డెయిరీ మేనేజర్/మేనేజర్ గ్రేడ్ 2, అసిస్టెంట్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్, ఫీల్డ్ సూపర్‌వైజర్, ప్రాసెసింగ్ సూపర్‌వైజర్, ల్యాబ్‌అసిస్టెంట్, బాయిలర్ ఆపరేటర్, ప్లాంట్ ఆపరేటర్, మార్కెటింగ్ అసిస్టెంట్, సూపర్‌వైజర్ (మార్కెటింగ్) కొలువుల షెడ్యూల్ ఉందని వివరించింది. ఈ నెల తొమ్మిది నుంచి 15 వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నామని పేర్కొన్నది. నిర్దేశిత విధానంలోనే అభ్యంతరాలు సమర్పించాలని స్పష్టంచేసింది.

ఏపీలో సొంతంగానే పోటీ

- ఏ పార్టీతోనూ పొత్తుండదు.. వైసీపీ అధినేత జగన్ స్పష్టీకరణ
- ప్రత్యేక హోదా, రైతు భరోసా మా ప్రాధాన్యాంశాలు
- తెలంగాణ సీఎం కేసీఆర్ మద్దతు హర్షణీయమన్న జగన్



అమరావతి, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో వైసీపీ సొంతంగానే పోటీ చేస్తుందని, ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని ఆ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా గురించి తిరుగులేని పోరాటం కొనసాగిస్తానని చెప్పారు. ఈ విషయంలో తెలంగాణ ముఖ్యమంత్రి అవసరమైన మద్దతునిస్తామని ప్రకటించడం సంతోషకరమన్నారు. 'రైతు భరోసా' తమ ప్రాధాన్య అంశమని, నాలుగు దఫాలుగా రూ.50 వేల నగదు రైతు కుటుంబానికి ఇస్తామని చెప్పారు. కిందటేడాది నవంబర్ ఆరో తేదీన ఇడుపులపాయ నుంచి ప్రారంభించిన ప్రజాసంకల్పయాత్ర చివరిదశలోకి ప్రవేశించిన నేపథ్యంలో శనివారం ఆయన ఓ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాల గురించి మాట్లాడారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చవకబారు రాజకీయాలు చేస్తున్నారని జగన్ విమర్శించారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం, ప్రత్యేకహోదా విషయంలో మాటమార్చడం, నాలుగేండ్లపాటు బీజేపీతో కలిసి అధికారం పంచుకుని ఇప్పుడు కొత్తగా కాంగ్రెస్‌తో జతకట్టడం వంటివి బాబు మార్కు ద్వంద్వ వైఖరులని వ్యాఖ్యానించారు. చంద్రబాబు పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని చెప్పారు. ప్రభుత్వంపై తాము చేస్తున్న పోరాటానికి క్లైమాక్స్ పాదయాత్ర అని తెలిపారు. బాబు ప్రచారంచేసిన తెలంగాణలో సెటిలర్లు ఎక్కువున్న ప్రాంతంలో టీడీపీ 40-50 వేల ఓట్ల తేడాతో ఓడిపోయిందని, బాబుపై సెటిలర్లకే ఇంతకోపం ఉందంటే ఇక ఏపీలో ఎంతకోపం ఉందో అర్థం చేసుకోవచ్చునని జగన్ వ్యాఖ్యానించారు. 'ప్రత్యేక హోదాకు అనుకూలంగా కేసీఆర్ మాట్లాడినదానిని స్వాగతించాలి. పక్కరాష్ట్రం ముఖ్యమంత్రి ఒక అడుగుముందుకేసి అవసరమైతే ఏపీకి ప్రత్యేక హోదాకోసం కేంద్రానికి లేఖ రాస్తానని ముందుకురావడం హర్షణీయం' అని జగన్ అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీలతో పోరాడి కేసీఆర్ గెలిచారన్నారు. గత ఐదేండ్లలో కేసీఆర్.. కాంగ్రెస్, బీజేపీతో సంసారం చేయలేదని అన్నారు. హరికృష్ణ మృతదేహం పక్కనుండగా.. కలిసి పోటీచేద్దామని కేటీఆర్‌తో చం ద్రబాబు మాట్లాడారని గుర్తుచేశారు. 'మేం గతంలో ఎవరితోనూ పొత్తు పెట్టుకోలేదు. ఈసారి కూడా పొత్తు పెట్టుకోము' అని స్పష్టంచేశారు. తాను ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే పదవికి రాజీనామాచేసి వెళ్లిపోతానని తెలిపారు. 'భావసారూప్యమున్న పార్టీలు కలిసి ఫెడరల్‌ఫ్రంట్‌గా ఏర్పడితే.. కేంద్రంలో కీలకపాత్ర పోషించవచ్చు. ఫ్రంట్ అభ్యర్థే ప్రధాని కావచ్చు. అప్పుడు మనకు ఇంకా ఎక్కువ న్యాయం జరుగుతుంది' అని జగన్ పేర్కొన్నారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.52 గంటలకు



సూర్యాస్తమయం: 5.52 గంటలకు

విళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం కృష్ణపక్షం, అమావాస్య ఉదయం 7.00 వరకు, తదుపరి పుష్యమాసం శుక్లపక్షం, పాడ్యమి, నక్షత్రం: పూర్వాషాఢ సాయంత్రం 5.44 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, అమృతఘడియలు: మధ్యాహ్నం 12.25 నుంచి 2.01 వరకు, రాహుకాలం: సాయంత్రం 4.30 నుంచి 5.52 వరకు, దుర్ముహూర్తం: సాయంత్రం 4.24 నుంచి 5.08 వరకు, వర్జ్యం: లేదు.

లోకం పోకడ



నాకు సాధ్యం కాని హామీలను నా సిన్మా పాత్ర ద్వారా అమలు చేయించండి డైరెక్టర్ గారూ!



పర్యాటకులకు లక్నవరం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సు పర్యాటకులను, ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటున్నది. దట్టమైన అడవి.. చుట్టూ ఎత్తయిన కొండలు.. ఆ కొండల నడుమ సరస్సు.. మధ్యలో చిన్న చిన్న దీవులు.. వేలాడే వంతెనలు పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. మొదటి వేలాడే వంతెనకు తోడు పర్యాటకశాఖ ఇటీవలే రెండోవేలాడే వంతెనను అందుబాటులోకి తెచ్చింది. దీంతో రోజురోజుకు లక్నవరం సరస్సుకు పర్యాటకుల తాకిడి పెరుగుతున్నది.

-గోవిందరావుపేట (జయశంకర్ భూపాలపల్లి)




శనివారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును కలుసుకొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, ఆశన్నగారి జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బానోత్ మదన్‌లాల్, కోరం కనకయ్య, నల్లాల ఓదెలు

హైదరాబాద్ మెట్రో సూపర్

- ప్రపంచ ఉత్తమ మెట్రో ప్రాజెక్టుల్లో ఇదొకటి
- ఫ్రెంచ్ నేషనల్ రైల్వేస్ చైర్మన్ గులియంపెపీ ప్రశంస

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ప్రపంచంలోని ఉత్తమమైన మెట్రోరైలు ప్రాజెక్టుల్లో హైదరాబాద్ మెట్రో ఒకటని ఫ్రెంచ్ నేషనల్ రైల్వేస్ చైర్మన్ గులియం పెపీ కితాబిచ్చారు. ప్రయాణికులను సంతృప్తిపరిచే విషయంలో ఇటీవల ప్రపంచవ్యాప్తంగా జరిగిన సర్వేలో హైదరాబాద్ మెట్రోరైలు నంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. శనివారం హైదరాబాద్ మెట్రోరైలును ఆయన సందర్శించారు. ఎండీ ఎన్వీఎస్ రెడ్డితో సమావేశమై మెట్రోప్రాజెక్టులపై చర్చించారు. ఇతర మెట్రోలతో పోలిస్తే దీని పని తీరు బాగుందన్నారు. కియోలిస్ కంపెనీ హైదరాబాద్‌తోపాటు అనేక మెట్రోరైళ్లను ఆపరేటింగ్ చేస్తున్నదని, లైట్‌రైల్, ట్రామ్‌వే, బస్‌సిస్టమ్స్ వంటి వాటి ని ప్రపంచ వ్యాప్తంగా అనేక నగరాల్లో ఆపరేటింగ్ చేస్తున్నదని చెప్పారు. ఆపరేషన్స్, సమయపాలన అత్యుత్తమంగా ఉన్నదని తెలిపారు. అడ్డంకులను అధిగమించి పాదచారుల బాటలను స్టేషన్ పరిసరాలను అభివృద్ధి చేయడం గొప్ప విషయమన్నారు. ఫ్రాన్స్‌లోని రైల్వే హెడ్‌క్వార్టర్స్‌ను సందర్శించాలని ఎన్వీఎస్‌రెడ్డిని పెపీ కోరారు. హైదరాబాద్ మెట్రోరైలు సక్సెస్ స్టోరీని తమ అధికారులకు బోధించాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా త్వరలో చేపట్టనున్న రెండోదశ మెట్రో వివరాలను పెపీకి ఎన్వీఎస్ రెడ్డి వివరించారు. గ్లోబల్‌సిటీగా హైదరాబాద్ అభివృద్ధి చెందుతున్న క్రమంలో తీసుకున్న చర్యలను వివరించారు. పీపీపీ మోడల్, స్టేషన్ డిజైన్ల ప్రత్యేకతను చెప్పారు. ఎన్వీఎస్ రెడ్డి రాసిన 'హైదరాబాద్ గ్రోయింగ్ గ్లోబల్' పుస్తకాన్ని పెపీకి ఎన్వీఎస్ రెడ్డి బహూకరించారు.



శనివారం 'హైదరాబాద్ గ్రోయింగ్ గ్లోబల్' పుస్తకాన్ని ఫ్రెంచ్ నేషనల్ రైల్వేస్ చైర్మన్ గులియం పెపీకి బహూకరిస్తున్న హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి

వెటర్నరీ సైన్స్ కోర్సులో 15శాతం అఖిలభారత కోటా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బ్యాచ్‌లర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ కోర్సులో ప్రవేశం పొందగోరే వారు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే నీట్ (యూజీ) –2019 హాజరుకావాలని భారత పశు వైద్య మండలి శనివారం నోటిఫికేషన్ జారీచేసింది. నీట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు గుర్తింపుపొందిన పశు వైద్య కళాశాలల్లో 15 శాతం అఖిలభారత కోటా ఉంటుందని పేర్కొన్నది.

ఒకే తరహా సేవలే లక్ష్యం

- పోలీసులకు డీజీపీ దిశానిర్దేశం
- పక్షం రోజుల పాటు గ్రామాల్లో సమస్యలు తెలుసుకోవాలి
- రాష్ట్రంలోని ఎస్‌హెచ్‌వోలతో డీజీపీ వీడియోకాన్ఫరెన్స్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో ఒకే తరహా సేవలందించేందుకు పూర్తిస్థాయిలో సమాయత్తం కావాలని డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి పోలీసు సిబ్బందికి పిలుపునిచ్చారు. సమస్యతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి పౌరుడికీ నాణ్యమైన సేవలను ఫ్రెండ్లీ విధానంలో అందించాలన్న లక్ష్యాన్ని చేరుకునేందుకు చేయాల్సిన మార్పులపై డీజీపీ వివరించారు. 2019 ఏడాదిని 'సిటిజన్ ఫ్రెండ్లీ యూనిఫాం సర్వీస్ డెలివరీ'గా ప్రకటించిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై శనివారం రాష్ట్ర వ్యాప్తంగా 710 ఠాణాల్లోని స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో డీజీపీ మహేందర్‌రెడ్డి పోలీస్ కేంద్ర కార్యాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. 'వన్ స్టేట్..వన్ సర్వీస్..వన్ ఎక్స్‌పీరియెన్స్ ఫర్ ఆల్ సిటిజన్స్, ఆల్ టైమ్స్'అన్న నినాదంతో ఈ ఏడాది పోలీస్ లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు.

నేటి నుంచి గ్రామాల్లోకి వెళ్లండి

పౌరులకు ఉత్తమ సేవలందించేందుకు పోలీసులు ఆదివారం నుంచి పల్లెబాట పట్టాలని, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, పోలీసు శాఖ పరంగా చేయాల్సిన పరిష్కారాన్ని నిర్దేశించుకోవాలని డీజీపీ సూచించారు. పదిహేను రోజులపాటు ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లోకి వెళ్లి స్థానికులతో మమేకమైన శాంతి భద్రతలపై చర్చించాలని చెప్పారు. అన్ని సమస్యలు గుర్తించిన తర్వాత వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నదానిపై తానే స్వయంగా అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలతో మరోమారు వీడియోకాన్ఫెరెన్స్ ద్వారా చర్చిస్తానని డీజీపీ తెలిపారు. ఎవరు తప్పు చేసినా శిక్షపడక తప్పదు అన్న భావన కలిగించడమే దీని ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఈ–చలాన్, టీఎస్‌కాప్ విధానాన్ని టెక్నాలజీ ఆధారంగా క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుడికి అక్కడ ఏ ర్యాంక్ అధికారి ఉన్నా ఒకే తరహాలో పోలీస్ సేవలందించేలా సుశిక్షితులు కావాలన్నారు. పోలీస్ స్టేషన్‌లో పని చేసే ప్రతి ఒక్కరికీ రోల్ క్లారిటీ తప్పక ఇవ్వాలని తెలిపారు.

నీటిపారుదలశాఖలో దశాబ్దాల సమస్యకు చెక్

- పదోన్నతుల్లో జోన్ల మధ్య అసమానతల తొలగింపునకు కసరత్తు
- సూపర్‌న్యూమరరీ పోస్టులతో పరిష్కరించాలన్న సీఎం కేసీఆర్
- హర్షం వ్యక్తంచేసిన విశ్రాంత ఇంజినీర్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నీటిపారుదలశాఖలో దశాబ్దాలుగా నానుతున్న సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ప్రమోషన్ల విషయంలో తీవ్ర అసంతృప్తితో ఉన్న ఇంజినీర్లకు న్యాయం చేయనున్నది. ఇతర ఇంజినీర్లకు ఏమాత్రం ఇబ్బంది లేకుండా సమస్య పరిష్కార దిశగా అడుగులు వేస్తున్నది. పోలీసు శాఖలో మాదిరిగా సూపర్‌న్యూమరరీ పోస్టులతో జోన్ల మధ్య ఉన్న అసమానతలను తొలగించాలని సీఎం కేసీఆర్ ఇటీవల అధికారులకు సూచించినట్టు తెలిసింది. నీటిపారుదలశాఖలో దశాబ్దాలుగా పదోన్నతుల విషయంలో ఒక జోన్‌కు సంబంధించినవారు అసంతృప్తితో ఉన్నారు. ఈ అంశం న్యాయస్థానాల పరిధిలోకి కూడా వెళ్లింది. సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై విశ్రాంత ఇంజినీర్లతో ఇటీవల సీఎం కేసీఆర్ సమావేశమైన సందర్భంగానూ ఈ అంశం ప్రస్తావనకు వచ్చినట్టు తెలిసింది. రెండు జోన్ల మధ్య చీఫ్ ఇంజినీర్, ఎస్‌ఈ, ఈఈ వంటి పోస్టుల ఉద్యోగోన్నతుల్లో అసమానతలున్నట్టు విశ్రాంత ఇంజినీర్లు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ ఈ అంశంపై వెంటనే స్పందించినట్టు సమాచారం. అక్కడే ఉన్న సీఎస్ ఎస్కే జోషితోనూ మాట్లాడారు. ఎవరికి అన్యాయం జరగకుండా అర్హులందరికీ ప్రమోషన్లు వచ్చేలా ఈ ప్రక్రియ నిర్వహించాలని సీఎం అన్నట్టు తెలిసింది. దీనిపై సీఎంవో ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే, తెలంగాణ ఇంజినీర్స్ జేఏసీ చైర్మన్ వెంకటేశం ప్రత్యేకంగా సమావేశమై సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై ప్రతిపాదనలు చేయాలని సీఎం ఆదేశించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో నీటిపారుదలశాఖలో చీఫ్ ఇంజినీర్ పోస్టులు 6–8 వరకు, సూపరింటెండెంట్ ఇంజినీర్ పోస్టులు 8–10 వరకు పెరిగే అవకాశాలున్నాయి. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యపై సీఎం కేసీఆర్ పరిష్కార మార్గాన్ని చూపటంపై విశ్రాంత ఇంజినీర్ల అసోసియేషన్ (ట్రీ) హర్షం వ్యక్తంచేసింది. ట్రీ అధ్యక్షుడు చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి శ్యాంప్రసాద్‌రెడ్డి, హైదరాబాద్ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేందర్, ప్రధాన కార్యదర్శి చక్రధర్ సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

యాదాద్రి ఆలయం..
తెలంగాణ సాంస్కృతిక దర్పణం

- జీవన విధానం, పండుగలు, ఆటలతో ఆకట్టుకొంటున్న స్తంభాలు
- బతుకమ్మలు, ఉగాది కోకిలలతో కనువిందు
- భవిష్యత్ తరాలకు చరిత్రను చాటిచెప్పేందుకు కృషి

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణం అద్భుతమైన శిల్ప కళాఖండాలకు చిరునామాగా మారుతున్నది. యాదాద్రిలో చేపడుతున్న నిర్మాణాలు శిల్పశాస్త్రానికి, స్థపతులకు, భవిష్యత్ తరాలకు మార్గదర్శనంగా ఉండేలా రూపుదిద్దుకొంటున్నదని ప్రశంసలు వస్తున్నాయి. ప్రస్తుతం ఆలయ ముఖ మండపం పనులు పూర్తయ్యాయి. యాదాద్రి గర్భగుడిపై శయన, స్థానక నరసింహుల విగ్రహాల ప్రతిష్ఠాపన పూర్తయింది. ఉపాలయాలు, క్షేత్రపాలక ఆంజనేయస్వామి ఆలయం సిద్ధమయింది. గర్భాలయ గోడలపై ప్రహ్లాదుడి జీవితచరిత్ర ఘట్టాలను వెండితో తయారుచేయించి క్లాడింగ్ చేపట్టేందుకు కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. ఆలయ పునర్నిర్మాణ పనులు పాత, కొత్తల మేళవింపుగా కొనసాగుతున్నాయి. రాతి స్తంభాలపై తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలను ప్రతిబింబించేలా బతుకమ్మ, తంగేడు పూలు, ఉగాది పచ్చడి షడ్రుచులు, దీపావళి పటాకులను తీర్చిదిద్దారు. పాతకాలం నాణేలు, మన వ్యవసాయ విధానాలు.. కర్రసాముతోపాటు క్రికెట్, హాకీ, టెన్నిస్ వంటి ఆటలు.. గాంధీ, ఛత్రపతి శివాజీ శిల్పాలను మదిని దోచేలా మలిచిన తీరు ఆశ్చర్యంలో ముంచెత్తుతున్నది. శృంగారానికి కూడా ప్రాధాన్యం ఇస్తూ ఖజురహో శిల్పసంపదను మన కండ్ల ముందుంచే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మార్గదర్శనంలో కొత్తరూపు సంతరించుకొంటున్న యాదాద్రిలో ప్రతి రాతిస్తంభం ఎంతో విశిష్టమైనదిగా రూపుదిద్దుకొంటున్నది. శ్రీవారిని దర్శించుకొని వచ్చే భక్తులు ఆలయ బాహ్యప్రాకారాలలో సేదతీరే అవకాశం కల్పిస్తూ.. అక్కడి నుంచి నిశితంగా గమనించేందుకు వీలుగా ఈ ఏర్పాటుచేస్తున్నారు. ఈశాన్య అష్టభుజి మండపం బాలపాద స్తంభంపై చేనేత వస్త్రాలను అందంగా తీర్చిదిద్దారు. భవిష్యత్ తరాలకు తెలంగాణ చరిత్రను చాటిచెప్పేందుకు పడిన తపన కండ్లకు అద్దినట్టుగా కనిపిస్తున్నది.



యాదాద్రిలో కొనసాగుతున్న ఆలయ నిర్మాణ పనులు, (ఇన్‌సెట్) తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా రూపుదిద్దుకున్న శిల్పాలు

విమానగోపురంపై జయవిజయులు

ఇప్పటికే ఏడు రాజగోపురాలను పూర్తిచేసిన అధికారులు.. బంగారుమయం కానున్న విమానగోపురం విషయంలో మిగతా ఆలయాలకు భిన్నంగా రూపుదిద్దేందుకు చర్యలు తీసుకొంటున్నారు. ఆలయ మహారాజ గోపురాలకు కుడిఎడమలుగా జయవిజయులను ప్రతిష్ఠించడం ఆనవాయితీ. దేశంలోనే ఎక్కడాలేని విధంగా జయవిజయుల విగ్రహాలను విమానగోపురంపై ప్రతిష్ఠించనున్నారు. జయవిజయుల విగ్రహాలను ఏర్పాటుచేసేందుకు భారీక్రేన్లను సిద్ధంగా ఉంచారు.

త్వరలో సీఎం కేసీఆర్ పరిశీలన..

యాదాద్రిలో జరుగుతున్న పునర్నిర్మాణ పనులను పరిశీలిచేందుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు రెండు, మూడురోజుల్లో రానున్నట్టు అధికారికంగా సమచారం అందింది. పనుల అభివృద్ధిని సీఎంకు నివేదించేందుకు సీఎంవో ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి ఆదివారం యాదాద్రికి వస్తున్నారు. దుమ్ముధూళితో నిండిపోయిన ముఖమండపం ప్రాంతాన్ని శుభ్రపరిచే పనులను ఇప్పటికే వైటీడీఏ అధికారులు చేపట్టారు. పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేసేందుకు సిబ్బంది, శిల్పకళాకారులపై వైటీడీఏ వైస్‌చైర్మన్ కిషన్‌రావు ఒత్తిడి పెంచుతున్నారు.

కాళేశ్వరం పనుల్లో వేగం పెంచాలి

- వానకాలం పంటకు నీరందించేందుకు సిద్ధం కావాలి
- సీఎంవో కార్యదర్శి స్మితాసబర్వాల్ ఆదేశం
- 8వ ప్యాకేజీ వద్దకు హెలీకాప్టర్‌లోవచ్చి 6,7 ప్యాకేజీ పనుల పరిశీలన

రామడుగు/ధర్మారం: వచ్చేవానకాలం పంటకు నీరందించేలా కాళేశ్వరం ప్రాజెక్ట్ అనుబంధ ప్యాకేజీ పనుల్లో వేగంపెంచాలని ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి స్మితాసబర్వాల్ అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని కాళేశ్వరం ఎనిమిదో ప్యాకేజీ వద్దకు హెలికాప్టర్‌లో చేరుకున్నారు. వాహనాల్లో పెద్దపల్లి జిల్లా ధర్మారం మండ లం నందిమేడారం ఆరో ప్యాకేజీకి వెళ్లిన స్మితాసబర్వాల్.. సీఎంవో ఓఎస్డీ దేశ్‌పాండే, కాళేశ్వరం ప్రాజెక్ట్ సీఈ నల్ల వెంకటేశ్వర్లు, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల కలెక్టర్లు శ్రీదేవసేన, సర్ఫరాజ్ అహ్మద్, పెద్దపల్లి జేసీ వనజాదేవి తదితరులతో కలిసి పంప్‌హౌస్‌ను, మల్లాపూర్‌లోని ఏడో ప్యాకేజీ పనులను సందర్శించారు. సుమారు 15 కిలోమీటర్లు ప్రధాన కుడి సొరంగ మార్గం ద్వారా వాహనాల్లో లక్ష్మీపూర్ ఎనిమిదో ప్యాకేజీ చేరుకున్నారు. పంపుహౌస్‌లో బాహుబలి మోటర్లను పరిశీలించారు. ఇప్పటికే నాలుగు మోటర్ల డ్రైరన్ నిర్వహించగా మరో మోటర్ డ్రైరన్ ఈ నెల చివరివారంలో చేపట్టనున్నట్టు సీఈ వెంకటేశ్వర్లు వివరించారు. అనంతరం నంది మేడారం రిజర్వాయర్ కట్ట మీదుగా ఏడో ప్యాకేజీ 0 కిలోమీటర్‌వద్దకు చేరుకుని రెగ్యులేటర్ నిర్మాణాన్ని, గ్రావిటీ కెనాల్‌ను ఆమె పరిశీలించారు. అదే గ్రావిటీ కాల్వద్వారా ధర్మారంలోని కటికెనపల్లి నుంచి బంజేరుపల్లి శివారులోని ఏడో ప్యాకేజీ ఆడిట్–1కు చేరుకుని అండర్ టన్నెల్‌ను పరిశీలించారు. ప్యాకేజీలో మిగతా ఎడమ, కుడి టన్నెళ్లలో సీసీ, బెంచ్ వర్క్ పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం ప్రాజెక్టు అధికారులు, మెగా, మ్యాక్స్ కంపెనీ ప్రతినిధులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. కాళేశ్వరం పర్యటన సందర్భంగా సీఎం కేసీఆర్ ఇచ్చిన ఆదేశాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఎస్‌ఈ సుధాకర్‌రెడ్డి, ఈఈ నూనె శ్రీధర్, డీఈ గోపాలకృష్ణ, ఏఈఈలు శ్రీనివాస్, సురేశ్, రమేశ్‌నాయక్, వెంకటేశ్, మెగా ఎండీ కృష్ణారెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మ్యాక్స్ ఇన్‌ఫ్రా చైర్మన్ ఫణికుమార్ రెడ్డి పాల్గొన్నారు.



పెద్దపల్లి జిల్లా మల్లాపూర్ ఏడో ప్యాకేజీలో అధికారులకు సూచనలిస్తున్న సీఎంవో కార్యదర్శి స్మితాసబర్వాల్

పోలవరంలో మరో కుంభకోణం

- తెలుగు తమ్ముళ్ల జేబుల్లోకి రూ.13 కోట్లు?
- భూసేకరణలో పెద్దమొత్తంలో అవినీతి
- అవినీతి నిజమేనని తేల్చిన కేఆర్‌పురం ఐటీడీఏ పీవో
- ఎనిమిది మంది ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

అమరావతి (పశ్చిమ గోదావరి) నమస్తే తెలంగాణ: పోలవరం భూబాగోతంలో మరో అవినీతి బయటపడింది. దాదాపు రూ.13 కోట్ల మేర అవినీతి చోటుచేసుకున్నట్టు తెలిసింది. భూసేకరణలో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టిన కేఆర్ పురం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ హరేంద్రియప్రసాద్.. దాదాపు రూ.13 కోట్ల మేర అవినీతి జరిగినట్టు గుర్తించారు. జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి, చల్లావారిగూడెం, మంగిశెట్టిగూడెం తదితర గ్రామాల్లో సేకరించిన వెయ్యెకరాల భూమిలో తెలుగు తమ్ముళ్ల అవినీతి బట్టబయలైంది. రాళ్ల క్వారీలో జీడిమామిడితోట ఉన్నట్టు.. పామాయిల్, కోకో తోటలు ఉన్నట్టు, అసలే లేని టేకు, వేపచెట్లను ఉన్నట్టుగా నమోదుచేసి పెద్దమొత్తంలో పరిహారాన్ని దిగమింగిన వైనం బహిర్గతమైంది. ఈ అవినీతి నిరూపణ కావడంతో ఇప్పటికే ఎనిమిది మంది ఉద్యోగులను పీవో హరేంద్రియప్రసాద్ సస్పెండ్ చేశారు. కొందరు టీడీపీ నేతలకు రికవరీ నోటీసులు పంపించి.. సొమ్ము చెల్లించపోతే కఠిన చర్యలుంటాయని కూడా హెచ్చరించారు.

పేరు గొప్ప ప్రాజెక్టుకు రోడ్డు కూడా దిక్కులేదు

పోలవరం ప్రాజెక్టుకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నామంటూ చెప్పుకొంటున్న ప్రభుత్వం.. నాలుగున్నరేండ్లు గడిచినా కనీసం సరైన రోడ్డు కూడా నిర్మించలేకపోయింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పోలవరం చేరుకోవాలంటే సింగిల్ రోడ్డుగా ఉన్న ఏటిగట్టు మార్గమే దిక్కు. 60కిపైగా మలుపులతో ప్రమాదకరంగా ఉన్నప్పటికీ.. ఈ రోడ్డు విస్తరణకు నోచుకోలేదు. ప్రాజెక్టు నిర్మాణ పనులకు వినియోగించే భారీ యంత్రాలన్నీ ఈ రోడ్డు గుండానే చేరాల్సి ఉంటుంది. పోలవరం నుంచి కొవ్వూరు వరకున్న ఐదున్నర మీటర్ల వెడల్పాటి రోడ్డు మూడున్నర మీటర్లకు కుచించుకుపోయి.. ప్రక్కిలంక నుంచి పోలవరం వరకు అధ్వానంగా మారింది. ఒక వాహనం వెళ్తుంటే మరో వాహనం పక్కకు తప్పుకోవడానికి పాట్లు పడాల్సిన పరిస్థితి నెలకొన్నది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తాత్కాలిక మరమ్మతులకు కూడా నోచుకోలేదు. సీఎం చంద్రబాబు, మంత్రులు, ఉన్నతాధికారులు ఇదే రోడ్డు గుండా వెళ్తూ పట్టించుకోకపోవడం గమనార్హం.

రికార్డు సమయంలో కేటీపీఎస్ పూర్తి

- 46 నెలల్లోనే 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంటు పూర్తిచేశాం: బీహెచ్ఈఎల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రికార్డు స్థాయిలో 46 నెలల్లోనే కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ ప్రాజెక్టుకు సంబంధించిన 800 మెగావాట్ల థర్మల్ యూనిట్‌ను పూర్తిచేశామని బీహెచ్ఈఎల్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. విజయవంతంగా పూర్తయిన ఈ ప్రాజెక్టు.. ప్రస్తుతం వాణిజ్యపరమైన ఆపరేషన్‌కు సిద్ధంగా ఉన్నదని తెలిపింది. ఈ ప్రాజెక్టును ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) విధానంలో తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (టీఎస్‌జెన్‌కో) తమకు అప్పగించినట్టు పేర్కొన్నది. దీంతోపాటు టీఎస్‌జెన్‌కోకు చెందిన యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయని తెలిపింది.

పూలు, పండ్ల ఎగుమతికి
వేపర్ హీట్ ట్రీట్‌మెంట్

- వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ నుంచి ఇతర దేశాలకు ఎగుమతి చేసే పండ్లు, కూరగాయలు, పూలకు వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ అవసరమని వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి తెలిపారు. శనివారం కొండా లక్ష్మణ్ ఉద్యాన వర్సిటీలోని సమీకృత ప్యాక్‌హౌస్‌లో ఆధునిక సదుపాయాల కల్పన, ఉన్నతీకరణపై ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది మామిడి పండ్లను ప్లాంట్ కోరంటిన్ ధ్రువీకరణ ద్వారా ఇతర దేశాలకు ఎగుమతి చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. సమీకృత ప్యాక్‌హౌస్‌ను ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఉద్యానశాఖ సంచాలకుడు ఎల్ వెంకట్రామ్‌రెడ్డి, ఎయిర్‌పోర్ట్ సస్యరక్షణ అధికారి నీరజ్‌కుమార్, యూ ధర్మారావు, ఆర్పీ నాయుడు పాల్గొన్నారు.

బాబు, రాహుల్‌ను
ప్రజలు తిరస్కరిస్తారు

- లోక్‌సభ ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు 16 స్థానాలు ఖాయం
- రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ డాక్టర్ రాకేశ్ చిరుమిల్ల



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: స్వార్థ రాజకీయాలు, కుట్రలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన చంద్రబాబుకు, జాతీయ స్థాయిలో పప్పు రాజకీయాలు చేస్తున్న రాహుల్‌గాంధీకి తెలుగు ప్రజలు మరోసారి బుద్ధిచెప్పడానికి సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ డాక్టర్ రాకేశ్ చిరుమిల్ల శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్ నోట ఫెడరల్ ఫ్రంట్ పేరు వినగానే జాతీయ పార్టీలకు భయం పట్టుకొన్నదని, ముఖ్యంగా చంద్రబాబు, రాహుల్‌గాంధీకి కునుకులేకుండా చేసిందన్నారు. టీఆర్ఎస్ 16 లోక్‌సభ స్థానాల్లో గెలుస్తుందని జాతీయ సర్వేలు చెప్తున్నాయని, ముమ్మాటికీ జరగబోయేది అదేనని స్పష్టంచేశారు.

బీఆర్ వాహనాల
బకాయిలు చెల్లించండి

కాంగ్రెస్ నేతలు జానా, షబ్బీర్‌కు ఇంటెలిజెన్స్ నోటీసులు

వీరిద్దరూ బకాయిపడింది.. రూ.9 లక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బందోబస్తు కోసం బుల్లెట్ రెసిస్టెంట్ వాహనాలు వాడుకొన్న బకాయిలు చెల్లించాలని తెలంగాణ ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్.. కాంగ్రెస్ నేతలు జానారెడ్డి, షబ్బీర్‌అలీకి నోటీసులిచ్చింది. నోటీసులు టీపీసీసీ జనరల్ సెక్రటరీ (అడ్మిన్)కు పంపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో భద్రత కోసం ఇచ్చే బీఆర్ వాహనాలకు సదరు నాయకులే పూర్తి ఖర్చులు భరించాల్సి ఉంటుంది. ఆ ప్రకారం బీఆర్ వాహనాల వినియోగానికి ప్రతి కిలోమీటర్‌కు రూ.371 చొప్పున, రోజుకు డ్రైవర్ బత్తా రూ.100 చొప్పున చెల్లించాల్సి ఉంది. దీని ప్రకారం ఎమ్మెల్సీ షబ్బీర్‌అలీ 90 రోజులపాటు 12,728 కిలోమీటర్లు వాడినందుకు మొత్తం రూ.4,79,936, జానారెడ్డి 83 రోజులపాటు 11,152 కిలోమీటర్లు వాహనాన్ని వాడినందుకు రూ.4,20,924 కలిపి మొత్తం రూ.9,00,860 బకాయి చెల్లించాలని నోటీసులో పేర్కొన్నారు. షబ్బీర్‌అలీ, జానారెడ్డితోపాటు మరికొందరు ప్రజాప్రతినిధులకు కూడా నోటీసులు వెళ్లినట్టు సమాచారం.

తెలంగాణ హజ్ కోటా ఖరారు

రాష్ట్రం నుంచి 4,169 మందికి అవకాశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హజ్ కమిటీ ఆఫ్ ఇండియా-2019కు తెలంగాణ రాష్ట్ర హజ్ యాత్రికుల కోటాను ఖరారు చేసింది. రాష్ట్రం నుంచి 4,169 మంది హజ్‌యాత్రకు వెళ్లడానికి అవకాశం కల్పించారని తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్ మహమ్మద్ మసిఉల్లాఖాన్, స్పెషల్ ఆఫీసర్ షుకూర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 70 ఏండ్లకు పైబడినవారు 484 మంది ఉన్నారన్నారు. వారిని లాటరీ లేకుండా హజ్‌కు వెళ్లడానికి ఎంపిక చేస్తామన్నారు. ఇప్పటి వరకు హజ్‌యాత్రకు వెళ్లడానికి 13,368 మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. త్వరలో లాటరీ పద్ధతిలో యాత్రికులను ఎంపికచేస్తామని చెప్పారు.



శనివారం ఎంపీ కవితను ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్తున్న హోంమంత్రి మహమూద్‌అలీ దంపతులు





• ఎంపీ కవితకు శుభాకాంక్షలు

శనివారం నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవితను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న తెలంగాణ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్ . నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవితతో తెలంగాణ గ్రూప్-1 అధికారుల సంఘం అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ భేటీ అయ్యారు. రెండోసారి టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్‌తోపాటు నేతలు హన్మంత్‌నాయక్, హరికిషన్ కూడా ఉన్నారు. **- హైదరాబాద్, నమస్తే తెలంగాణ**



• ట్రస్మా క్యాలెండర్ ఆవిష్కరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) క్యాలెండర్‌ను నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత ఆవిష్కరించారు. శనివారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో క్యాలెండర్ ఆవిష్కరణ అనంతరం రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. విద్యాశాఖ కమిషనర్‌తో మాట్లాడి ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారని సంఘం రాష్ట్ర నాయకులు యాదగిరి శేఖర్‌రావు తెలిపారు. నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, సిద్దిపేట పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు తనకు అవకాశం ఇవ్వాలని కవితను కోరినట్టు చెప్పారు. కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.



శనివారం సీఎస్ ఎస్కే జోషిని మర్యాదపూర్వకంగా కలిసిన టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేందర్, బండారు రేచల్

సీపీఎస్ రద్దు సమ్మెకు మద్దతు

- పోస్టర్ విడుదలచేసిన టీఎన్జీవోలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సీపీఎస్ రద్దుచేయాలని డిమాండ్‌చేస్తూ దేశవ్యాప్తంగా ఏఐఎస్‌జీఈఎఫ్ తలపెట్టిన సమ్మెకు మద్దతు తెలుపుతున్నట్టు టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి చెప్పారు. శనివారం టీఎన్జీవో కేంద్ర కార్యాలయంలో నిరసన ప్రదర్శన పోస్టర్‌ను ఆయన విడుదలచేశారు. సీపీఎస్ రద్దు విషయంలో కేంద్ర ప్రభుత్వం వింత వైఖరి అవలంబిస్తున్నదన్నారు. సీపీఎస్ రద్దు కోసం ఈనెల 8వ తేదీన భోజన విరామ సమయంలో కలెక్టరేట్ల ఎదుట ప్రదర్శనలు, 9న రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు జరుపుతామని తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మామిండ్ల రాజేందర్, అసోసియేట్ అధ్యక్షురాలు బండారు రేచల్, కోశాధికారి రామినేని శ్రీనివాస్‌రావు, ప్రతాప్, కొండల్‌రెడ్డి, కస్తూరి వెంకటేశ్వర్లు, నజీర్‌అహ్మద్, శ్రీకాంత్, అశోక్, రంగారెడ్డి, లక్ష్మణ్, వెంకటేశ్వర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌తో ఎన్జీవోల భేటీ

తెలంగాణ ఎన్జీవోల సంఘం సెంట్రల్ యూనియన్ ప్రతినిధులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషితో భేటీ అయ్యారు. సీపీఎస్ రద్దు విషయమై సీఎస్‌కు సమాచారం ఇచ్చామని టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సీఎస్‌కు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

రైతుబీమా పథకం దేశానికి దిక్సూచి

- సామాజిక సేవాకార్యక్రమాలకు ముందుకురావాలి
- ఎయిమ్స్ రావడంలో బూర నర్సయ్యది ముఖ్యపాత్ర
- టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశంస

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో రైతులకు ప్రవేశపెట్టిన రైతుబీమా పథకం దేశానికి దిక్సూచిగా నిలుస్తున్నదని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు అన్నారు. సామాజిక సేవాకార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తాయని చెప్పారు. తెలంగాణభవన్‌లో శనివారం భువనగిరి ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ఆధ్వర్యంలోని బూర లక్ష్మయ్య రాజమ్మ (బీఎల్ఆర్) ఫౌండేషన్ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ప్రమాద బీమా గ్రూప్ ఇన్సూరెన్స్ స్కీం కింద 60 కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కుటుంబ పెద్ద అకస్మాత్తుగా మరణిస్తే ఆ కుటుంబం రోడ్డున పడొద్దనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ రైతుబీమా పథకాన్ని తెచ్చారని చెప్పారు. దేశవ్యాప్తంగా ఈ పథకానికి ప్రశంసలు లభిస్తున్నాయని, రాష్ట్రంలో 18-60 సంవత్సరాల వయసున్న 40 లక్షల మంది రైతులకు ఇన్సూరెన్స్ సౌకర్యం ఉందని తెలిపారు. సీఎం కేసీఆర్ ఏ పథకం అమలుచేసినా అందులో మానవీయకోణం దాగిఉంటదన్నారు. అసంఘటిత కార్మికులు, భవన నిర్మాణ కార్మికులకు కూడా ప్రభుత్వం బీమా అమలుచేస్తున్నదన్నారు. పేదవారి కోసం ప్రమాద బీమాను ప్రవేశపెట్టిన ఎంపీ బూర నర్సయ్యగౌడ్‌ను కేటీఆర్ అభినందించారు. గీత కార్మికుల సమస్యలపై బూర నర్సయ్య ఎంతగానో కృషిచేస్తున్నారని చెప్పారు. నీరా పానీయాన్ని మార్కెట్లోకి తీసుకుపోవడానికి ప్రయత్నిస్తున్నారని, దీనిద్వారా చాలామందికి ఉపాధి దొరుకుతుందన్నారు. పార్టీ నాయకులు సామాజిక సేవాకార్యక్రమాల్లో పాల్గొనాలని, పేదలకు కులం, మతంతో సంబంధం లేకుండా పార్టీ నాయకులు సహాయం అందించాలన్నారు. 2009, 2010లో సిరిసిల్లలో 40వేల మంది నేతన్నలకు గ్రూప్ ఇన్సూరెన్స్ చేయించామని చెప్పారు. ఆత్మహత్యలు చేసుకున్న నేతన్నల కుటుంబాలకు కేసీఆర్ ఫౌండేషన్ ద్వారా రూ.50లక్షల సాయమందించామన్నారు. ప్రతి నాయకుడు వారి స్థాయిలో సేవచేయాలని కోరారు. ఎంపీ బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ తల్లిదండ్రుల పేరుమీదుగా ఫౌండేషన్ ప్రారంభించానని చెప్పారు.



శనివారం తెలంగాణభవన్‌లో లక్ష్మీనరసింహస్వామి వృత్తిదారుల ప్రమాదబీమా లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు. చిత్రంలో ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ఎమ్మెల్యే బాల్క సుమన్, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ మందుల సామేలు, మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం కూడా ఉన్నారు.

దేశవ్యాప్తంగా సంవత్సరానికి 1.25 లక్షల మంది చనిపోతున్నారని.. చనిపోయినవారి కుటుంబాలు రోడ్డునపడొద్దనే ఉద్దేశంతోనే గ్రూప్ ఇన్సూరెన్స్ పథకం ప్రారంభించామని తెలిపారు. ఇందులో ఇప్పటివరకు 1.17లక్షల మంది సభ్యులుగా చేరారని, గత పదినెలలకాలంలో 60 మంది చనిపోయారని చెప్పారు. శాశ్వత వికలాంగులకు కూడా రూ.5లక్షలు చెల్లిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బాల్క సుమన్, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ మందుల సామెల్, మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, క్యామ మల్లేశ్, కే శశిధర్‌రెడ్డి, ఎంపీపీ రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, కృష్ణగౌడ్, భాస్కర్‌రెడ్డి, లింగంగౌడ్, ధర్మేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయండి

- సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్
- ఎన్నికల సామగ్రి సిద్ధంగా ఉంచుకోవాలి
- పంచాయతీ ఎన్నికలపై సీఎస్ సమీక్ష
- పలు అంశాలపై ఎస్ఈసీ నాగిరెడ్డి, డీజీపీ మహేందర్‌రెడ్డితో చర్చ



శనివారం సచివాలయం నుంచి కలెక్టర్లు, ఎస్పీలతో పంచాయతీ ఎన్నికలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న సీఎస్ ఎస్కే జోషి. చిత్రంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి, డీజీపీ మహేందర్‌రెడ్డి కూడా ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి కోరారు. ఇందుకు కలెక్టర్లు, ఎస్పీలు, కమిషనర్లు సమన్వయంతో పని చేయాలని సూచించారు. శనివారం సచివాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి, డీజీపీ మహేందర్‌రెడ్డితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ పోలింగ్ సిబ్బందికి ఏదైనా అనుకోని సమస్య ఎదురైతే తక్షణమే స్పందించేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలని, ఆయన ఆ సమస్యను సిబ్బంది మొత్తానికి తెలుపాలని సీఎస్ సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి ఎన్నికల సిబ్బంది, పోలింగ్ మెటీరియల్, సెక్యూరిటీ సిబ్బంది, వాహనాలు, పోలింగ్‌స్టేషన్లు, కౌంటింగ్ హాళ్లు, డిస్ట్రిబ్యూషన్, స్టోరేజీ సెంటర్ల గుర్తింపు, బడ్జెట్ తదితర అంశాలపై వివరించారు. 25 రోజుల్లో ఎన్నికలు పూర్తికావాల్సి ఉన్నందున కలెక్టర్లు సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ నెల7న ఎన్నికల నిర్వహణ ప్రారంభమవుతుందని, అప్పటి నుంచే ఎన్నికలు ఏకగ్రీవం చేసుకోవచ్చని నాగిరెడ్డి తెలిపారు. పోలింగ్ స్టేషన్లు, కౌంటింగ్ హాళ్లతో పాటు ఉప సర్పంచ్‌ల ఎన్నిక నిర్వహణకు మీటింగ్ హాళ్లను ఎంపిక చేయాలని సూచించారు. జిల్లాల వారీగా పోలింగ్ స్టేషన్లలో సెక్యూరిటీ ప్లాన్‌ను రూపొందించుకోవాలని పేర్కొన్నారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వెబ్ క్యాస్టింగ్, వీడియో రికార్డింగ్‌లకు ఏర్పాట్లుచేయాలని పేర్కొన్నారు. డీజీపీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్పీలందరికీ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించిన అనుభవం ఉన్నదని, ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు, రీపోల్ జరుగలేదని అదే లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పోలింగ్ సిబ్బందిని రొటేషన్ పద్ధతిలో వినియోగించుకోవాలని చెప్పారు. అధికారుల మధ్య సత్సంబంధాలుండాలని డీజీపీ సూచించారు. అదనపు డీజీపీ జితేందర్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరుగడానికి గ్రామాలవారీగా సెన్సిటివ్ మ్యాపింగ్ చేయాలని సూచించారు. సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి రాజీవ్‌త్రివేదీ, పంచాయతీరాజ్ కమిషనర్ నీతూప్రసాద్, రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌తోనే 24 గంటల కరంటు

- అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపారు
- వీఏవోఏటీ డైరీ ఆవిష్కరణలో జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు



శనివారం విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు. చిత్రంలో సీఎండీలు రఘుమారెడ్డి, గోపాలరావు, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాస్‌రావు, ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ నర్సింహారావు, జెన్‌కో డైరెక్టర్ సీహెచ్ వెంకటరాజం తదితరులు కూడా ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అసాధ్యమనుకున్న తెలంగాణ రాష్ట్ర సాధనను సీఎం కేసీఆర్ సుసాధ్యం చేసిచూపారని జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. ఆయన లేకుంటే తెలంగాణ లేదు, 24 గంటల నిరంతర కరంటూ లేదని చెప్పారు. విద్యుత్‌రంగంలో తెలంగాణ దేశంలోనే ప్రథమస్థానంలో ఉన్నదని తెలిపారు. మన మీద సీఎం కేసీఆర్‌కు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, నాణ్యమైన విద్యుత్ అందించాలని కోరారు. శనివారం రవీంద్రభారతిలో విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (వీఏవోఏటీ) డైరీని ఆయన ఆవిష్కరించి మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైతే అంధకారంలోకి పోతుందని చాలా మంది హేళనచేసినా, అందరికీ 24 గంటల నిరంతర విద్యుత్ ఇవ్వడంలో ఉద్యోగులందరి కృషి ఉన్నదని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు 5 వేల మెగావాట్ల విద్యుత్ అవసరమని, దానిని సమకూర్చడానికి మరింత కష్టపడాలని పిలుపునిచ్చారు. వచ్చే ఏడాది భద్రాద్రి థర్మల్ పవర్‌స్టేషన్‌ను సీఎం కేసీఆర్‌కు కానుకగా అందించాలని సూచించారు. ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు జీతాలు రెట్టింపుచేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. విద్యుత్ ఉద్యోగులంతా సీఎం కేసీఆర్, ప్రభాకర్‌రావుకు రుణపడి ఉండాలని ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి కోరారు. నిరంతర విద్యుత్ తెలంగాణ నాయకత్వానికి నిదర్శనమని సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో జేఎండీ సీ శ్రీనివాసరావు, ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ పీ నర్సింహారావు, జెన్‌కో డైరెక్టర్ ఫైనాన్స్ సీహెచ్ వెంకటరాజం, ఎన్పీడీసీఎల్ సీజీఎం తిరుపతిరెడ్డి, వీఏవోఏటీ అధ్యక్షుడు అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి అంజయ్య, టీఈఈఏ అధ్యక్షుడు శివాజీ, బీసీరెడ్డి, సాయిబాబా, రమేశ్, రామ్‌జీ, సత్యనారాయణ, రత్నాకర్‌రావు, గణేశ్, షరీఫ్, వీరస్వామి, కే వెంకటేశ్వర్లు, అనురాధ, అనిల్, స్వామి, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ బాలగంగాధర్ కన్నుమూత

- సంతాపం ప్రకటించిన మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ



బాలగంగాధర్ (ఫైల్‌ఫొటో)

బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ: సీనియర్ జర్నలిస్ట్, జీ టీవీ న్యూస్ మాజీ న్యూస్ ఎడిటర్ బాలగంగాధర్ (62) శనివారం గుండెపోటుతో కన్నుమూశారు. కరీంనగర్ జిల్లా జగిత్యాలలో జన్మించిన బాలగంగాధర్ 70వ దశకంలో వచ్చిన చాటింపు దినపత్రిక ద్వారా జర్నలిజంలోకి అడుగుపెట్టారు. అప్పటి నుంచి పలు పత్రికల్లో విధులు నిర్వహించిన ఆయన.. ఉదయం దినపత్రికలో ఆదిలాబాద్ స్టాఫ్ రిపోర్టర్‌గా, సిటీ కేబుల్, మహానగర్, జీ టీవీ న్యూస్ తదితర వార్తా సంస్థల్లో పనిచేసి జర్నలిస్ట్‌గా తనదైన ముద్రవేశారు. బాలగంగాధర్ ఆకస్మిక మృతిపట్ల మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు సంతాపం ప్రకటించారు.

కిషన్‌రావు సేవలు ప్రశంసనీయం

- సింగరేణిలో మార్కెటింగ్ జీఎంగా విశిష్ట సేవలు
- కిషన్‌రావుకు సీఎండీ శ్రీధర్ ఘన సన్మానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : సింగరేణిలో మార్కెటింగ్ జనరల్ మేనేజర్‌గా పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన కిషన్‌రావు సేవలు ప్రశంసనీయమని ఆ సంస్థ సీఎండీ ఎన్ శ్రీధర్ పేర్కొన్నారు. హైదరాబాద్ సింగరేణిభవన్‌లో శుక్రవారం నిర్వహించిన అన్ని ఏరియాల జనరల్ మేనేజర్ల సమీక్షా సమావేశంలో కిషన్‌రావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. సింగరేణి బొగ్గు అమ్మకాలు, రవాణా విభాగాల్లో కిషన్‌రావు విశిష్ట సేవలు అందించారని చెప్పారు. గతంలో రోజువారీగా 20 నుంచి 22 ర్యాకుల బొగ్గు రవాణా ఉండగా, ఆయన చొరవతో అది 40 నుంచి 45 ర్యాకులకు పెరిగిందన్నారు. సమావేశంలో డైరెక్టర్లు ఎస్ శంకర్, ఎస్ చంద్రశేఖర్, బీ భాస్కరరావు, ఎన్ బలరాం తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో పాల్గొనవద్దు

- ఆ డిమాండ్ల పరిష్కారం సింగరేణి పరిధిలో లేదు
- కార్మికులకు యాజమాన్యం విజ్ఞప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : సింగరేణి పరిధిలో లేని డిమాండ్లను ముందుపెట్టి ఈనెల 8,9 తేదీల్లో చేపట్టిన జాతీయ సమ్మెలో పాల్గొనవద్దని సింగరేణి యాజమాన్యం కార్మికులకు విజ్ఞప్తిచేసింది. గుర్తింపు కార్మిక సంఘం టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డితో సింగరేణి డైరెక్టర్ చంద్రశేఖర్ శనివారం హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. 8,9 తేదీల్లో కార్మికులు హాజరయ్యేలా చూడాలని కోరారు. జాతీయ సంఘాలు పేర్కొంటున్నట్టుగా పెట్టుబడుల ఉపసంహరణ, కమర్షియల్ మైనింగ్ సింగరేణిలో లేవని, భవిష్యత్‌లో ఉండబోవని స్పష్టంచేశారు.

ఫిట్‌మెంట్ ఇచ్చి ఆదుకోండి

- పీఆర్సీకి విజ్ఞప్తిచేసిన రిటైర్డ్ ఉద్యోగులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ / బేగంబజార్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పెన్షనర్లకు 70 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చి ఆదుకోవాలని తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆర్ విశ్వాసరెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం పీఆర్సీ చైర్మన్ బిస్వాల్‌తో సమావేశమయి వినతిపత్రం సమర్పించారు. రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమార్థం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటుచేయడం శుభ పరిణామమని చెప్పారు. కనీస పెన్షన్‌గా రూ.20వేలు చెల్లించాలని, గ్రాట్యుటీని రూ.12లక్షల నుంచి రూ.20లక్షలకు పెంచాలని, డెత్ రిలీఫ్ రూ.5 వేలు ఇవ్వాలని, పదో పీఆర్సీ సిఫారసు మేరకు 70 ఏండ్లవారికి 15 శాతం అదనపు పింఛన్ ఇవ్వాలని కోరారు. మెడికల్ అలవెన్స్‌ను రూ.350 నుంచి రూ.1500కు పెంచాలని,



శనివారం పీఆర్సీ చైర్మన్ బిస్వాల్ తో భేటీ అయిన తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

అంత్యక్రియల నిధి చెల్లింపులను రూ.20వేల నుంచి రూ.50వేలు చేయాలని విజ్ఞప్తిచేశారు. పీఆర్సీ చైర్మన్‌తో భేటీఅయినవారిలో సంఘం ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, కోశాధికారి రామమోహన్, గౌరవాధ్యక్షుడు చంద్రప్రకాష్‌రావు, సంఘం బాధ్యులు మారయ్యగుప్త, ఎల్లారెడ్డి, శ్యాంరావు, ధన్‌పాల్, రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్సెంటివ్ మంజూరుచేయండి

పెన్షనర్లకు ఇన్సెంటివ్, ఇంక్రిమెంట్ మంజూరుచేయాలని తెలంగాణ పెన్షనర్ల కేంద్ర సంఘం పీఆర్సీ చైర్మన్ బిస్వాల్, సభ్యులు రఫత్‌అలీ, ఉమామహేశ్వర్‌రావుని కోరింది. శనివారం పీఆర్సీతో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నవనీతరావు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. స్థానిక సంస్థల్లో పనిచేసి పదవీ విరమణ పొందినవారికి హెల్త్‌కార్డులు ఇవ్వాలని, 174 జీవో ప్రకారం ప్రీమియం చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం కార్యనిర్వాహణ కార్యదర్శి మహ్మద్ రఫియుద్దీన్, కోశాధికారి శ్రవణ్‌కుమార్, జేఏసీ కోచైర్మన్ నక్క దర్శన్, ప్రహ్లాద్, శేషాచార్యులు, హైద్రాబాద్ అధ్యక్షుడు హెచ్ రాములు, కార్యదర్శి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రామన్నదొర క్షమాపణ చెప్పాలి

- పదవులన్నీ వారే అనుభవించినా భరించాం
- ఓర్పు, సహనానికి తెలంగాణ న్యాయవాదులు ప్రతీక
- ఏపీ బార్ అధ్యక్షుడి కించపరిచే వ్యాఖ్యలపై తెలంగాణ న్యాయవాదుల ఆగ్రహం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/కవాడిగూడ: 'హైదరాబాద్‌తో ఉన్న 30 ఏండ్ల అనుబంధం బాధను విజయవాడకు వచ్చిన మూడురోజుల్లో మర్చిపోయాం. మేము లేనిలోటు తెలంగాణ న్యాయవాదులకు తెలియాలి' అంటూ ఏపీ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రామన్నదొర చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ న్యాయవాదులు శనివారం ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తంచేశారు. మా మనోభావాలను కించపర్చిన రామన్నదొర బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. పదవులన్నీ వారే అనుభవించినా భరించామే తప్ప ఏనాడూ కించపర్చలేదన్నారు. ఓర్పు, సహనానికి తెలంగాణ న్యాయవాదులు ప్రతీకలని.. ఆ రాష్ట్ర ప్రభుత్వ మన్ననలు పొందడానికి రామన్నదొర తెలంగాణ న్యాయవాదులను కించపర్చేలా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రకటన జారీచేసినవారిలో తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ కొంతం గోవర్ధన్‌రెడ్డి, ఏ అనిల్‌కుమార్, టీ రాంరెడ్డి, సీహెచ్ కల్యాణరావు, రాము, పాశం కృష్ణారెడ్డి ఉన్నారు. కాగా, రామన్నదొర వ్యాఖ్యలను తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కోకన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి కూడా ఖండించారు. శనివారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ.. రామన్నదొర పరాన్నజీవిగా మాట్లాడటం సరికాదన్నారు. మాపై అక్కసు వెళ్లగక్కడం మానుకోవాలని సూచించారు. అన్నదమ్ముల్లా విడిపోతున్నామని ఇక్కడ చెప్పి.. అక్కడికి వెళ్లి మాట మార్చడం సరికాదన్నారు. 1919లోనే తెలంగాణకు హైకోర్టు ఉన్నదని రాష్ట్ర బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుంకరి జనార్దన్‌గౌడ్ పేర్కొన్నారు. ఆంధ్రా న్యాయవాదులే వచ్చి మాతో కలిసి ఉన్నారని తెలిపారు. అన్నదమ్ముల్లా విడిపోతున్నామని ఇక్కడ చెప్పి.. అక్కడికి వెళ్లి మాట మార్చడం సరికాదన్నారు.

ఏపీ బార్ అధ్యక్షుడిది ద్వంద్వ వైఖరి

రామన్నదొర వ్యాఖ్యలను లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపర్తి వెంకటేశ్‌గౌడ్ ఒక ప్రకటనలో ఖండించారు. తాను చేసిన వ్యాఖ్యలను వెనుకకు తీసుకొని, తెలంగాణ న్యాయవాదులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. ప్రకటన జారీచేసిన వారిలో లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ హైదరాబాద్ అధ్యక్షుడు ముక్కెర ధర్మేందర్ మాదిగ, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎస్పీ, బీఎస్పీ మధ్య పొత్తు పొడిచింది

- సూత్రప్రాయంగా అంగీకరించిన అఖిలేశ్, మాయావతి
- ఈ నెలాఖరులోగా ప్రకటన వెలువడే అవకాశం



లక్నో, జనవరి 5: లోక్‌సభ ఎన్నికలకు ముందు సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) పొత్తు కుదుర్చుకోనున్నాయి. పొత్తుకు అంగీకారం కుదిరిందని, దీనికి సంబంధించిన ప్రకటన ఈ నెలాఖరులోగా వెలువడవచ్చని ఎస్పీ జాతీయ అధికార ప్రతినిధి రాజేంద్ర చౌదరి శనివారం పీటీఐ వార్తా సంస్థకు తెలిపారు. ఇటీవలి కాలంలో తరచుగా భేటీ అవుతున్న ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, బీఎస్పీ అధినేత్రి మాయావతి పొత్తుకు సూత్రప్రాయంగా అంగీకరించారని రాజేంద్ర చౌదరి వెల్లడించారు. అఖిలేశ్, మాయావతి శుక్రవారం ఢిల్లీలో మరోసారి సమావేశమయ్యారని, పొత్తు విషయమై ఇతర చిన్న పార్టీలతోనూ చర్చలు కొనసాగుతున్నాయని, ఈ పార్టీల్లో రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్‌ఎల్డీ) కూడా ఉన్నదని తెలిపారు. ఈ కూటమిలో కాంగ్రెస్ పార్టీని చేర్చుకోవాలా? లేదా? అనే విషయాన్ని అఖిలేశ్, మాయావతి నిర్ణయిస్తారని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అయితే అమేథీ, రాయ్‌బరేలీలో తమ కూటమి అభ్యర్థులను బరిలోకి దింపబోదని, ఆ రెండు స్థానాలను కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, యూపీఏ చీఫ్ సోనియా గాంధీకి వదిలివేస్తామని రాజేంద్ర చౌదరి తెలిపారు. దేశ రాజకీయాల్లో ఎంతో కీలకమైన యూపీలో 80 పార్లమెంట్ స్థానాలున్నాయి. 2014 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా యూపీలో బీజేపీ ఏకంగా 71 సీట్లను కైవసం చేసుకున్నది.

హిమాచల్‌లో లోయలో పడ్డ బస్సు

డ్రైవర్ సహా ఆరుగురు విద్యార్థుల మృతి



లోయలో పడిపోయిన బస్సు

సిమ్లా, జనవరి 5: హిమాచల్‌ప్రదేశ్‌లో ఒక స్కూల్ బస్సు లోయలో పడిపోవడంతో ఆరుగురు విద్యార్థులు, బస్సు డ్రైవర్ మృతి చెందారు. శనివారం ఉదయం ఎనిమిది గంటలకు సిర్మౌర్ జిల్లా సంగ్రాహ్ పట్టణంలో జరిగిన ఈ దుర్ఘటనలో 12 మంది పాఠశాల విద్యార్థులు గాయపడ్డారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. రేణుక ప్రాంతంలోని డీఏవీ పాఠశాలకు చెందిన ఈ బస్సు విద్యార్థులను తీసుకెళుతుండగా ఈ దుర్ఘటన జరిగిందని జిల్లా ఎస్పీ రోహిత్ మాల్పానీ తెలిపారు. ముగ్గురు విద్యార్థులు, బస్సు డ్రైవర్ ఘటనాస్థలంలోనే మరణించారు. తీవ్రంగా గాయపడి దవాఖానలో చికిత్స పొందుతూ మరో ముగ్గురు విద్యార్థులు మృతి చెందారు. క్షతగాత్రులైన 12 మంది విద్యార్థుల్లో పది మందిని గుర్తించారు. ఈ ఘటనపై 15 రోజుల్లో నివేదిక సమర్పించాలని సంగ్రాహ్ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ రాజేశ్ ధిమాన్‌ను సిర్మౌర్ డిప్యూటీ కమిషనర్ లలిత్ జైన్ ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ.20 వేలు, గాయపడిన వారి కుటుంబాలకు రూ.10 వేలు తక్షణ సాయంగా అందజేయాలని ఆదేశించారు.

ఎమర్జెన్సీ ప్రకటిస్తా!

- నెలలు కాదు ఏండ్లయినా సరే ప్రభుత్వాన్ని బంద్ చేస్తా
- సరిహద్దు గోడకు నిధుల కోసం డెమోక్రాట్లకు ట్రంప్ బెదిరింపులు
- ఆర్థిక ప్రతిష్టంభనపై చర్చలు విఫలం



వాషింగ్టన్, జనవరి 5: మెక్సికో సరిహద్దులో గోడను నిర్మించేందుకు నిధులివ్వకపోతే జాతీయ అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ)ని ప్రకటిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ దేశ చట్టసభ సభ్యులను బెదిరించారు. ఈ నిధుల వివాదం మూలంగానే అమెరికాలో ప్రభుత్వ పాలన రెండు వారాలుగా స్తంభించిపోయింది. తన మాట నెగ్గించుకొనేందుకు అవసరమైతే నెలలు కాదు ఏండ్లయినా సరే ప్రభుత్వాన్ని మూసివేస్తానని ట్రంప్ తేల్చి చెప్పారు. గోడ నిర్మాణానికి ట్రంప్ 560 కోట్ల డాలర్లు కోరుతుండగా, ప్రతిపక్ష డెమోక్రాట్లు ససేమిరా అంటున్నారు. దేశంలో నెలకొన్న ఆర్థిక ప్రతిష్టంభనను తొలగించేందుకు ట్రంప్ శుక్రవారం సాయంత్రం డెమోక్రాట్ సభ్యులతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో చట్టసభ అనుమతి లేకుండా మెక్సికో సరిహద్దులో గోడ కట్టేందుకు దేశంలో ఎమర్జెన్సీ విధిస్తానని సభ్యులను హెచ్చరించినట్టు ట్రంప్ విలేకరులకు తెలిపారు. అంతకుముందు సెనేట్‌లో మైనారిటీల నాయకుడు చక్ షూమర్ మాట్లాడుతూ, ప్రభుత్వాన్ని పనిచేయించాల్సిందిగా కోరామన్నారు. ఇంకా అనేక విషయాలు చర్చించామని, వాటిలో కొన్ని వివాదాస్పద అంశాలు కూడా ఉన్నాయని, చర్చలు కొనసాగుతాయని చెప్పారు. అయితే ప్రభుత్వం పనిచేయనంత వరకు చర్చలు పురోగతి సాధించడం కష్టమేనని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసీ మాట్లాడుతూ, డెమోక్రాట్ల ఆందోళనను తాము పరిగణనలోకి తీసుకున్నామని, అయితే ప్రభుత్వం పనిచేయకుండా ఏదీ పరిష్కారం కాదని అన్నారు. అమెరికన్ ప్రజలకు ప్రభుత్వ సేవలు అందడం లేదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ట్రంప్ మాట్లాడుతూ, ప్రభుత్వాన్ని మూసివేసైనా తాను పనిచేయగలనన్నారు.





పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని గౌతమినగర్‌లో ఐఏఎస్ అధికారి చంద్రకళ తల్లి లక్ష్మి ఉంటున్న ఇల్లు

ఐఏఎస్ అధికారి చంద్రకళపై సీబీ'ఐ'

- యూపీలో ఇసుక అక్రమ తవ్వకాల కేసు దర్యాప్తులో భాగంగా ఆమె ఇండ్లు, కార్యాలయాలు సహా 14 ప్రాంతాల్లో తనిఖీలు
- తెలంగాణలోనూ సోదాలు నిర్వహించిన అధికారులు
- ఆస్తుల పత్రాలు, విలువైన డాక్యుమెంట్లు స్వాధీనం
- యూపీ మాజీ సీఎం అఖిలేశ్, మరో ఎస్పీ నేతకు త్వరలో సమన్లు

న్యూఢిల్లీ / ఫెర్టిలైజర్ సిటీ జనవరి 5: ఇసుక అక్రమ తవ్వకాల వ్యవహారంలో సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్‌పై దర్యాప్తు ప్రారంభించేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) సిద్ధమవుతున్నది. అఖిలేశ్ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా, మైనింగ్‌శాఖ మంత్రిగా వ్యవహరించినప్పుడు ఆ రాష్ట్రంలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిగాయన్న ఆరోపణలు రావడంతో ఆయనతోపాటు ఎస్పీకి చెందిన మరో సీనియర్ నాయకునికి సీబీఐ సమన్లు జారీచేసే అవకాశమున్నదని అధికారులు తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు 2008 బ్యాచ్ యూపీ క్యాడర్‌కు చెందిన తెలంగాణ ఐఏఎస్ అధికారి బీ చంద్రకళ ఇండ్లు, కార్యాలయాలు సహా 14 ప్రాంతాల్లో శనివారం ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. దేశ రాజధాని ఢిల్లీ, యూపీతోపాటు తెలంగాణలోనూ సోదాలు కొనసాగాయి. యూపీలో ఇసుక మైనింగ్‌పై జాతీయ హరిత ట్రిబ్యునల్ నిషేధం విధించినప్పటికీ 2012-16 మధ్య కాలంలో ఇసుక తవ్వకాలకు అనుమతి ఇవ్వడంతోపాటు అక్రమంగా మైనింగ్ లైసెన్సులను పునరుద్ధరించారని, అంతేకాకుండా లీజుదారులు, డ్రైవర్ల నుంచి బలవంతంగా డబ్బు వసూలు చేశారని ఆరోపణలు రావడంతో ఐఏఎస్ చంద్రకళ, సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్సీ రమేశ్‌కుమార్ మిశ్రా, ప్రభుత్వ ఉన్నతోద్యోగులు సహా మొత్తం 11 మందిపై ఐపీసీ (ఇండియన్ పీనల్ కోడ్)లోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదయింది.

అధికారుల ఖండన

అయితే సోదాల పేరుతో చంద్రకళను సీబీఐ వేధించడాన్ని పలువురు అధికారులు ఖండించారు. అవినీతికి పాల్పడే నాయకులే ఆమెను టార్గెట్‌చేసి కేసులు వేశారని ఆరోపించారు.

గోదావరిఖనిలో కలకలం

అవినీతిపరులపై ఉక్కుపాదం మోపి 'డైనమిక్' అధికారిగా పేరు పొందిన చంద్రకళ ఆస్తులపై సీబీఐ సోదాల వార్త గోదావరిఖనిలో కలకలాన్ని రేపింది. ఉత్తరప్రదేశ్‌లోని వివిధ జిల్లాలతోపాటు తెలంగాణలో చంద్రకళ స్వస్థలమైన పెద్దపల్లి జిల్లా గోదవరిఖని శివారులోని గౌతమినగర్‌లో ఆమె ఇండ్లు, కార్యాలయాల్లో సీబీఐ అధికారులు శనివారం ఏకకాలంలో సోదాలు నిర్వహించి విలువైన డాక్యుమెంట్లు, ఆస్తుల పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. బ్యాంక్ లాకర్‌ను కూడా తెరిచి చూసినట్టు సమాచారం. ఆమె భర్త రాములు ఉమ్మడి కరీంనగర్ జిల్లా సీడీఏ నీటిపారుదల శాఖలో ఈఈగా పనిచేస్తున్నారు. చంద్రకళ ఇండ్లు, కార్యాలయాలపై సీబీఐ దాడుల విషయం టీవీలో చూసిన తర్వాతే తెలిసిందని, అసలు ఏమి జరిగిందో తనకు తెలియదని ఆమె తల్లి లక్ష్మి వాపోయారు.

ఆకాశంలో విమానం ఇంజిన్ ఫెయిల్

ముంబై: ఆకాశంలో పెను ప్రమాదం తప్పింది. ఇండిగో విమానం గురువారం చెన్నై నుంచి కోల్‌కతాకు బయలుదేరింది. కొంతదూరం ప్రయాణించిన తర్వాత విమానం ఇంజిన్ విఫలం అయ్యింది. ఈ విషయాన్ని గుర్తించిన పైలట్ ప్రత్యామ్నాయ ఇంజిన్‌ను ఉపయోగించి విమానాన్ని సురక్షితంగా తిరిగి చైన్నైకి తీసుకొచ్చారు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. బ్లేడ్‌లు దెబ్బతినడంతోనే ఇంజిన్ విఫలమైనట్లు తెలుస్తున్నది.

మీటూ ఆరోపణలతో సోత్బే ఇండియా ఎండీ రాజీనామా


న్యూఢిల్లీ: మీటూ ఆరోపణల నేపథ్యంలో వేలంపాట నిర్వహించే ప్రముఖ సంస్థ సోత్బే ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ గౌరవ్ భాటియా రాజీనామా చేశారు. ఓ మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా ఆమెను బలవంతంగా ముద్దుపెట్టుకోవడానికి ఆయన ప్రయత్నించినట్లు ఉన్న ఓ వీడియో కొద్ది కాలం కిందట సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో కొద్ది రోజులు సెలవుపై వెళ్లిన ఆయన అనంతరం రాజీనామా చేశారు. సోత్బే సంస్థ స్పందిస్తూ 20 డిసెంబర్ 2018న భాటియా రాజీనామా చేశారని తెలిపింది.

వచ్చే లోక్‌సభ హంగ్!

ఏ కూటమికీ దక్కని కనీస మెజారిటీ

ప్రభుత్వ ఏర్పాటుకు 272 మంది ఎంపీలు అవసరం

- 225 వద్ద నిలిచిపోనున్న ఎన్డీయే
- యూపీఏకు 167, ఇతరులకు 150
- ఎన్నికలకు ముందు మందిరంపై ఆర్డినెన్స్ వద్దన్న ఓటర్లు
- వీడీపీ అసోసియేట్స్ సర్వే అంచనాలు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మరో వంద రోజుల్లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఎవరి వైపు మొగ్గు చూపనున్నారు.. మోదీ హవా కొనసాగుతుందా లేక బీజేపీ ఆశలకు రాహుల్‌గాంధీ గండి కొడుతారా? ఫెడరల్ ఫ్రంట్ అవకాశాలేమిటి? అన్న అంశాలపై వీడీపీ అసోసియేట్స్ అనే సంస్థ దేశవ్యాప్త సర్వే నిర్వహించింది. సర్వే ఫలితాలను శనివారం ట్విట్టర్‌లో విడుదల చేసింది. లోక్‌సభకు ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం 2014లో మాదిరిగా సంపూర్ణ మెజారిటీ సాధించే అవకాశాలు లేవు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ పుంజుకోనున్నా ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన (272) సీట్లకు ఆమడదూరంలోనే నిలిచిపోతుంది. ఏ కూటమిలోనూ భాగం కాని పార్టీలు 150 సీట్ల వరకు గెలుచుకోనున్నాయి. ఎన్డీయే ఇతరుల కన్నా ఎక్కువ సీట్లు కైవసం చేసుకోనున్నా, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ సాధించకపోవచ్చునని, ఇతర పార్టీలపై ఆధారపడక తప్పదని వీడీపీ అసోసియేట్స్ సంస్థ తెలిపింది. 2014లో సొంతంగా మెజారిటీ స్థానాలు (282) గెలుచుకున్న బీజేపీ ఈసారి 201 సీట్లను గెలుచుకోనున్నది. ప్రస్తుత సభలో 44 మంది సభ్యులున్న కాంగ్రెస్ మరో 66 సీట్లను గెలుచుకుంటుందని110కి చేరొచ్చని అంచనావేసింది. ఎన్డీయే 225, యూపీఏ 167, ఇతరులు 150 స్థానాలు గెలుచుకుంటారని తెలిపింది. ఎన్డీయేకు 36 శాతం, యూపీఏకు 32, ఇతరులకు 26 శాతం మంది ప్రజలు మద్దతు ఉన్నదని ఆ సంస్థ తెలిపింది. గతంతో పోలిస్తే ప్రధాని మోదీ ఆదరణ భారీగా తగ్గినా మెజారిటీ ప్రజలు ఆయననే మళ్లీ ప్రధానిగా కోరుకుంటున్నారు. ప్రధానిగా మోదీకి 40%, రాహుల్‌గాంధీకి 24% మంది మద్దతు తెలిపారు. మాయావతి, మమతా బెనర్జీ వంటి ఇతర నేతల వైపు రెండు శాతం మంది మాత్రమే మొగ్గు చూపారు. బీజేపీకి 32%, కాంగ్రెస్‌కు 24% మంది తమ మద్దతు ఇచ్చారు. ఢిల్లీలో కేజ్రీవాల్ సర్కార్ బాగా పనిచేస్తున్నదన్న ప్రజలు, లోక్‌సభకు మాత్రం బీజేపీకే మద్దతునిస్తామన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్డీయే 18, యూపీఏ 3, ఇతరులు 4 సీట్లు గెలుచుకోవచ్చని ఈ సర్వే తెలిపింది. రాజస్థాన్, మధ్యప్రదేశ్, కర్ణాటక, జార్ఖండ్‌లో కాంగ్రెస్.. గుజరాత్, మహారాష్ట్ర, హర్యానాలో బీజేపీ.. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ మెజారిటీ సీట్లు గెలుచుకోవచ్చని తెలిపింది. ఒడిశాలో వరుసగా నాలుగోసారి అధికార బిజూ జనతాదళ్ (బీజేడీ) ఆధిక్యత ప్రదర్శించగలదన్నది. ఆ పార్టీకి 12, బీజేపీకి 9 సీట్లు వస్తాయని తెలిపింది. బీహార్‌లో ఎన్డీయేకు 32, యూపీఏకు 8 సీట్లు లభిస్తాయన్నది. యూపీలో ఎస్పీ (21), బీఎస్పీ (17), ఆర్‌ఎల్డీ (20)లతో కూడిన మహాకూటమికి 40, బీజేపీకి 38, కాంగ్రెస్‌కు రెండు స్థానాలు వస్తాయని అంచనా వేసింది.

దక్షిణ భారత్‌లో యూపీఏ

దక్షిణ భారతంలో యూపీఏ వైపు ప్రజలు మొగ్గు చూపనున్నారు. 130 సీట్లలో యూపీఏకు 61, ఎన్‌డీఏకు 12, ఇతరులకు 57 సీట్లు లభిస్తాయి.

ఎన్డీయే	225	(బీజేపీ-201, మిత్రపక్షాలు 24)	36% ఓట్లు
యూపీఏ	167	(కాంగ్రెస్-110, భాగస్వాములు 57)	32% ఓట్లు
ఇతరులు	150		26% ఓట్లు

ఎన్డీయేలోనూ మోదీకే మద్దతు

మరోసారి ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడితే ఆరెస్సెస్‌కు మోదీ మినహా మరొకరిని ప్రధానిగా కూర్చోబెట్టే అవకాశం లేదని వీడీపీ అసోసియేట్స్ తెలిపింది. ఆ సంస్థ సర్వేలో ఎన్డీయే సంకీర్ణ కూటమికి మోదీనే నేతృత్వం వహించాలని 81 శాతం మంది కోరుకున్నారు. అద్వానీ వైపు కేవలం 7 శాతం మంది మొగ్గు చూపారు. మోదీ సర్కార్ ఇప్పటికైనా రైతులు, మధ్యతరగతి వర్గాలు, వ్యాపారులకు అనుకూల నిర్ణయాలు తీసుకోకపోతే మరింత నష్టపోయే అవకాశముందని అంచనా వేసింది. ఈ ఎన్నికల్లో నిరుద్యోగం (19%), వ్యవసాయ సంక్షోభం (14%), మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గాలకు ఆర్థిక రాయితీ (12%), మౌలిక సదుపాయాల అభివృద్ధి (11%), పారిశుద్ధ్యం (10%), ధరల పెరుగుదల/ద్రవ్యోల్బణం (10%), విద్య, ఆరోగ్యం (10%), ప్రజా ప్రతినిధుల అవినీతి (8%), సామాజిక సామరస్యం (3%) ప్రభావం చూపుతాయని ఈ సర్వే తెలిపింది.

మధ్యతరగతి అసంతృప్తి

రాఫెల్ కుంభకోణం గురించి తాము వినలేదని 35శాతం మంది చెప్పగా, దానిపై తమకు అవగాహన లేదని మరో 36 శాతం మంది పేర్కొన్నారు. రాఫెల్ కుంభకోణం గురించి తెలిసిన 29శాతం మందిలో అత్యధికులు (70%) మోదీ సర్కార్ అవినీతికి పాల్పడలేదని అభిప్రాయపడ్డారు. జీఎస్టీ అమలు అధ్వానంగా ఉందని మెజారిటీ ప్రజలు అభిప్రాయపడ్డారు. అలాగే మధ్యతరగతికి చెందిన మెజారిటీ వర్గాలు కూడా మోదీ ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఎన్నికలకు ముందు రామాలయంపై ఆర్డినెన్స్ జారీ చేయాలని కేవలం 5 శాతం మంది మాత్రమే చెప్పారు. దేశవ్యాప్తంగా 98 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో డిసెంబర్ 20 నుంచి జనవరి 2 మధ్య 15,116 మందిని సర్వే చేసి ఈ అంచనాకు వచ్చినట్టు వీడీపీ అసోసియేట్స్ తెలిపింది. తాము సర్వే చేసినవారిలో 41 శాతం మంది పట్టణ ఓటర్లు కాగా, గ్రామీణులు 59 శాతం మంది అని, తమ అంచనాలు తారుమారయ్యే అవకాశం 3 శాతం మత్రమేనని పేర్కొంది.

బెంగళూరు సెంట్రల్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ

సినీనటుడు ప్రకాశ్ రాజ్ వెల్లడి



బెంగళూరు, జనవరి 5: త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో బెంగళూరు సెంట్రల్ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు ప్రముఖ సినీ నటుడు ప్రకాశ్‌రాజ్ ప్రకటించారు. రాజకీయాల్లో ప్రవేశించేలా తనను ప్రోత్సహిస్తున్న వారికి ధన్యవాదాలు తెలిపారు. ట్విట్టర్ వేదికగా ప్రకాశ్‌రాజ్ 'సిటిజన్ వాయిస్ ఇన్ పార్లమెంట్' అనే హ్యాష్ ట్యాగ్‌తో తన ఫొటోను, బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ స్థానం పరిధిలోని ఎనిమిది అసెంబ్లీ సెగ్మెంట్ల చిత్రాన్ని పోస్ట్ చేశారు. మరి కొద్ది రోజుల్లో మరిన్ని వివరాలను వెల్లడిస్తామని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ఇటీవల ప్రకటించిన ప్రకాశ్ రాజ్.. ప్రస్తుతం నియోజకవర్గం గురించి కూడా వెల్లడించారు. ప్రస్తుతం ఈ స్థానం నుంచి బీజేపీ ఎంపీ పీసీ మోహన్ ప్రాతినిథ్యం వహిస్తున్నారు. గత ఏడాది జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ సీఎం సిద్దరామయ్యకు మద్దతుగా ప్రకాశ్ రాజ్ ప్రచారం చేశారు.

కాలిఫోర్నియాలో కాల్పులు... ముగ్గురి మృతి

మరో నలుగురికి గాయాలు

వాషింగ్టన్, జనవరి 5: అమెరికాలో మరోసారి కాల్పులు చోటుచేసుకున్నాయి. లాస్ ఏంజెల్స్‌కు సమీపంలోని ఓ గేమింగ్ కాంప్లెక్స్‌లో చోటుచేసుకున్న ఈ కాల్పుల్లో ముగ్గురు మృత్యువాతపడ్డారని, మరో నలుగురు గాయపడ్డారని కాలిఫోర్నియా పోలీసులు శనివారం తెలిపారు. బాధితులందరూ పురుషులేనని చెప్పారు. శుక్రవారం రాత్రి 11.50 గంటల సమయంలో ఈ ఘటన జరిగిందని తెలిపారు. గేమింగ్ కాంప్లెక్స్‌లో గొడవ జరిగిందని, ఈ సందర్భంగా చోటుచేసుకున్న కాల్పుల్లో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందినట్లు ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. గాయపడిన వారిని సమీపంలోని దవాఖానకు తరలించినట్లు చెప్పారు. కాగా, అమెరికా ఆరోగ్య శాఖ వివరాల ప్రకారం 2017లో ఆ దేశంలో తుపాకీ కాల్పుల ఘటనల్లో 40 వేల మంది (ఆత్మహత్య చేసుకున్నవారితో కలిపి) దుర్మరణం చెందారు.

అండమాన్ దిశగా 'పబుక్' తుఫాన్



థాయ్‌లాండ్‌లో తుఫాన్ ధాటికి నేలకూలిన స్తంభాలు

- అండమాన్ నికోబార్ దీవులకు ఎల్లో అలర్ట్ జారీ
- మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని ఐఎండీ హెచ్చరిక

న్యూఢిల్లీ, జనవరి 5: థాయ్‌లాండ్‌లో కొనసాగుతున్న పబుక్ తుఫాన్ అండమాన్ దిశగా కదులుతున్నది. ఈ నేపథ్యంలో అండమాన్ నికోబార్ దీవులకు కేంద్ర హోం శాఖ శనివారం ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గంటకు 21 కి.మీ. వేగంతో పబుక్ తుఫాన్ పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తున్నదని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) వెల్లడించింది. మత్స్యకారులు ఎవరూ సముద్రంలో వేటకు వెళ్లొద్దని సూచించింది. మరికొంత సమయం ఇది పశ్చిమ వాయవ్య దిశగా పయనించే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. అనంతరం ఉత్తర వాయవ్య దిశగా పయనించి జనవరి 6న సాయంత్రం అండమాన్ నికోబార్ దీవులను దాటే అవకాశం ఉందని వెల్లడించింది. ఆ సమయంలో గంటకు 70-80 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. అనంతరం ఉత్తరవాయవ్య దిశగా మయన్మార్‌వైపు పయనిస్తూ జనవరి 7-8 తేదీల్లో బలహీన పడే అవకాశం ఉందని వివరించింది. పబుక్ తుఫాన్ కారణంగా అండమాన్ నికోబార్ దీవుల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరించింది.

థాయ్‌లాండ్‌లో బీభత్సం

పబుక్ తుఫాన్ థాయ్‌లాండ్‌లో బీభత్సం సృష్టించింది. గంటకు 75 కి.మీ. వేగంతో గాలులు వీస్తూ గురువారం దక్షిణ థాయ్‌లాండ్‌లో భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాలను వరదలు ముంచెత్తాయి. దీంతో సుమారు 30 వేల మంది ప్రజలు సహాయక కేంద్రాల్లో తలదాచుకుంటున్నారు.

పబుక్ అంటే భారీ చేప

తుఫాన్లకు ఒక్కో దేశం ఒక్కోసారి పేరు పెడుతున్నది. పబుక్ తుఫాన్‌కు లావోస్ దేశం ఆ పేరు పెట్టింది. పబుక్ అంటే భారీ మంచినీటి చేప అని అర్థం.

రణరంగంగా కేరళ

- అట్టుడుకుతున్న కన్నూర్.. ఐదు జిల్లాల్లో చల్లారని హింస
- బీజేపీ, సీపీఎం నేతల ఇండ్లపై బాంబు దాడులు
- హింసకు కారణం మీరంటే మీరేనంటూ పరస్పర ఆరోపణలు



తలస్సేరిలో బీజేపీ నేత ఇంటిపై దాడి దృశ్యం

తిరువనంతపురం: కేరళ వరుసగా మూడోరోజు రణరంగాన్ని తలపించింది. శబరిమల ఆలయంలోకి మహిళలకు అనుమతిపై రాష్ట్రంలో చెలరేగిన హింస ఇంకా ప్రజ్వరిల్లుతున్నది. హిందూత్వ సంస్థల ఆందోళనలు శనివారమూ సాగాయి. రాజకీయంగా అత్యంత సున్నితమైన కన్నూర్ జిల్లాలో బీజేపీ-ఆరెస్సెస్, సీపీఎం కార్యకర్తల మధ్య బాంబు దాడులు జరిగాయి. సీపీఎం ఎమ్మెల్యే ఏఎన్ షంషేర్, బీజేపీ ఎంపీ వీ మురళీధరన్ ఇండ్లపై ప్రత్యర్థులు బాంబు దాడులకు పాల్పడ్డారు. ఈ దాడుల్లో ఎవరూ గాయపడలేదు. సీపీఎం నేతల ఇండ్లపై బాంబులు పడ్డ కొద్దిసేపటికి మురళీధరన్ ఇంటిపై బాంబు దాడి జరిగింది. బీజేపీ, సీపీఎం నేతల మధ్య శాంతి సమావేశం నడుస్తున్నప్పుడే జరిగిన ఈ దాడులతో కన్నూర్‌లో జనజీవనం స్తంభించింది. రాష్ట్రవ్యాప్తంగా అలర్ట్ ప్రకటించిన డీజీపీ లోక్‌నాథ్ బెహెరా, దాడులకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని పోలీసులను ఆదేశించారు. కన్నూర్ హింసపై 260 మందిని అరెస్టు చేశారు. కన్నూర్ జిల్లా పరియారంలో కొందరు ఆరెస్సెస్ కార్యాలయానికి నిప్పు పెట్టారు. పెరుంబరలో సీపీఎం కార్యకర్తపై దాడి జరుగగా, తలస్సేరిలో ఆరెస్సెస్ నేత కే చంద్రశేఖరన్‌పైనా దాడి చేసిన కమ్యూనిస్టు కార్యకర్తలు ఆయన ఇంటిని ధ్వంసం చేశారు. పథనంతిట్ట జిల్లాలోనూ భారీ హింస చెలరేగింది. అల్లర్లను రెచ్చగొట్టేందుకు ఆరెస్సెస్ ప్రయత్నిస్తున్నందునే శాంతి చర్చలకు భంగం కలిగిస్తున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కే బాలకృష్ణన్ అన్నారు. ఆలయ ఆచారాలు, సంప్రదాయాల ఉల్లంఘన వ్యతిరేక నిరసనల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు సీపీఎం అమలుచేస్తున్న ఎత్తుగడల్లో భాగమే ఈ హింస అని బీజేపీ ఎంపీ మురళీధరన్ అన్నారు. తలస్సేరిలోని తన పూర్వీకుల ఇంటిపై బాంబు దాడి సమయంలో తన సోదరి, బావమరిది, వారి కుమార్తె ఇంట్లోనే ఉన్నారన్నారు. శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశంపై సుప్రీంకోర్టు తీర్పును అంతా గౌరవించాలని ఐరాస ప్రధాన కార్యదర్శి ప్రతినిధి ఫర్హాన్ హక్ పేర్కొన్నారు.

శబరిమల తంత్రి 'బ్రాహ్మణ రాక్షసుడు': మంత్రి

మహిళలు ప్రవేశించాక ఆలయ శుద్ధి చేసిన తంత్రి (ప్రధాన పూజారి) బ్రాహ్మణ రాక్షసుడని కేరళ మంత్రి సుధాకరన్ విమర్శించారు. కనకదుర్గ, బిందు అనే మహిళలు బుధవారం ఉదయం అయ్యప్పను దర్శించుకున్న తరువాత తంత్రి కందారు రాజీవరు ఆలయం తలుపులు మూసివేసి సంప్రోక్షణ నిర్వహించిన సంగతి తెలిసిందే. దీనిపై రాష్ట్ర మంత్రి జీ సుధాకరన్ స్పందిస్తూ, 'ఒక సోదరిని అపవిత్రురాలిగా పరిగణించే వ్యక్తిని మనిషి అనవచ్చా' అని ప్రశ్నించారు. 'ఆ తంత్రి మతం అనే భూత చిహ్నం. ఆయన బ్రాహ్మణుడి రూపంలో ఉన్న రాక్షసుడు. అయ్యప్ప స్వామి పట్ల ఆయనకు ఎటువంటి ప్రేమ, గౌరవం లేదు' అంటూ మండిపడ్డారు.

రైతుల్ని కాంగ్రెస్ తప్పుదారి పట్టిస్తున్నది

- రుణమాఫీతో తాత్కాలిక ఉపశమనమే
- అన్నదాతల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే నా లక్ష్యం: మోదీ
- జార్ఖండ్‌లో పలు సాగునీటి ప్రాజెక్టులకు శంకుస్థాపన



దల్తాగంజ్(జార్ఖండ్)/బరిపాడా(ఒడిశా): రుణమాఫీ పేరుతో రైతులను కాంగ్రెస్ మోసం చేస్తున్నదని, వారిని తప్పుదారి పట్టిస్తున్నదని ప్రధాని మోదీ విమర్శించారు. కేవలం ఓటుబ్యాంకు రాజకీయాల కోసమే ఇలాంటి విధానాలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. కానీ తమ ప్రభుత్వం రైతుల జీవితాలను బాగుపర్చడానికి, వారి సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదన్నారు. శనివారం జార్ఖండ్‌లో ఆరు సాగునీటి ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. ఇందులో రూ.2,391.36 కోట్ల విలువగల ప్రతిష్ఠాత్మక కోయిల్ కరో మండల్ డ్యాం కూడా ఉన్నది. శంకుస్థాపన తర్వాత జరిగిన సభలో మోదీ మాట్లాడుతూ 'గత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు రుణాలు తీసుకునేలా ఎగదోసింది. ఇప్పుడు రుణమాఫీ చేస్తామని తప్పుదారి పట్టిస్తున్నది. నేను కూడా ప్రతి రైతుకు రూ. లక్ష వరకు రుణమాఫీ చేయగలను. దీని వల్ల అన్నదాతలకు తక్షణ ఉపశమనం లభిస్తుంది కానీ భవిష్యత్ ఆందోళనకరం.అందుకే నేను రుణమాఫీ జోలికి వెళ్లలేదు' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆయనకు(రాహుల్‌గాంధీ) కోయిల్ అంటే తెలియదని, కోయిల్ అంటే సాగునీటి ప్రాజెక్టు అని చెప్పారు. కోయిల్ కరో మండల్ డ్యాం వల్ల జార్ఖండ్‌తోపాటు బీహార్ కూడా లబ్ధిపొందనున్నదని, ఈ ప్రాజెక్టు కోసం కలిసి పనిచేస్తున్న జార్ఖండ్ సీఎం రఘుబర్‌దాస్, బీహార్ సీఎం నితీశ్‌కుమార్‌లకు అభినందనలని పేర్కొన్నారు. సమాఖ్య వ్యవస్థకు వీరి పనితీరు మంచి ఉదాహరణ అని మోదీ అన్నారు.

ప్రజలారా.. ప్రధానిని నిలదీయండి

రాఫెల్ ఒప్పందంపై నా ప్రశ్నలనే మీ ప్రశ్నలుగా సంధించండి: రాహుల్

న్యూఢిల్లీ, జనవరి 5: రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంపై ప్రధాని మోదీని, కేంద్రమంత్రులను ప్రజలు నిలదీయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పిలుపునిచ్చారు. ఈ ఒప్పందంపై తాను పార్లమెంట్‌లో సంధించిన ప్రశ్నలను మీరు కూడా సంధించాలని సూచించారు. ఈ మేరకు ఆయన శనివారం ట్వీట్ చేస్తూ 'రాఫెల్ ఒప్పందంపై మన రక్షణ మంత్రి పార్లమెంట్‌లో రెండు గంటలు మాట్లాడారు. కానీ నేను సంధించిన రెండు చిన్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోయారు' అని ఎద్దేవా చేశారు. 'పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి ఆఫ్‌సెట్ కాంట్రాక్టును ఎవరు ఇచ్చారు? ఈ ఒప్పందానికి ప్రధాని మోదీ బైపాస్ సర్జరీ చేస్తే(జోక్యం చేసుకుంటే) రక్షణ శాఖ అధికారులు అభ్యంతరం చెప్పారా?.. అవును.. కాదు.. అని సమాధానం చెప్పండి అని రక్షణ మంత్రిని ప్రశ్నించాను. కానీ ఆమె నుంచి ఎలాంటి సమాధానం రాలేదు' అని రాహుల్ తెలిపారు. ట్విట్టర్‌లో ఓ వీడియోను కూడా పోస్ట్ చేసిన రాహుల్ 'చూడండి.. షేర్ చేయండి.. అనంతరం ప్రధానిని, కేంద్రమంత్రులను ప్రశ్నించండి' అని కోరారు. అంతేగాక తన ట్వీట్‌కు '2సవాల్‌దోజవాబ్'(రెండు ప్రశ్నలకు సమాధానం చెప్పండి) అనే హాష్‌ట్యాగ్‌ను కూడా జత చేశారు.

నమస్తే తెలంగాణ
కరీంనగర్
ఆదివారం, 6 జనవరి 2019
WWW.NTNEWS.COM

వైవిధ్యం వైరుధ్యం కావొద్దు!

విశ్లేషణ



ప్రొఫెసర్ కనకదుర్గ దంటు

నాగరికత అన్న పదానికి సభ్యత, సంస్కారం, ఉన్నతమైన సంస్కృతి ఇలా అనేక అర్థాలు చెప్పబడినాయి. నైతిక ప్రవర్తన కలిగినవారిని నాగరికులు అంటారు. అయితే ఈ ప్రవర్తన రెండు విధాలుగా అలవడుతుంది. ఒకటి న్యాయం వల్ల, రెండోది ధర్మం వల్ల. మానవజాతి మొదలైనప్పుడు శారీరక బలమే న్యాయంగా ఉండేది. అంటే ఎవరు బలం కలిగి ఇతరులను అణిచిపెట్టగలరో వారే వారి గుంపులకు నాయకుడయ్యేవాడు. ప్రకృతి మీద ఆధారపడి దొరికిన తిండి తినే స్థితి నుంచి తన బుద్ధిని ఉపయోగించి మానవుడు ఎదిగాడు. అప్పుడు శారీరక బలమే కాక బుద్ధి బలాన్ని ఉపయోగించి తమ జీవన విధానాన్ని మానవులు మార్చుకున్నారు. ఒక ప్రాంతం నుంచి ఇంకొక ప్రాంతానికి వలసలు పోలేదు. ఒకేచోట స్థిరపడి తమ చుట్టాలు, స్నేహితులతో ఒక వర్గంగా నివసించడం మొదలుపెట్టారు. శారీరక, మానసిక కోణాలే కాక ఆధ్యాత్మిక కోణాన్ని కూడా పెంపొందించుకున్న మానవులు వివిధ దైవ రూపాలను రూపొందించుకొని, క్రమంగా వాటిని వివిధ మతాలుగా మార్చుకోవడం మొదలుపెట్టారు. అంతేగాకుండా తన మేధతో మానవులు సాంకేతికతను అనూహ్యంగా పెంచుకున్నారు.

ఏ పెరుగుదల అయినా రకరకాల విషయాలపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి వైవిధ్యం పెరుగడం సహజం. అలాగే వివిధ భాషలు, ఆచారాలు, సంప్రదాయాలు, ప్రాంతాల వాతావరణాలు వైవిధ్యం కలిగి ఉంటాయి. ఈ పరిస్థితిలో ఆ వైవిధ్యాలను గౌరవించే నాగరికత పెరుగాలె. లేకపోతే సాంకేతికతతో బలం పొందిన ఈ మానవ జాతి ప్రశాంతంగా బతుకడం కష్టం. ముఖ్యంగా 20వ శతాబ్దం నుంచి వలస ప్రభుత్వాలు, రాజరికాలు పోయి, ప్రజాస్వామ్య దేశాలు ఎక్కువయ్యాయి. నిరంకుశ పాలకులు, రాజుల పాలన ఉన్నప్పుడు న్యాయవ్యవస్థ మొత్తం వారి చేతిలో ఉండి వారి ఇష్టానుసారం న్యాయపాలన జరుగుతుంది. కానీ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరు న్యాయమే కాక, ధర్మ ప్రవృత్తి, నైతిక ప్రవర్తన కలిగి ఉండాలి. ఎందుకంటే అందరూ సమానం అన్న వ్యవస్థలో శాంతి, సౌఖ్యాలు కాపాడటం అనేది అందరి బాధ్యత అవుతుంది. ఏ ఒక్కరికి ఇతరుల పట్ల ఇటువంటి గౌరవం, తేడాలను గౌరవించే ప్రవృత్తి లేకపోయినా, ఆ సంఘం మొత్తం అశాంతికి గురవుతుంది. ఇట్లా అందరినీ, వారి ఆచార వ్యవహారాలను గౌరవించి, సంస్కారవంతమైన ప్రవర్తన కలిగిన వాడిని నాగరికుడని అంటారు.

'యూనిటీ ఈజ్ నాట్ యూనిఫార్మిటీ!' కలిసి ఉండటం అంటే ఒకేలా ఉండటం కాదు. మనుషుల మధ్య వైవిధ్యాలున్నా, అవి వైరుధ్యాలుగా మార్చుకోకుండా కలిసిమెలిసి ఉండటం! ఈ రకంగా ఉండటానికి సంస్కారం కావాలి. ఇద్దరు మనుషుల మధ్య ఎటువంటి తేడాలున్నా మానవీయత వల్ల బంధాలు బలపడాలి. వివిధ మతాలు, కులాల వారు కలిసి ఉండాలి. ఎందుకంటే అవి ఒకరి వ్యక్తిత్వ విషయాలు. ప్రతి దేశంలో న్యాయవ్యవస్థ ఉంటుంది. కానీ నాగరికులం అనుకునే వారికి దాని పరిధిలోకి వెళ్లకుండా తమ ఆత్మ ప్రబోధించిన మార్గంలో బతికే శక్తి ఉండాలి. అనాగరికులు అన్ని యుగాల్లోనూ ఉంటారు. అన్ని ప్రాంతాల్లోనూ ఉంటారు. వారికి ధర్మం అన్నది శూన్యం. ఇతరుల న్యాయవ్యవస్థలను గౌరవించరు. ధర్మం అన్నది తెలిస్తే న్యాయంతో, శిక్షలతో పనిలేకుండా వ్యక్తులు సమాజంలోని శాంతి, సౌహార్ద్రాలను కాపాడుతారు. అయితే ఇప్పుడు కలియుగంలో ఉన్నాం. కాబట్టి ధర్మమార్గాన నడిచే వ్యక్తులు చాలా అరుదుగా కనిపిస్తారు. ఈ రోజుల్లో తప్పు చేస్తే శిక్ష ఉంటుందని భయమే తప్ప, అంతరాత్మ ప్రకారం తప్పుచేయకూడదనే భావన చాలా కొద్దిమందిలో చూస్తాం.

గుడి మీద, దేవుడి మీద విశ్వాసంలేని వారు అసలు గుడికి ఎందుకు వెళ్లాలి? అదీగాక అంతశక్తి ఉన్న మహిళలు నేడు దేశంలో స్త్రీలు, బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు తీర్చడానికి పాటుపడవచ్చు కదా! మహిళలు, బాలికలపై జరుగుతున్న లైంగికదాడులకు వ్యతిరేకంగా, వివాహిత స్త్రీలు ఎదుర్కొంటున్న వివక్షలను ఎదిరిస్తూ కృషి చేయవచ్చు. ఆడవారి కోసం చేయవలసిన పనులు ఇన్ని ఉన్నాయి. మన కర్మకు మనల్ని వదిలేసి వినోదం చూసే దేవుడి గుడికి వెళ్లడానికి ఎందుకు సమయం, శ్రమ వృథా చేయడం?

న్యాయవ్యవస్థను తీసుకుంటే అందులో ఉన్న పదవుల్లో ఉన్నవారు కూడా వ్యక్తిగత భావనలకు అతీతులుగా ఉంటారనుకోవడం భ్రమే! వారు కూడా రాజ్యాంగాలను అడ్డం పెట్టుకొని అభ్యంతరకర తీర్పులు ఇవ్వగలరు. కానీ ధర్మమాత్రులుగా ఉన్నవారు చాలా తక్కువ. అటువంటి ఒక ధర్మమూర్తిని ప్రజాకవి కాళోజీ చూశారు. ఒకసారి ఆంధ్ర ప్రాంతంలోని నాయకుడు ఒకరు ఉత్తరం పంపాడు. పోస్ట్ చేస్తే అది ఎక్కడ పోలీసుల చేతిలో పడుతుందో అని ఒక వార్తాహరుడి చేతికిచ్చి వరంగల్‌లో కాళోజీకి అందజేయవలసిందిగా చెప్పారు. దురదృష్టవశాత్తూ అతను పోలీసులకు చిక్కాడు. ఆ ఉత్తరం వారి చేతిలో పడింది. అందులో నిజాం రాజుకు వ్యతిరేకంగా చాలా ఘాటుగా రాసిన మాటలు చాలా ఉన్నాయి. పోలీసులు కాళోజీ మీద కేసు పెట్టి అక్కడి కోర్టులో హాజరుపరిచారు. రాజ్యం ముస్లిం రాజైన నిజాంది. న్యాయమూర్తి ముస్లిం. పట్టుకున్న పోలీసులు ముస్లింలే. ఇక కాళోజీ పని అయిపోయిందని అందరూ అనుకున్నారు. కేసు అంతా విని ఆ ఉత్తరాన్ని కూడా అనువదించుకొని చూసిన ఆ న్యాయమూర్తి చెప్పిన తీర్పునకు ప్రజలందరూ నిరుత్తరులయ్యారు. ఆయన అన్నారు; 'ఈ ఉత్తరంలోని మాటలకు ఎవరిని శిక్షించాలి? అది రాసిన వారిని. ఇది ఎవరికి పంపారో, వారిని కాదు.' ప్రభుత్వ వకీలు ఏదో చెప్పబోతే ఆ న్యాయమూర్తి ఇలా అన్నారట. 'ఒకవేళ ఎవరో ఇలాంటి ఉత్తరం మన నిజాంకు హిందువులకు వ్యతిరేకంగా రాసి పంపుతారనుకోండి. మరి నిజాంను శిక్షించాలా?' ఎంత న్యాయం, ఎంత ధర్మంగా ఉందీ మాట. ఇటువంటి సంస్కారం ఇప్పుడు న్యాయమూర్తులు అందరిలో కనిపిస్తున్నదా? రాజ్యాంగం అన్నది మానవ ధర్మం కంటే గొప్పది కాదు. కాబట్టి కాలనుగుణంగా దానిలో కూడా మార్పులు చేసుకుంటాం. అది శిలాశాసనం కానప్పుడు, మార్పులకు లోనయ్యే బలహీనతలు అందులో ఉన్నప్పుడు అది వందల ఏండ్ల నుంచి పాటించబడుతున్న సంప్రదాయానికీ, ఆచారాలకూ మించినదా? కోట్లాది ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోకుండా తీర్పు ఇవ్వడం న్యాయమా? ధర్మమా? సమాజంలో వివిధ మతాలకు చెందిన వారు శాంతియుతంగా బతుకాలంటే ఇటువంటి వైరుధ్యాలు సృష్టించడం న్యాయమూర్తుల స్థాయికి తగిన పనేనా? ఇప్పుడు కేరళలోని శబరిమలలో జరుగుతున్న అల్లర్లకు, వివాదాలకు కొందరు ప్రాణాలు కోల్పోయారు. అది వీరు సృష్టించిన వైరుధ్యం వల్ల కాదా? దేవుడున్నాడని ఎలా రుజువు చేయలేమో లేదని కూడా అలాగే రుజువు చేయలేము.

భారతదేశం లాంటి వైవిధ్యభరిత దేశంలో రాజ్యాంగంలో సిద్ధాంతం సెక్యులరిజం. అయితే ఒకరి మనోభావాలు నొప్పించే అధికారం ఎవరికీ లేదు. ఆఖరికి కోర్టు, న్యాయూర్తులకు కూడా లేదు. శబరిమలలో అనాదిగా వస్తున్న సంప్రదాయాల్ని కించపరుచటం అసలే నేరం. దీన్ని ధర్మపరిధిలోని అంశంగానే పరిగణించాలి. కానీ న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోకూడదు.

గుడిమీద, దేవుడి మీద విశ్వాసం లేనివారు అసలు గుడికి ఎందుకు వెళ్లాలి? అదీగాక అంతశక్తి ఉన్న మహిళలు నేడు దేశంలో స్త్రీలు, బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు తీర్చడానికి పాటుపడవచ్చు కదా! మహిళలు, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులకు వ్యతిరేకంగా, వివాహిత స్త్రీలు ఎదుర్కొంటున్న వివక్షలను ఎదిరిస్తూ కృషి చేయవచ్చు. ఆడవారి కోసం చేయవలసిన పనులు ఇన్ని ఉన్నాయి. మన కర్మకు మనల్ని వదిలేసి వినోదం చూసే దేవుడి గుడికి వెళ్లడానికి ఎందుకు సమయం, శ్రమ వృథా చేయడం?

నాగరికుల లాగా బతుకాలంటే మనుషులను మానవీయంగా చూడాలి. సమాజంలోని వైవిధ్యాలు వైరుధ్యాలు అవకుండా ప్రతి పౌరుడూ కృషిచేయాలి. ఇంకా వెనుకబడి ఉన్న దేశంలో మరింత అశాంతి సృష్టించడం ఎవరికీ క్షేమం కాదు. సంస్కారవంతమైన ఆలోచనలు, ఉన్నతమైన భావనలు, సభ్యత కలిగిన ప్రవర్తన ప్రతి వారూ కలిగి ఉండాలి. అప్పుడు ఈ దేశం గొప్పగా భావించే సమ్మిళిత సంస్కృతి జీవించి ఉంటుంది. అన్ని రాష్ట్రాలలోకి తెలంగాణ రాష్ట్రం నేడు ఈ విషయంలో ఆదర్శంగా నిలుస్తున్నది.

మా ప్యాట ఇప్పుడు జిల్లా

విశ్లేషణ



కె.బాలకిషన్ రావు

సీఎం కేసీఆర్ ఎన్నికల్లో చేసిన వాగ్దానం ప్రకారం నారాయణపేట, ములుగు కొత్త జిల్లాలుగా తెలంగాణ చిత్రపటంలో కనిపించనున్నాయి. మిగతా ప్రాంతాలతో పోలిస్తే బాగా వెనుకబడిన ప్రాంతాలుగా ఇవి గుర్తింపు పొందాయి. వలసలకు నెలవైన నారాయణపేట జిల్లాగా మారితే అభివృద్ధిలో దూసుకువెళ్తుందని చెప్పవచ్చు. ఇది కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దుగా ఉండటంతో స్థానికంగా ఇక్కడ కన్నడిగులు, మహారాష్ట్ర నుంచి వలసవచ్చిన చేనేత కుటుంబాల వారు ఎక్కువ. రాజస్థానీలు, గుజరాతీలు, తమిళులు ఇలా అన్ని ప్రాంతాల వారు ఈ చిన్న ప్యాటలో (నారాయణపేటను ప్యాట అని స్థానికులు పిలుచుకుంటారు) కనిపిస్తారు.

1978లో ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చెన్నారెడ్డి ఉన్నప్పుడు కొత్తగా వంద తాలూకాలు ఏర్పాటు చేయనున్నామని ప్రకటించారు. నారాయణపేట రెవెన్యూ డివిజన్ కేంద్రమే అయినా తాలూకా కాదు. స్వాతంత్య్రం వచ్చిన నాటినుంచి థర్డ్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉండేది. తాలూకా అయితే రెవెన్యూ పనుల కోసం మక్తల్‌కు వెళ్లే బాధ తప్పుతుందని ప్యాట వాసుల తపన. అందుకోసం స్థానిక నేతలు నాటి ముఖ్యమంత్రి చెన్నారెడ్డిని కలిసి నారాయణపేటను తాలూకా కేంద్రం చేయాలని వినతి పత్రాన్ని ఇచ్చారు. నాడు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని కూడా వారు చెప్పారు.

అప్పట్లో మండలాలు ఏర్పడకముందు నారాయణపేట వాసులేకాదు, చుట్టుపక్కల గ్రామాల వారంతా రెవెన్యూ పనులకు 32 కిలోమీటర్ల దూరంలోని మక్తల్‌లో ఉన్న తాలూకా కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. ఏదైనా పత్రం మంజూరైందీ లేనిదీ కనుక్కోవాలంటే ఎవరైనా వెళ్తుంటే వారికి వివరాలు ఇచ్చి తెలుసుకునేవాళ్లు. తహసీల్ ఆఫీసు వాళ్లు ఎప్పుడు రమ్మంటే అప్పుడు వెళ్లి తీసుకునేవాళ్లు. అలాంటి సమయంలో కొత్త తాలూకాల ప్రతిపాదన రావడం స్థానికుల్లో ఆశను నింపింది. ఇంతలో చెన్నారెడ్డికి సొంత పార్టీలోనే అసమ్మతి పెరుగడంతో కొత్త తాలూకాల ఏర్పాటు నిర్ణయం జరుగలేదు. ఆయన పదవి నుంచి దిగిపోవడం ఇతర రాజకీయ కారణాలవల్ల వంద తాలూకాల ఏర్పాటు అనేది మూలన పడిపోయింది.

మండల వ్యవస్థ ఏర్పాటులో భాగంగా నారాయణపేట మండల కేంద్రంగా మారింది. ప్యాటలో విద్యాభివృద్ధి అనుకున్నంతగా జరుగలేదు. కేవలం ఒకే ఒక్క జూనియర్ కాలేజీ మాత్రమే ఉండేది. చాలామంది ఉన్నత డిగ్రీ చదువాలని ఉన్నప్పటికీ ఇతర ప్రాంతాలకు వెళ్లలేకపోయేవారు. అదేవిధంగా మా కుటుంబంలో కూడా చదువులకు ఈ ఇబ్బంది ఏర్పడింది. మా అన్నయ్య, అక్కయ్యలు ఇద్దరూ ఇంటర్మీడియెట్ పూర్తవడంతో పై చదువుల కోసం నాన్న మహబూబ్‌నగర్‌కు బదిలీ చేయించుకున్నారు. నారాయణపేటలో ఉన్న ఇల్లు అమ్మేసి మేం మహబూబ్‌నగర్‌లో స్థిరపడ్డాం. అక్కడ డిగ్రీ దాకా చదువుకున్నాం. ఇదీ ఒకప్పటి నారాయణపేట పరిస్థితి.

నాటి చరిత్ర ఘనం: ఒకనాడు లోకపల్లె సంస్థానం పరిధిలో ఉన్న నారాయణపేట ఇంతింతై వటుడింతై అన్నట్లు అనేక ఘనతలను సాధించుకున్న పట్టణం. 1947లో జిల్లాలోనే తొలి మున్సిపాలిటీగా ఏర్పడింది. అంతేకాదు జిల్లాలో విద్యుత్ సౌకర్యం కలిగి న తొలి పట్టణం నారాయణపేటనే. దీనికి విద్యుదుత్పత్తి కోసం ప్రత్యేక కేంద్రాన్ని కూడా నడిపారంటే ఆశ్చర్యం కలుగకమానదు. అలాంటి ప్యాటలో చివరికి విద్య, ఉపాధి సౌకర్యాలు కరువై ప్రజలు వలసబాట పట్టిన స్థితికి చేరింది. చేనేత కార్మికులు ఉపాధి లేక ఇతర వృత్తులకు మళ్లారు. పనులు లేక వ్యవసాయ కూలీలు నగరాల్లో భవన నిర్మాణ కార్మికులుగా పనులకు చేరారు. దీనికి కారణం గతంలో ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు ఈ ప్రాంతాన్ని పట్టించుకోకపోవడమే.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నారాయణపేటలో చాలా మార్పులు కనిపిస్తున్నాయి. ఇటీవలికాలంలో వ్యవసాయరంగానికి ఊతమిచ్చేలా చర్యలు మొదలయ్యాయి. చేనేత కుటుంబాలు తమ వృత్తిని నమ్ముకొని ఉన్నాయి. వీరి కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటున్నది. అదేవిధంగా టెక్స్‌టైల్ మేనేజ్‌మెంట్ కోర్సు ఉన్న పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుచేయాలనే డిమాండ్ ఉన్నది. ఇంజినీరింగ్, ఫార్మసీ, మెడికల్ కాలేజీలు నారాయణపేట జిల్లాగా మారిన తర్వాత ఏర్పాటవుతాయని ఆశించవచ్చు.

నారాయణపేట ఇప్పుడు జిల్లాగా ఏర్పడితే పరిస్థితుల్లో గణనీయమైన మార్పురావచ్చునని ప్రజలు ఆశిస్తున్నారు. ఇక్కడి ప్రజలు జిల్లా సాధన సమితిగా ఏర్పడి పండుగలు కూడా చేసుకోకుండా ఆందోళనలు, బంద్‌లు చేసి తమ చిరకాల వాంఛను వ్యక్తంచేశారు. చివరకి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల మనోభావాలను గౌరవించి జిల్లా ఏర్పాటుకు ఆమోదం తెలుపడం హర్షణీయం. ఆ దిశగా ఇప్పటికే జిల్లా కార్యాలయాల ఏర్పాటుకు తాత్కాలిక భవనాల పరిశీలన కూడా జరిగిపోవడం శుభ పరిణామం. నారాయణపేటలో ఒకప్పుడు నాలుగు రోజులకోసారి నీటి సరఫరా జరిగేది. ఇప్పుడు మిషన్ భగీరథ వల్ల రోజు విడిచి రోజు నీటిసరఫరా జరుగుతున్నది. భవిష్యత్తులో ప్రతిరోజూ నీటిసరఫరా చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇదికూడా ప్రజలకు సంతోషం కలిగిస్తున్నది.

జనాభా నాడు తగ్గుముఖం: నారాయణపేట వలసలకు పెట్టింది పేరు. చుట్టుపక్కల పల్లెల నుంచి 1970, 80వ దశకాలలోనే ఎంతోమంది భీవండి, షోలాపూర్, ముంబై ప్రాంతాలకు బతుకుదెరువు కోసం వలసవెళ్లారు. దీనివల్ల ఒక దశలో నారాయణపేట పట్టణ జనాభా (1971-1981) బాగా తగ్గిపోవడం ఒక విచిత్రం. 25 వేల జనాభా 21 వేలకు, ఆ తర్వాత 18 వేలకు పడిపోయింది. అయితే కాలం ఎప్పుడూ ఒకలా ఉండదు. 1985లో నుంచి పరిస్థితులు మారాయి. మక్తల్ ఎమ్మెల్యేగా చిట్టెం నర్సిరెడ్డి వచ్చిన తర్వాత నారాయణపేటలో అభివృద్ధి పనులు మొదలయ్యాయి. డిగ్రీ కాలేజీ, బస్‌డిపో ఏర్పాటయ్యాయి. దీనివల్ల పల్లెల నుంచి ప్రజలు చదువులకు, వ్యాపారాల కోసం నారాయణపేటకు రాసాగారు. ప్రస్తుతం పట్టణ జనాభానే 55 వేలకు చేరుకుందని ఇటీవలి సర్వేలు తెలుపుతున్నాయి.

నారాయణపేటలో పరిశ్రమల పరంగా, విద్యాపరంగా కానీ ఎలాంటి వసతులు నేటికీ విస్తరించలేదు. ప్రైవేట్ రంగంలో రెండు విద్యా కళాశాలలు, ఒక ఐటీఐ ఏర్పాటయ్యాయి, ఇక్కడ నెలకొల్పిన ఇంజినీరింగ్ కాలేజీ హైదరాబాద్ శివారుకు వెళ్లిపోయింది. బాలికల కోసం జూనియర్, డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉన్నది. నారాయణపేటలో బాలుర, బాలికల పాలిటెక్నిక్ కాలేజీలు ఏర్పాటైతే తమ ప్రాంతం యువతీయువకులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని జిల్లావాసులు అభిప్రాయపడుతున్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నారాయణపేటలో చాలా మార్పులు కనిపిస్తున్నాయి. ఇటీవలికాలంలో వ్యవసాయరంగానికి ఊతమిచ్చేలా చర్యలు మొదలయ్యాయి. చేనేత కుటుంబాలు తమ వృత్తిని నమ్ముకొని ఉన్నాయి. వీరి కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటున్నది. అదేవిధంగా టెక్స్‌టైల్ మేనేజ్‌మెంట్ కోర్సు ఉన్న పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుచేయాలనే డిమాండ్ ఉన్నది. ఇంజినీరింగ్, ఫార్మసీ, మెడికల్ కాలేజీలు నారాయణపేట జిల్లాగా మారిన తర్వాత ఏర్పాటవుతాయని ఆశించవచ్చు.

జిల్లా పాలనా విభాగాలన్నీ ఏర్పాటైతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధుల కేటాయింపు జరుగుతుంది. అదేవిధంగా విద్యాపరంగా నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు వస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కొన్ని గురుకులాలను నారాయణపేట నియోజకవర్గంలో ఏర్పాటుచేసింది. మరిన్ని కూడా వచ్చే అవకాశం ఉన్నది. వ్యవసాయాభివృద్ధికి, పశుసంవర్ధక విభాగానికి నిధులు పెరుగుతాయి. వెనుకబడిన జిల్లాల పథకం కింద ప్రత్యేక నిధులను పొందే వీలు కలుగుతుంది. ప్రధానంగా ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా ఏర్పాటుకు ఆదేశించినందున ఒక జిల్లా కేంద్రంలో కావాల్సిన సౌకర్యాలు, విద్యావసతుల కల్పనలో ప్రత్యేక శ్రద్ధ కనబరిచి మంజూరు చేస్తారనడంలో సందేహం లేదు. భవిష్యత్తులో నారాయణపేట అభివృద్ధి బాట పట్టనుందని ఆశించవచ్చు.



మమతా దీదీకి జన్మదిన శుభాకాంక్షలు. ఈ దేశానికి మీ లాంటి నిర్భయులైన, నిజాయితీగల నాయకులు అవసరం. మీరు కలకాలం ఆరోగ్యంగా జీవించాలని ప్రార్థిస్తున్నా.

అరవింద్ కేజ్రీవాల్



మూకదాడులను, ఘోరమైన హత్యలను బాలీవుడ్‌లోని ప్రముఖులెవరూ ఖండించకపోవడం బాధాకరం. ఈ విద్వేషాలను నిలిపివేయాలని ఎవరూ అనడం లేదంటే , ఇదంత తీవ్రమైన అంశం కాదా. ఇది ఉగ్రవాదం కాదా? ఎంతో ఎంతో బాధాకరం.

గౌహర్ ఖాన్



మహిళల హక్కులకు సంబంధించి భారతదేశ ప్రతిష్ఠను శబరిమల ఉదంతం మసకబారుస్తుంది. మహిళల రక్తాన్ని మరకగా చూస్తున్నప్పుడు, ఇందిరాగాంధీ గురించి, మహిళా రక్షణ మంత్రి గురించి ఎంత గొప్పగా చెప్పుకొని ఫలితమేమిటి?

బర్ఖాదత్



2014 నుంచి 2019 వరకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్డీయే/బీజేపీ హామీ ఇచ్చింది. ఈ లెక్కన ఐదేండ్లలో పది కోట్ల ఉద్యోగాలు కల్పించాలె. కానీ ఒక్క 2018లోనే కోటీ పది లక్షల ఉద్యోగాలు పోయాయి.

మనీష్ తివారీ

సమాఖ్యలోనే రాష్ట్రాల అభివృద్ధి

ఫెడరల్ ఫ్రంట్



శ్రీనివాస్ సార్ల

పదహారు ఎంపీ స్థానాలతో కేసీఆర్ కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాడా అని కొందరు మాట్లాడుతున్నారు. సాధారణ ఎన్నికల్లో ఏ పార్టీకి సరైన మెజార్టీ లేక ప్రాంతీయ పార్టీల మద్దతుతో ఏర్పడే సంకీర్ణ ప్రభుత్వానికి బలమైన ఫెడరల్ స్ఫూర్తితో ఏర్పడే కేంద్ర ప్రభుత్వానికి మధ్య తేడా అర్థం చేసుకోలేకపోవడమే వాళ్ల అస్పష్ట ఆలోచనలకు మూలం. కేంద్ర ప్రభుత్వంలో అధికారం చెలాయించడానికి మాత్రమే ఏర్పడే సంకీర్ణ ప్రభుత్వాలు తొందరగా విచ్ఛిన్నమవుతాయి. సంకీర్ణానికి ప్రాంతీయ పార్టీలు కొన్ని నిర్దిష్టమైన ప్రయోజనాలు ఆశించే మద్దతు ఇస్తాయి. ఆ ప్రయోజనాలు నెరవేరలేని పక్షంలో మద్దతు ఉపసంహరించుకుంటాయి. గతంలో 1989లో వీపీసింగ్, అలాగే 1997లో వాజపేయి ఆధ్వర్యంలో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వాలు ఇవే కారణాల వల్ల కూలిపోవడం మనం చూశాం.

ప్రస్తుతం ఏర్పడబోయే ఫెడరల్ ఫ్రంట్ దీనికి పూర్తిగా విరుద్ధం. రెండు ముఖ్య జాతీయ పార్టీల ఏకఛత్రాధిపత్యానికి, నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా, రాష్ట్రాల స్వేచ్ఛకు వికేంద్రీకృత అధికార స్థాపనకు మార్గదర్శకంగా ఈ ఫెడరల్ ఫ్రంట్ ఏర్పడబోతుందని కేసీఆర్ మాటలను బట్టి స్పష్టమవుతున్నది. భారత రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక ఇమేజ్ సృష్టించుకున్న కేసీఆర్ జాతీయస్థాయి రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తానని ప్రకటించడం ఆహ్వానించదగ్గ పరిణామం. ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వ నియంత్రణ నుంచి బయటకు రావాలని, రాష్ట్ర వ్యవహారాల్లో కేంద్ర ఆధిపత్యాన్ని పూర్తిగా పరిమితం చేయాలని, కేంద్ర ప్రభుత్వాన్ని రక్షణ, కరెన్సీ, విదేశాంగం వంటి అంశాలకే పరిమితం చేయాలని కేసీఆర్ వివరిస్తున్నారు. మరీ ముఖ్యంగా నేటి రాజకీయాల్లో రాజ్యాంగంలోని విశిష్ట లక్షణమైన సమాఖ్య స్ఫూర్తి కనుమరుగవుతున్నది. ఈ నేపథ్యంలో కేసీఆర్ లాంటి నాయకులు సమాఖ్య స్ఫూర్తి నినాదం చేపట్టి ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు దిశగా పయనించడం జాతీయస్థాయిలో చర్చానీయాంశమైంది. ఈ చర్చ రాష్ట్రాల బలోపేతానికి ముందుడుగుగా భావించవచ్చు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన నాటినుంచి కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా రాష్ట్రాలను రాజకీయ లబ్ధి కోసం అణిచివేస్తూ సమాఖ్య స్ఫూర్తికి తూట్లు పొడిచాయి. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన కొత్తలో రాజ్యాంగంలో ఎక్కడా సమాఖ్య అనే పదం ఉపయోగించనప్పటికీ రాజ్యాంగ నిర్మాతలు మౌలికంగా సమాఖ్య విధానానికి మొగ్గు చూపారు.

రాజ్యాంగంలోని మొదటి ప్రకరణ దేశాన్ని రాష్ట్రాల యూనియన్ అని పేర్కొంటున్నది. రాష్ట్రాల సమాఖ్య అని పేర్కొనకుండా యూనియన్ ఆఫ్ స్టేట్స్ అని పేర్కొనడానికి రాజ్యంగా నిర్మాతలు రెండు కారణాలు పేర్కొన్నారు. 1.అమెరికా వలె రాష్ట్రాల మధ్య ఒప్పందంతో భారత దేశం ఏర్పడలేదు, 2.సమాఖ్య నుంచి అమెరికాలో వలె రాష్ట్రాలకు విడిపోయే అవకాశం మన దేశంలో రాష్ట్రాలకు లేదు. మన రాజ్యాంగం సమాఖ్య తరహా వ్యవస్థను ఏర్పరిచినప్పటికీ మనది పూర్తిస్థాయి సమాఖ్య కాదు. పూర్తిస్థాయి సమాఖ్య వ్యవస్థలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య స్పష్టమైన అధికార విభజన ఉంటుంది. అంటే కేంద్ర ప్రభుత్వం చేసే శాసనపరమైన అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ అంశాల్లో కేంద్రం జోక్యం చేసుకోదు. పూర్తిస్థాయి సమాఖ్యలో కేంద్ర, రాష్ట్రాలకు వేర్వేరు ప్రత్యేక రాజ్యాంగాలు ఉంటాయి. ఆ దేశ పౌరులకు కేంద్రస్థాయిలో, రాష్ట్రస్థాయిలో వేర్వేరు పౌరసత్వం ఉంటుంది. పూర్తిస్థాయి సమాఖ్యగా ఉన్న దేశాల్లో దృఢమైన రాజ్యాంగం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా చట్టాలు చేయలేదు.

కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా రాష్ట్రాలకు సంబంధించిన అంశాల్లో జోక్యం చేసుకోవడం పెరిగిపోతున్నది. దీనివల్ల రాష్ట్రాల అభివృద్ధి కుంటుపడుతున్నది. మారుతున్న కాలానికి అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర సంబంధాలు ఉండాలె. బలమైన కేంద్రం గల వ్యవస్థ నుంచి బలమైన రాష్ట్రాల వ్యవస్థ ఏర్పడాలె. లేకపోతే పెద్ద నోట్ల రద్దు వంటి కేంద్ర ప్రభుత్వ తొందరపాటు నిర్ణయాల వల్ల అన్ని రాష్ట్రాలు, ప్రజలు ఇబ్బంది పడవలసి వస్తుంది. అందువల్ల ప్రాంతీ య ప్రభుత్వాల ఐక్యతతోనే దేశాభివృద్ధి సాధ్యం.

దేశం మొత్తం వర్తించే చట్టం చేయాలంటే రాష్ట్రాల ఆమోదం తప్పనిసరి. మన దేశం ఇందుకు భిన్నమైన సమాఖ్యను ఏర్పరుచుకున్న ది. కేంద్ర రాష్ట్రాల మధ్య స్పష్టమైన అధికార విభజన ఉన్నప్పటికీ మన దేశంలో కేంద్ర అధిపత్యమే అంతిమం.

మన రాజ్యాంగం కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితా పేర మూడు రకాలైన అధికార విభజన చేసింది. కేంద్ర జాబితాలో వంద అంశాలున్నాయి. వీటి మీద కేంద్రమే చట్టాలు చేస్తుంది. రాష్ట్ర జాబితాలోని 61 అం శాల మీద రాష్ట్రమే చట్టాలు చేయాలి. ఉమ్మడి జాబితాలోని 52 అంశాలపై కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేసుకోవచ్చు. రాష్ట్ర జాబితా చట్టాల్లో రాష్ట్రాలదే అధికారమైనప్పటికీ అవి కేంద్ర చట్టాలకు లోబడి ఉండాలి. అలాగే ఉమ్మడి జాబితాలో రాష్ట్రాలకు అధికారం ఉన్నప్పటికీ కేంద్ర చట్టమే అంతిమం.

కేంద్రం అత్యవసర పరిస్థితి ప్రకటించడం ద్వారా నిరంకుశంగా పాలించే అవకాశం ఉన్నది. కేంద్రం ప్రభుత్వాలు రాష్ట్రాలను బెదిరిస్తూ తమ ఆధిపత్యం చెలాయిస్తున్నది. కేంద్రంలో, రాష్ట్రాల్లో వేర్వేరు పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు అనేక సమస్యలు వస్తున్నాయి. రాష్ట్రంలో పరిపాలనా రాజ్యాంగబద్ధంగా లేదని రాష్ట్రపతి పాలనా తీసుకువచ్చి రాష్ట్రాల హక్కులను కాలరాసిన ఉదంతాలు ఉన్నాయి. అదేవిధంగా రాష్ట్రాలకు చెల్లించాల్సిన గ్రాంటులు నిలిపివేసి రాష్ట్రాల అభివృద్ధిని అడ్డుకుంటున్నాయి. ఉదాహరణకు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి రావలసిన నిధులను విడుదల చేయలేదు. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం మీద ప్రజల్లో వ్యతిరేకతాభావం పెంచడం ద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందాలని ప్రయత్నించింది.


కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా రాష్ట్రాలకు సంబంధించిన అంశాల్లో జోక్యం చేసుకోవడం పెరిగిపోతున్నది. దీనివల్ల రాష్ట్రాల అభివృద్ధి కుంటుపడుతున్నది. మారుతున్న కాలానికి అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర సంబంధాలు ఉండాలె. బలమైన కేంద్రం గల వ్యవస్థ నుంచి బలమైన రాష్ట్రాల వ్యవస్థ ఏర్పడాలె. లేకపోతే పెద్ద నోట్ల రద్దు వంటి కేంద్ర ప్రభుత్వ తొందరపాటు నిర్ణయాల వల్ల అన్ని రాష్ట్రాలు, ప్రజలు ఇబ్బంది పడవలసి వస్తుంది. అందువల్ల ప్రాంతీయ ప్రభుత్వాల ఐక్యతతోనే దేశాభివృద్ధి సాధ్యం.

డెబ్బై ఏండ్ల నుంచి కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా తమ రాజకీయ అవసరాల కోసం రాష్ట్ర ప్రభుత్వాలను బలహీనం చేస్తూ రాష్ట్రాల అభివృద్ధిని అడ్డుకున్నాయి. ఇలాంటి ఏకపక్ష నియంతృత్వ పోకడ చివరికి రాష్ట్రాల మధ్య ఆర్థిక, రాజకీయ, సామాజిక అసమానతలకు దారితీసింది. ఈ విధానాలు దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలు, ప్రజల మధ్య వైషమ్యాలు పెరిగాయి. అది జాతీయ సమగ్రతకు భంగం కలిగిస్తూ, అస్థిర పరిస్థితులు పెరుగడానికి దోహదం చేశాయి. ఇప్పుడున్న వ్యవస్థ దేశానికి ప్రమాదకరం. కేసీఆర్ సూచనల మేరకు రాష్ట్రాల ప్రయోజనాన్ని కాపాడుకునేలా, రాష్ట్రాల అధికారాలను బలోపేతం చేసుకునేవిధంగా చర్చలు జరుగాలె.

స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ఏడు దశాబ్దాలు దాటినప్పటికీ రెండుసార్లు మాత్రమే దక్షిణ భారతానికి ప్రధాని పదవి దక్కింది. ఇది కచ్చితంగా ఆ రెండు జాతీయ పార్టీల నాయకులు చూపించిన రాజకీయ వివక్ష. వారి పాలనలో ఉత్తరాది రాష్ట్రాలు అభివృద్ధి చెందలేదు. దక్షిణాది రాష్ట్రాల ఆదాయాన్ని తమ రాజకీయ స్వార్థం కోసం మింగేస్తూ, ఇటు దక్షిణాది రాష్ట్రాలకు, అటు ఉత్తరాది రాష్ట్రాలకు న్యాయం చేయలేకపోయారు. ప్రతి రాష్ట్రం సంపూర్ణంగా అభివృద్ధి చెందాలంటే ఫెడరల్ ఫ్రంట్ అధికారంలోకి రావడం ఒక్కటే మార్గం. అది కేసీఆర్‌తోనే సాధ్యం.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

పోటెత్తిన భక్తజనం..



శనివారం అమావాస్య కావడంతో నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జాన్కంపేట్‌లోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అంతకుముందు అష్టముఖి కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి, చుట్టూ తొమ్మిది ప్రదక్షిణలు చేశారు. అనంతరం లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. సుమారు 50 వేల మంది వరకు భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్టు అంచనా. - రెంజల్

రాష్ట్రంలో మూడ్రోజులు పొడి వాతావరణం

- సాధారణ స్థాయికి ఉష్ణోగ్రతలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి
- మంచిర్యాల జిల్లాలో ఒకే గ్రామంలో ముగ్గురు మృతి



మహబూబాబాద్ జిల్లా మానుకోట రైల్వేస్టేషన్‌పై శనివారం ఉదయం 9గంటల వరకు కూడా కురుస్తున్న మంచు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి చేరుకుంటున్నాయి. రామగుండం, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో మినహా మిగతాచోట్ల కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఆ మూడు జిల్లాల్లో మాత్రం కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు డిగ్రీలు తక్కువగా నమోదుకాగా, మిగతా జిల్లాల్లో పదిరోజుల కిందట ఉన్న ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యల్ప ఉష్ణోగ్రతలతో గజగజలాడిన ఆదిలాబాద్ జిల్లాలో సాధారణ పరిస్థితి నెలకొన్నది. శనివారం గరిష్ఠ ఉష్ణోగ్రత 31 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 11 డిగ్రీలుగా నమోదైంది. తెలంగాణలో ఆగ్నేయ దిక్కు నుంచి, ఆంధ్రప్రదేశ్‌లో ఈశాన్య దిశ నుంచి చలిగాలులు వీస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. తెలంగాణలో ఆదివారం నుంచి మూడురోజులవరకు పొడి వాతావరణం ఉంటుందని, చలి తీవ్రత చాలావరకు తగ్గుతుందని చెప్పారు. మంచిర్యాల జిల్లా భీమారం మండలం మద్దికల్ గ్రామ పంచాయతీ పరిధిలోని నేరేడుపల్లికి చెందిన వృద్ధులు బొడుక రాజమల్లు(73), ఎస్సీకాలనీకి చెందిన బచ్చల చిన్నమ్మ అలియాస్ చిన్నక్క(70), ఎస్టీకాలనీకి చెందిన నైతం రామక్క (71) చలిగాలుల ప్రభావంతో శుక్రవారం రాత్రి మృతిచెందారు.

చలికాలం

జిల్లా	కనిష్ఠం	గరిష్ఠం
సంగారెడ్డి	8.5	34.6
మహబూబ్‌నగర్	8.9	33.2
వికారాబాద్	9.1	24.0
నాగర్‌కర్నూల్	9.3	33.7
మెదక్	9.7	34.5
సిద్దిపేట	10.0	33.9
నిర్మల్	10.4	34.6
ఆసిఫాబాద్	11.0	31.0
మంచిర్యాల	11.0	31.0
ఆదిలాబాద్	11.0	31.0
యాదాద్రి	11.1	34.1
జోగులాంబ గద్వాల	11.5	32.9
జనగామ	12.2	33.5
పెద్దపల్లి	12.4	30.2
మహబూబాబాద్	13.1	35.5
వనపర్తి	13.5	34.6
కరీంనగర్	13.5	35.5
కామారెడ్డి	14.0	31.0
జగిత్యాల	14.0	32.0
నిజామాబాద్	14.4	31.8
మేడ్చల్	14.8	29.0
హైదరాబాద్	14.8	29.0
సూర్యాపేట	15.0	28.0
రంగారెడ్డి	15.0	30.0
వరంగల్ రూరల్	15.0	30.0
భద్రాద్రి కొత్తగూడెం	15.0	31.0
ఖమ్మం	16.0	29.0
జయశంకర్	16.0	29.0
నల్లగొండ	16.0	29.4
వరంగల్ అర్బన్	16.0	30.0
రాజన్న సిరిసిల్ల	16.0	31.0

ఏకగ్రీవాల వెల్లువ..

ఐక్యతను చాటుతున్న పల్లెలు
అభివృద్ధి కోసం ఏకగ్రీవ పంచాయతీల బాట
ఫలిస్తున్న నేతలు ప్రయత్నాలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: గ్రామాల అభివృద్ధి కోసం పల్లె జనం నడుం బిగించారు. ఈ ఎన్నికల్లో పంచాయతీ పాలకవర్గాన్ని ఏకగ్రీవం చేసుకొని ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాన్ని అందుకొని గ్రామంలో అభివృద్ధిని పరుగులు పెట్టించేందుకు జనం తహతహలాడుతున్నారు. ఇప్పటికే పదుల సంఖ్యలో సర్పంచ్‌లను ఏకగ్రీవం చేసుకోగా ఈ సంఖ్య రోజురోజుకూ మరింత పెరుగుతున్నది. శనివారం కూడా పలుచోట్ల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక నాయకుల ప్రయత్నాలు, ఎమ్మెల్యేల చొరవతో ఏకగ్రీవ తీర్మానాలు ముమ్మరంగా సాగుతున్నాయి.

అదేబాటలో బాబాయిచెరువుతండా..

వీర్నపల్లి మండలం బాబాయిచెరువుతండా ఇటీవల నూతన గ్రామపంచాయతీగా ఏర్పడింది. గ్రామస్థులంతా శనివారం సమావేశమై సర్పంచ్ సహా పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచ్‌గా భూక్య లక్ష్మి, ఉపసర్పంచ్‌గా బానోత్ రాములు, వార్డు సభ్యులుగా బానోత్ సుజాత, అజ్మీరా పంగవ్వ, భూక్య ప్రకాశ్, ముడావత్ సుబిత, భూక్య మదన్‌ను ఎన్నుకుంటూ తీర్మానించారు. రాబోయే ప్రోత్సాహక నిధులతో గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసుకుంటామని వారు ముక్తకంఠంతో ప్రకటించారు. అనంతరం గ్రామస్థులంతా సంబురాలు చేసుకున్నారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం హుస్సేన్‌నగర్ కొత్త పంచాయతీ సర్పంచ్‌గా సయ్యద్ హైదర్, ఉపసర్పంచ్‌గా షేక్ సాదుల్లా, వార్డు మెంబర్లుగా షేక్ అబ్దుల్ కరీం, షేక్ పెద్ద మౌలాన, అబ్దుల్ కలాం, షేక్ మౌలాన, షేక్ కరీం, షేక్ హైదర్, సయ్యద్ చాంద్‌లను ఎన్నుకుంటూ తీర్మానం చేశారు. అనంతరం కొత్త పాలకవర్గాన్ని టీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు.

కామారెడ్డి జిల్లాలో..

కామారెడ్డి జిల్లా గాంధారి మండలం సోమారం తండా గ్రామ పంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్ పదవులతో పాటు పాలకవర్గం ఏకగ్రీవమైంది. సర్పంచ్‌గా కిషన్ నాయక్, ఉప సర్పంచ్‌గా మోతీరాం నాయక్‌తోపాటు, అన్ని వార్డుల సభ్యులను ఏకగ్రీవం చేస్తూ తీర్మానించారు. మాచారెడ్డి మండలం మైసమ్మ చెరువు తండా సర్పంచ్‌గా మాలావత్ సంతోష్, ఉప సర్పంచ్‌గా మాలావత్ పంతుల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 'మా తండా–మా పాలన' అనే నినాదంతో తండా అభివృద్ధికి పాటుపడతానని ఈ సందర్భంగా సంతోష్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని కొత్త పంచాయతీలు టేక్డి రాంపూర్, కరన్‌వాడీ, మర్కగూడ, వడగాంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తీర్మానం చేశారు. ఉట్నూర్ మండలం మత్తడి గూడ, జైనథ్ మండలం మారుగూడలోనూ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని నిర్ణయించారు. నిర్మల్ జిల్లా కుంటాల మండలం సూర్యాపూర్, సారంగాపూర్ మండలం సోనాపూర్ తండా, ఖానాపూర్ మండలం బావాపూర్ (కే), బీర్నంది, గోసంపల్లె గ్రామాల్లో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ గ్రామస్థులు తీర్మానించారు.

జనగామలో సిరిపురం బోణీ..

జనగామ జిల్లా లింగాలఘనపురం మండలంలోని సిరిపురం గ్రామస్థులు సర్పంచ్‌తోపాటు ఉపసర్పంచ్, 8 మంది వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాలో ఏకగ్రీవమైన తొలి పంచాయతీగా సిరిపురం బోణీకొట్టింది. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, ప్రజాప్రతినిధులు పంచాయతీ పాలకవర్గ ఏకగ్రీవానికి చేసిన కృషి ఫలించింది. ఈ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని మిగతా గ్రామాలు ఆ దిశగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో పగిడేరు నుంచి వేరుపడి బుగ్గ కొత్త పంచాయతీగా ఏర్పడింది. ఈ పంచాయతీ పాలక వర్గాన్ని ఏకగ్రీవం చేస్తూ తీర్మానం చేశారు. స్థానికులు సమావేశమై సర్పంచ్‌గా తాటి రామకృష్ణ, ఉప సర్పంచ్‌గా వట్టం సారయ్యతోపాటు వార్డు మెంబర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తీర్మానించారు.

హైబొత్‌పల్లి గ్రామపంచాయతీ ఏకగ్రీవం..

వరంగల్ రూరల్ జిల్లా పరకాల మండలంలోని హైబొత్‌పల్లి సర్పంచ్ స్థానం ఏకగ్రీవమైంది. సర్పంచ్‌గా టీఆర్‌ఎస్ నాయకుడు కంచె కుమారస్వామిని గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు.

ఏకగ్రీవంగా పర్శనాయక్‌తండా..

వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట మండలంలోని పర్శనాయక్‌తండా వాసులు సర్పంచ్‌తోపాటు ఉప సర్పంచ్, 8మంది వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ప్రకటించుకున్నారు. దీంతో నర్సంపేట మండలంలో మొట్టమొదటి ఏకగ్రీవ గ్రామ పంచాయతీగా పర్శనాయక్‌తండా రికార్డు సాధించింది. ఇదే మండలం లోని మరో ఏడు గ్రామాలు ఏకగ్రీవానికి చేరువలో ఉన్నాయి.



రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం బాబాయిచెరువుతండాలో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్, వార్డుసభ్యులు



కామారెడ్డి జిల్లా గాంధారి మండలం సోమారం తండాలో ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీ పాలకవర్గ సభ్యులు

కేటీఆర్ ప్రకటనకు విశేష స్పందన

ప్రభుత్వ ప్రోత్సాహకం రూ.10 లక్షలకు తోడు తన ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.15లక్షలు అదనంగా అందజేస్తానని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన ప్రకటనకు విశేష స్పందన లభిస్తున్నది. ఇప్పటికే రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి గంభీరావుపేట మండలం లక్ష్మీపూర్‌తండా, పొన్నాలపల్లె, రుద్రంగి మండలం దేగావత్‌తండాలు పంచాయతీ పాలకవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకుని ఆదర్శంగా నిలిచాయి. అభివృద్ధే లక్ష్యంగా ఐక్యతను చాటాయి. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌కు అనుబంధంగా కొనసాగిన గుంటపల్లి చెరువుతండా కొత్త పంచాయతీగా ఏర్పడింది. గ్రామస్థులంతా శనివారం సమావేశమై సర్పంచ్‌గా మాలోత్ సునీత, ఉపసర్పంచ్‌గా నూనావత్ కైలాష్, వార్డు సభ్యులుగా గుగులోత్ సోటీ, గుగులోత్ మౌనిక, భూక్యారేణా, గుగులోత్ మోహన్, భూక్యా గణపతిని ఎన్నుకున్నారు.

కొడుకు ఎమ్మెల్యే.. తండ్రి సర్పంచ్
రత్యతండా సర్పంచ్‌గా దేవరకొండ ఎమ్మెల్యే తండ్రి కన్నీలాల్ ఏకగ్రీవం



దేవరకొండ, నమస్తేతెలంగాణ: నల్లగొండ జిల్లా దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ తన నియోజకవర్గ ప్రజలకు సేవచేస్తుండగా ఆయన తండ్రికి కూడా సర్పంచ్‌గా గ్రామానికి సేవ చేసే అవకాశం కలిగింది. దేవరకొండ ఎమ్మెల్యేగా రవీంద్ర కుమార్ ఇటీవల జరిగిన ఎన్నికల్లో మూడోసారి గెలుపొందారు. ఆయన సొంతూరైన రత్యతండా ఇటీవల గ్రామ పంచాయతీగా ఏర్పాటైంది. ఈ గ్రామం జనరల్ క్యాటగిరీకి రిజర్వు కాగా.. మొదటి నుంచి రవీంద్రకుమార్ కుటుంబానికి స్థానికంగా మంచి పేరు ఉండటంతో ఈసారి సర్పంచ్ ఎన్నికల్లో ఆయన తండ్రి కన్నీలాల్‌ను ఏకగ్రీవంగా తీర్మానించారు. ఎమ్మెల్యేకు ముందు రవీంద్ర కుమార్ కూడా రెండు పర్యాయాలు సర్పంచ్‌గా పనిచేయగా ఆయన తండ్రి కూడా సర్పంచ్‌గా ఎన్నికవడం విశేషం.



మూడుగుండ్లపై శివలింగం దర్శనంకోసం క్యూలైన్లలో భక్తులు (ఇన్‌సెట్‌లో) స్వామివారు

భక్తజనసంద్రం.. చెర్వుగట్టు శైవక్షేత్రం

నార్కట్‌పల్లి: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవాలయం భక్తులతో కిక్కిరిసింది. శనివారం అమావాస్య కావడంతో భక్తులు పోటెత్తారు. గుట్టపై నిద్ర చేసే భక్తుల 'ఓం నమః శివాయ' అంటూ స్మరించగా.. శివసత్తులు పూనకాలతో స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవ విగ్రహాలకు కల్యాణ మండపం వద్ద లక్ష పుష్పార్చన జరిపించారు.

రూ.71 లక్షలు లూటీచేసిన సైబర్ నేరగాళ్లు
జనగామ జిల్లా బచ్చన్నపేటలో ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

బచ్చన్నపేట: అత్యాశకు పోయిన ఓ బీటెక్ విద్యార్థి సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయాడు. ఓ కంపెనీ క్విజ్ పోటీల్లో రూ.6 కోట్లు గెల్చుకున్నట్టు మొబైల్‌కు మెసేజ్ రావడంతో దాన్ని పొందేందుకు సైబర్‌నేరగాళ్ల ఖాతాల్లో రూ.71 లక్షలు డబ్బులు జమ చేశారు. బాధితుడి తండ్రి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్సై రంజిత్‌రావు కథనం ప్రకారం.. బచ్చన్నపేటకు చెందిన కరికె ఐలయ్య కుమారుడు భరత్ బీటెక్ చదువుతున్నాడు. కోకాకోలా కంపెనీ క్విజ్ పోటీల్లో రూ.6 కోట్లు గెలుచుకున్నట్టు గత ఏడాది జనవరిలో భరత్ మొబైల్‌కు మెసేజ్ వచ్చింది. సదరు మొత్తం కావాలంటే కొంత నగదును డిపాజిట్ చేయాలని సైబర్ నేరగాళ్లు చెప్పడంతో అతడు విడతల వారీగా రూ.71,20,600లను నెట్‌బ్యాంకింగ్, ఫోన్‌పే ద్వారా వారి ఖాతాల్లో జమచేశాడు. ఆ తరువాత వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో మోసపోయినట్టు గ్రహించాడు. ఇంతలో అప్పు ఇచ్చిన వారు భరత్‌ను నిలదీయడంతో గ్రామం నుంచి పరారయ్యాడు. తన కుమారుడిని మోసగించిన వారిపై చర్యలు తీసుకోవాలని భరత్ తండ్రి ఐలయ్య శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.



సైన్స్‌ఫెయిర్‌లో స్టాల్‌ను ప్రారంభిస్తున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి

నిట్‌లో రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్ ప్రారంభం

సిద్ధార్థనగర్(వరంగల్): జనవిజ్ఞాన వేదిక వరంగల్ అర్బన్ జిల్లా కమిటీ, తెలంగాణ రాష్ట్రం, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంయుక్తంగా రెండ్రోజులు నిర్వహించే స్టేట్ లెవల్ చెకుముకి చిల్డ్రన్స్ సైన్స్‌ఫెయిర్ శనివారం వరంగల్‌లో ప్రారంభమైంది. నిట్‌లో ఏర్పాటుచేసిన ఈ ఫెయిర్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శాస్త్ర,సాంకేతిక రంగాల ఆవిష్కరణలు, మానవ ప్రగతికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో నిట్ రిజిస్ట్రార్ గోవర్ధన్, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అందె సత్యం తదితరులు పాల్గొన్నారు.

చావులోనూ వీడని పేగుబంధం
తల్లి బతకదని తెలిసి కొడుకు ఆత్మహత్య
కొడుకు మరణవార్త విని తల్లి మృతి
నల్లగొండ జిల్లా అప్పాజిపేటలో విషాదం



భానుమతి, ప్రకాశ్ (ఫైల్)

నల్లగొండ రూరల్: తల్లి అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమైనా.. తన కండ్ల ముందు ఉంటే చాలనుకున్న కొడుకు పదేండ్లుగా సేవలు చేస్తున్నాడు. 15 రోజులుగా ఆమె ఆరోగ్యం మరింత క్షీణిస్తుండగా బతికించుకునేందుకు ఆ కొడుకు హైదరాబాద్‌లోని దవాఖానలన్నీ తిరిగాడు. చివరకు తల్లి బతకదని డాక్టర్లు తేల్చి చెప్పడంతో తీవ్ర మనస్తాపానికి గురై.. తల్లిలేని లోకంలో తాను ఉండలేనంటూ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కొడుకు మరణవార్త విని తట్టుకోలేని తల్లి కూడా గంటల వ్యవధిలోనే తనువు చాలించింది. విషాద ఘటన నల్లగొండ జిల్లా అప్పాజీపేట గ్రామంలో శనివారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అప్పాజీపేటకు చెందిన దివ్యాంగురాలైన మర్రి భానుమతి (65)కి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త చంద్రయ్య 20 ఏండ్ల క్రితం మృతి చెందడంతో కూలిపనులు చేస్తూ పిల్లలిద్దరిని పెంచి పెద్ద చేసింది. పదేండ్లక్రితం ఆమె అనారోగ్యానికి గురవడంతో కాళ్లు చేతులు చచ్చుపడిపోయి మంచానికే పరిమితమైంది. దీంతో కుమారుడు ప్రకాశ్(32)కుటుంబబాధ్యతలు భుజాన వేసుకున్నాడు. మేస్త్రీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తూనే.. అక్కపెండ్లి కూడా చేశాడు. తల్లికి నయం చేయించుకోవాలని దవాఖానల చుట్టూ తిరిగినా.. ప్రయోజనం లేకపోవడంతో అప్పటినుంచి తల్లికి సపర్యలు చేస్తున్నాడు. 15 రోజుల క్రితం భానుమతి ఆరోగ్యం విషమించడంతో హైదరాబాద్‌లోని పలుదవాఖానల్లో వైద్యం చేయించాడు. అయినా ఆరోగ్యం కుదుట పడకపోగా.. ఇక ఆమె బతకదని.. ఇంటికి తీసుకెళ్లాలని వైద్యులు చెప్పడంతో గురువారం రాత్రి ఇంటికి తీసుకొచ్చాడు. తన తల్లి ఎక్కువ రోజులు బతకదని.. తల్లిలేకుండా తాను ఎలా బతకాలం టూ ఇంటికి వచ్చిన బంధువుల వద్ద ఆవేదన వ్యక్తం చేశాడు. బయట తనకు డబ్బు లు రావాల్సి ఉన్నదని వాటిని తీసుకొస్తానని తన అక్కకు చెప్పి శనివారం ఉదయం నార్కట్‌పల్లి మండలం శేరుబావి గూడానికి వెళ్లి అక్కడ రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

కొడుకు మరణవార్త విని తల్లి మృతి..

రైలు కింద పడి మృతి చెందిన వ్యక్తి జేబులో ల భించిన ఆధార్‌కార్డు ఆధారంగా అతడిని ప్రకాశ్‌గా గుర్తించిన పోలీసులు కుటుంబ స భ్యులకు విషయం తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న తల్లి భానుమతి రోదిస్తూ సొమ్మసిల్లింది. బంధువులు ఆమెను వెంటనే స్థానిక దవాఖానకు తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్టు నిర్ధారించారు. ఒకే కుటుంబానికి చెందిన తల్లీకొడుకు మృతి చెందడంతో గ్రామంలో విషాదం అలుముకున్నది.

తల్లీ కొడుకుల మృతి బాధాకరం: గంగల అంజయ్య, అప్పాజీపేట

గ్రామానికి చెందిన మర్రి భానుమతి, అతని కుమారుడు ప్రకాశ్ ఒకేరోజు మృతి చెందడం బాధాకరం. పదేండ్లుగా మంచానికే పరిమితమైన తల్లికి సేవలు చేస్తూ తన వివాహాన్ని సైతం వాయిదా వేసుకున్నాడు. ఈ ఘటన గ్రామంలో ప్రతి ఒక్కరిని కంటతడి పెట్టించింది.



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో టీఆర్‌ఎస్‌లో చేరినవారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



టీఆర్‌ఎస్‌లో చేరిన జోగుళాంబ గద్వాల జిల్లా బొంకూరు కాంగ్రెస్ కార్యకర్తలతో అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం

టీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు

నెట్‌వర్క్ నమస్తే తెలంగాణ: టీఆర్‌ఎస్‌లోకి చేరికలు కొనసాగుతున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం బోడగుట్ట తండా, కుత్నేపల్లి గ్రామానికి చెందిన 30 మంది ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో, సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో వివిధ గ్రామాలకు చెందిన 240 మంది ఎమ్మెల్యే గాదరి కిశోర్ సమక్షంలో, నడిగూడెం మండలం వెంకట్రామపురానికి చెందిన 100 మంది కాంగ్రెస్, టీడీపీ, సీపీఎం కార్యకర్తలు ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ సమక్షంలో, జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం బొంకూరు గ్రామానికి చెందిన 40 మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే అబ్రహం సమక్షంలో పార్టీలో చేరారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 50 మంది కాంగ్రెస్, టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య సమక్షంలో, మేడ్చల్ జిల్లా గౌతంనగర్‌లో వివిధపార్టీలకు చెందిన 50 మంది మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు సమక్షంలో, రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన 50 మంది కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సమక్షంలో, మాడ్గుల మండలంలోని పలుగ్రామాలకు చెందిన 100 మంది ఎంపీపీ బాల్‌రాజ్ సమక్షంలో, నందిగామ మండల కేంద్రానికి చెందిన 100 మంది షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.

అలీసాగర్ నీటి విడుదల

రెంజల్ (నవీపేట): యాసంగి సాగుకోసం నిజామాబాద్ జిల్లాలోని అలీసాగర్ ప్రధాన కాలువ ద్వారా నీటిని ఇరిగేషన్ డీఈ వెంకటరమణారావు శనివారం సాయంత్రం విడుదల చేశారు. నవీపేట మండలం కోస్లీ గ్రామ శివారులో స్టేజ్ -1 పంప్‌హౌస్ నుంచి రెండు మోటర్ల సహాయంతో విడుదల చేసే స్టార్టర్లను స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా డీఈ వెంకటరమణారావు మాట్లాడుతూ... రెండు మోటర్ల సహాయంతో 360 క్యూసెక్కుల నీటిని రెంజల్, నవీపేట, ఎడపల్లి మండలం పోచారం ఇతర గ్రామాలకు చెందిన రైతులకు చెరువుల కింద సాగుచేసే పంటలకు మాత్రమే విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అలీసాగర్ కాలువ ద్వారా విడుదలైన నీటితో సుమారు 55 చెరువులను నింపుతామని తెలిపారు.

జనశక్తి నక్సలైట్ అరెస్ట్
పిస్టల్, 19 రౌండ్ల తూటాలు స్వాధీనం

జగిత్యాలక్రైం: జనశక్తి గ్రూపు సభ్యుడిని జగిత్యాల పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. అదనపు ఎస్పీ మురళీధర్ వెల్లడించిన వివరాల ప్రకారం.. మల్యాల సీఐ ఆధ్వర్యంలో మల్యాల, కొడిమ్యాల పోలీసులు కొడిమ్యాల మండలం పూడూర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా 0.23 ఎంఎం పిస్టల్, 19 రౌండ్ల బుల్లెట్లు, రెండు సెల్ ఫోన్లు లభించాయి. విచారించగా జనశక్తి గ్రూపులో పనిచేస్తున్న వావిలాస సాయికుమార్ అలియాస్ భరత్, అలియాస్ మహేశ్‌గా వెల్లడైంది.



ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మెజార్టీ పంచాయతీలు గెలుద్దాం
మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపు

సత్తుపల్లి, నమస్తే తెలంగాణ: ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో మెజార్టీ పంచాయతీలను గెలుచుకుందామని మాజీమంత్రి తుమ్మల నాగేశ్వరరావు నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలకేంద్రంలోని సిద్దారం రోడ్‌లోగల లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో జరిగిన నియోజకవరగ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పార్టీ కోసం పనిచేస్తే పదవులు వాటంతట అవే వస్తాయన్నారు. ఖమ్మం జిల్లాను రాష్ట్రంలోనే నంబర్‌వన్ స్థానానికి తీసుకెళ్లాలని సూచించారు.



శనివారం హైదరాబాద్‌లో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రేమజంట

కులాంతర వివాహం చేసుకొన్న జంటకు బాసట
నూతన దంపతులను కలిపిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రేమ వివాహం చేసుకొన్న ఓ జంటకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అండగా నిలిచారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం మారుపాకకు చెందిన శ్రీనివాస్, యశస్విని గత ఏడాది జూలై 28న కులాంతర వివాహం చేసుకున్నారు. అనంతరం యువతిని ఆమె తల్లిదండ్రులు బలవంతంగా తీసుకెళ్లారు. తన భార్యను అప్పగించేలా చూడాలని శ్రీనివాస్.. ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్లను ఆశ్రయించారు. స్పందించిన ఆయన పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడి యువతి తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇప్పించడంతో దంపతులు కలిసి ఉండేందుకు వారు అంగీకరించారు. తమకు న్యాయంచేసిన ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను శనివారం ఆయన కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



వనపర్తి శివారులోని నల్ల చెరువు (మినీ ట్యాంక్‌బండ్)లోకి వస్తున్న కృష్ణా జలాలను శనివారం ఎమ్మెల్యే సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పరిశీలించారు. ఈ చెరువును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. - వనపర్తి అర్బన్

నమస్తే తెలంగాణ కళ్యాణమస్తు






...మీ జీవిత భాగస్వామి ఎంపికలో ఆత్మీయ బంధువు



కళ్యాణ వేదికలు



వధువు కావలెను



వరుడు కావలెను

గమనిక: "కళ్యాణమస్తు" ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటన దారులకు సంబంధించిన హామీలకు పత్రిక బాధ్యత వహించదు. ప్రకటనల అన్ని విషయాలలో వధూ వరులు, పెండ్లి పెద్దలే నిర్ణయాలు తీసుకోవాలి. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

కళ్యాణమస్తు

8-2-603/1/7, 8, 9, Krishnapuram, Road. No.10 Banjara Hills, Hyderabad - 500034.

80966 77819

వాణిజ్య

నమస్తే తెలంగాణ WWW.NTNEWS.COM

ఆదివారం 6 జనవరి 2019

మళ్లీ బ్యాంకు ఉద్యోగుల సమ్మె

8 - 9 తేదీల్లో విధులకు దూరం ▪ కార్మిక సంఘాల సమ్మెకు మద్దతు పలికిన బ్యాంకింగ్ సిబ్బంది



న్యూఢిల్లీ, జనవరి 5: ప్రభుత్వరంగ బ్యాంకు ఉద్యోగులు మరోసారి సమ్మెబాట పట్టారు. ఉద్యోగులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరునకు నిరసనగా ఈ నెల 8 నుంచి 9 వరకు రెండు రోజుల పాటు సమ్మె చేయనున్నట్లు బ్యాంకింగ్ యూనియన్లు ప్రకటించాయి. ఈ విషయాన్ని ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్(ఐబీఏ)కు ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏఐబీఈఏ), బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలు తెలియజేశాయని ఐడీబీఐ బ్యాంక్ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. ఏఐబీఈఏ, బీఈఎఫ్‌ఐ ఉద్యోగ సంఘాలు చేస్తున్న ఈ సమ్మెతో బ్యాంకింగ్ కార్యకలాపాలపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపనున్నాయని బ్యాంక్ ఆఫ్ బరోడా ఒక ప్రకటనలో వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పది సెంట్రల్ ట్రేడ్ యూనియన్లైన ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్‌ఎంఎస్, సీఐటీయూ, ఏఐయూటీయూసీ, టీయూసీసీ, ఎల్‌పీఎఫ్, ఎస్ఈడబ్ల్యూఏ వంటి కార్మిక సంఘాలు ఈ నెల 8 నుంచి 9 వరకు రెండు రోజుల పాటు దేశవ్యాప్తంగా సమ్మె చేస్తున్నాయి. వీటికి మద్దతు పలికాయి బ్యాంకింగ్ రంగ ఉద్యోగ సంఘాలు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కార్ అధికారంలోకి రాకముందు నుంచి ఉన్న 12 డిమాండ్లను ఇప్పటి వరకు పరిష్కరించలేదని, దీంతో సమ్మె చేయాలని కార్మిక సంఘాలు నిర్ణయించాయి. మూడు ప్రభుత్వరంగ బ్యాంకుల విలీనానికి వ్యతిరేకంగా డిసెంబర్ 26న తొమ్మిది బ్యాంకింగ్ యూనియన్లు సమ్మె చేసిన విషయం తెలిసిందే.

ఆర్థిక ఇబ్బందుల్లో హెచ్‌ఏఎల్

సిబ్బంది వేతనాల కోసం రూ.1,000 కోట్లు అప్పు చేసిన సంస్థ



బెంగళూరు, జనవరి 5: తీవ్రవాదుల గుండెలను చీల్చుకుంటూ పోయే రాకెట్లను తయారు చేసే సంస్థ అది. దేశ భద్రతకు వెన్నెముకలాంటి పరికరాలను తయారుచేసే ఇప్పుడు సంస్థకు ప్రస్తుతం రోజుగడవని పరిస్థితి దాపురించిందా అంటే నిజమేననిపిస్తున్నది. అదే ప్రభుత్వరంగ రక్షణ పరికరాల తయారీ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్‌ఏఎల్). కంపెనీ చరిత్రలో తొలిసారిగా ఉద్యోగుల వేతనాలను చెల్లించడానికి అప్పు చేసింది. ప్రస్తుతం సంస్థ వద్ద మిగులు నిధులు నిండుకోవడంతో వేతనాలను చెల్లించడానికి గతంలోనే రూ.1,000 కోట్ల నిధులను రుణంగా తీసుకున్నది. దశల వారీగా వీటిని తిరిగి చెల్లింపులు జరుపుతున్నది. ప్రస్తుతం సంస్థలో 29,035 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వీరికి వేతనాల రూపంలో నెలకు రూ.358 కోట్లు చెల్లిస్తున్నారు. వీటితోపాటు ఇతర నిర్వహణ ఖర్చులు కలుపుకొని నెలకు సుమారుగా రూ.1,400 కోట్లు అవసరం. ఈ సందర్భంగా హెచ్‌ఏఎల్ ఛైర్మన్ ఆర్ మాధవన్ మాట్లాడుతూ..చేతిలో లిక్విడిటీ లేకపోవడంతో ఓవర్‌డ్రాఫ్ట్ ద్వారా రూ.1,000 కోట్ల వరకు అప్పుగా తీసుకున్నట్లు చెప్పారు. మార్చి 31 నాటికి కంపెనీ రూ.6 వేల కోట్ల లోటు ఉండనున్నదని, ఇది భరించలేని స్థాయి అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టులను నిర్వహించాలంటే రోజు రోజుకు అప్పు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. సంస్థకు ఉన్న అతిపెద్ద కస్టమర్ అయిన భారత వైమానిక దళం(ఐఏఎఫ్) రెండేండ్ల నుంచి ఎలాంటి చెల్లింపులు జరపకపోవడం ఇందుకు కారణమని చెప్పారు. గడిచిన రెండు-మూడు దశాబ్దాలుగా మిగులు నగదు నిల్వలు కలిగివున్న సంస్థ తొలిసారిగా రుణం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. సెప్టెంబర్ 2017 నుంచి ఐఏఎఫ్ ఎలాంటి బకాయిలు చెల్లించలేదు. అక్టోబర్ నాటికి రూ.10 వేల కోట్లుగా ఉన్న బకాయి.. డిసెంబర్ 31 నాటికి రూ.15,700 కోట్లకు చేరుకోగా, వచ్చే మార్చి నాటికి రూ.20 వేల కోట్లు దాటనున్నదని అంచనా. 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.13,700 కోట్ల బడ్జెట్‌కు రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం తెలుపగా.. పెండింగ్‌లోని చెల్లింపులు కలుపుకొని ఆ మరుసటి ఏడాదిలో దీనిని రూ.33,715 కోట్లకు పెంచారు కానీ, వీటిలో వచ్చింది రూ.20,287 కోట్లు మాత్రమే. మిగతా రూ.15 వేల కోట్లకుపైగా చెల్లింపులు జరుపాల్సి ఉన్నది. వీటిలో ఐఏఎఫ్ రూ.14,500 కోట్లు చెల్లించాల్సి ఉండగా, మిగతావి దేశీయ భద్రతా దళాలు, నౌకాదళం, కోస్ట్‌గార్డ్‌ల నుంచి రావాల్సి ఉన్నాయి. సెప్టెంబర్ 2017 నుంచి ఇప్పటి వరకు ఐఏఎఫ్ కేవలం రూ.2 వేల కోట్లు చెల్లించగా, బకాయి రూ.14,500 కోట్లుగా ఉన్నాయి. 2003-04 నుంచి 2017-18 మధ్యకాలంలో కంపెనీ ఎప్పుడు ఇంత తక్కువ బ్యాలెన్స్ షీట్‌ను కలిగివుండలేదు. 2003-04లో రూ.4,841 కోట్ల నిధులు కలిగివున్న సంస్థ.. గడిచిన ఆర్థిక సంవత్సరానికి రూ.6,524 కోట్లకు పెంచుకున్నది. కానీ సెప్టెంబర్ 30 నాటికి రూ.1,000 కోట్లకు తగ్గింది. నెల నెలా గడుస్తున్న కొద్దీ ఇబ్బందులు పెరుగుతున్నాయి తప్పా తరగడం లేదని, సంస్థ వద్ద ఉన్న ఆర్డర్ల కోసం సామాగ్రిని కొనుగోలు చేయలేకపోతున్నామని మాధవన్ ఆవేదన వ్యక్తంచేశారు. ప్రస్తుతం సంస్థ వద్ద రూ.61,700 కోట్ల ఆర్డర్లు ఉన్నాయి.

భద్రతా దళాల బకాయిలు రూ.15,700 కోట్లు

సంస్థలో 29,035 మంది సిబ్బంది

2017-18లో రూ.18,284 కోట్ల టర్నోవర్

పరారీ ఆర్థిక నేరగాడే



విజయ్ మాల్యాపై పీఎంఎల్‌ఏ ప్రత్యేక కోర్టు ప్రకటన

ఎఫ్‌ఈవో చట్టం కింద మోసగాడి ముద్రపడటం ఇదే తొలిసారి

ముంబై, జనవరి 5: పరారీ ఆర్థిక నేరగాళ్ల (ఎఫ్‌ఈవో) చట్టం కింద శనివారం విజయ్ మాల్యాను పారిపోయిన ఆర్థిక నేరగాడిగా ప్రకటించింది ముంబైలోని మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) ప్రత్యేక కోర్టు. గతేడాది ఆగస్టులో ఈ చట్టం అమల్లోకి వచ్చిన దగ్గర్నుంచి ఈ ముద్రపడిన తొలి వ్యక్తిగా, వ్యాపారిగా మాల్యా రికార్డులకెక్కడం గమనార్హం. తాజా ప్రకటనతో ఇక ఈ లిక్కర్ వ్యాపారి ఆస్తులను ప్రభుత్వం జప్తు చేసుకోవచ్చు. బ్యాంకులకు రూ.9,000 కోట్లకుపైగా ఎగవేసి 2016 మార్చి 2న మాల్యా దేశం విడిచి లండన్‌కు పారిపోయిన విషయం తెలిసిందే. ఈ కేసును విచారిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ).. మాల్యాను పరారీ ఆర్థిక నేరగాడిగా ప్రకటించాలని పీఎంఎల్‌ఏ కోర్టును అభ్యర్థించింది. దాదాపు రూ.12,500 కోట్ల ఆస్తులను తక్షణమే జప్తు చేసేందుకూ అనుమతినివ్వాలని కోరింది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి ఎంఎస్ అజ్మీ పరారీ ఆర్థిక నేరగాడి ముద్ర వేశారు. వచ్చే నెల 5 నుంచి ఆస్తుల జప్తుపై ఈడీ దాఖలు చేసిన పిటీషన్‌ను విచారిస్తామని ప్రకటించారు. నిరుడు జూలైలో దాఖలైన ఈడీ పిటీషన్‌పై స్టే విధించాలని మాల్యా కోర్టును కోరినప్పటికీ.. అక్టోబర్ 30న తోసిపుచ్చింది. అనంతరం మాల్యా బాంబే హైకోర్టునూ ఆశ్రయించగా, నవంబర్ 22న ఈ అప్పీల్‌ను కొట్టేసింది. కాగా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణం ప్రధాన నిందితులు నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీలను పరారీ ఆర్థిక నేరగాళ్లుగా ప్రకటించాలని ఈడీ దాఖలు చేసిన పిటీషన్లనూ ఈ పీఎంఎల్‌ఏ కోర్టే విచారిస్తున్నది. రూ.100 కోట్లు అంతకుమించి ఆర్థిక మోసాలకు పాల్పడి నేర విచారణను తప్పించుకునేందుకు దేశం విడిచి పారిపోయి, తిరిగి వచ్చేందుకు విముఖత చూపేవారిపై అరెస్టు వారెంట్ జారీ అయితే ఎఫ్‌ఈవో చట్టం కింద పరారీ ఆర్థిక నేరగాడిగా ప్రకటించవచ్చు.

మాల్యా న్యాయవాదుల విఫల యత్నం

మాల్యా తరపు న్యాయవాదులు నాలుగు వారాలపాటు తీర్పును నిలిపి ఉంచాలని వేడుకున్నా.. న్యాయమూర్తి పట్టించుకోలేదు. మాల్యాను భారత్‌కు రప్పించాలని అన్ని రకాలుగా ప్రయత్నించి విఫలమయ్యామన్న ఈడీ తరపు న్యాయవాది వాదనతోనే ఏకీభవించారు. మాల్యా అప్పగింతకు లండన్ కోర్టు ఆమోదం తెలిపిన నేపథ్యంలో భారత్‌కు వచ్చేందుకు మాల్యా సుముఖంగానే ఉన్నారని, అందుకు లండన్ కోర్టు తీర్పే నిదర్శనమని మాల్యా తరపు న్యాయవాదులు వాదించారు. అయితే దీన్ని తిప్పికొట్టిన ఈడీ న్యాయవాది డీఎన్ సింగ్.. లండన్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ మాల్యా పైకోర్టులకు వెళ్తున్నారని గుర్తుచేశారు. కాబట్టి ఆయన్ను పరారీ ఆర్థిక నేరగాడిగా ప్రకటించాల్సిందేనని వాదించారు. చివరకు మాల్యా దేశం విడిచి పారిపోలేదని, ఎఫ్1 టీం (ఫోర్స్ ఇండియా) డైరెక్టర్‌గా ప్రపంచ మోటార్ స్పోర్ట్స్ సమావేశానికి హాజరయ్యేందుకే వెళ్లారని మల్యా తరపు న్యాయవాదులు వాదించినా ఫలితం లేకపోయింది. గత నెల డిసెంబర్ 10న మాల్యాను భారత్‌కు అప్పగించాలంటూ లండన్ కోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. బకాయిల్లో అసలు రుణాలను చెల్లిస్తానంటూ మాల్యా చేస్తున్న ఆఫర్లను బ్యాంకులు తిరస్కరిస్తున్న సంగతీ విదితమే.

విలీనమైన మూడు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు

న్యూఢిల్లీ, జనవరి 5: ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు (ఆర్ఆర్‌బీ)లైన పంజాబ్ గ్రామీణ బ్యాంక్, మాల్వా గ్రామీణ బ్యాంక్, సట్లేజ్ గ్రామీణ బ్యాంకులు విలీనమైనట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల 1 నుంచే ఈ విలీనం అమలులోకి వచ్చింది. ఈ మూడు బ్యాంకులకు స్పాన్సర్లుగా ఉన్న జాతీయ బ్యాంకులు, కేంద్ర ప్రభుత్వం కలిసి పలు దఫాలుగా చర్చించిన తర్వాతనే విలీనం జరిగింది. దీంతో ఈ ఆర్ఆర్‌బీలు ఒక్కటయ్యాయి. వీటికి పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వంతోపాటు నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్), పంజాబ్ నేషనల్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకులు స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నాయి.

PGB
Punjab Gramin Bank

అది కుంభకోణమే కాదు!

పీఎన్‌బీని నేను మోసం చేయలేదు ▪ బ్యాంకుతో సాధారణ లావాదేవీలే జరిపాను

పీఎంఎల్‌ఏ కోర్టుకు నీరవ్ మోదీ సమాధానం



ముంబై, జనవరి 5: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)ను తాను మోసం చేయలేదని, ఓ ఖాతాదారుడిగా ఆ బ్యాంకుతో సాధారణ లావాదేవీలనే జరిపానని నీరవ్ మోదీ అన్నాడు. భారతీయ బ్యాంకింగ్ రంగ చరిత్రలోనే అతి పెద్ద కుంభకోణంగా పీఎన్‌బీ మోసాన్ని అటు ప్రభుత్వం, ఇటు ఆర్థిక నిపుణులు అభివర్ణిస్తున్న విషయం తెలిసిందే. అయినప్పటికీ ఈ వజ్రాల వ్యాపారి మాత్రం అది అసలు కుంభకోణమే కాదంటున్నాడు. దాదాపు రూ.14,000 కోట్ల ఈ మోసం కేసును విచారిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ).. నీరవ్ మోదీని 'పరారీ ఆర్థిక నేరగాడి'గా ప్రకటించాలని ఇక్కడి మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) ప్రత్యేక కోర్టును కోరుతున్నది. దీంతో సదరు కోర్టుకు శనివారం తన తరపు న్యాయవాది సమర్పించిన సమాధానంలో నీరవ్ పైవిధంగా స్పందించాడు. ఈడీ అభ్యర్థనను ఖండించాడు. తాను ఏ తప్పూ చేయలేదన్న నీరవ్.. సాధారణ బ్యాంకింగ్ లావాదేవీలను నేరపూరిత మోసంగా చిత్రీకరించారనడం విశేషం. బ్యాంకర్ల చేతకానితనం వల్లే ఇదంతా జరిగిందని, పీఎన్‌బీ తప్పులను కప్పిపుచ్చే ప్రయత్నం జరుగుతున్నదనడం గమనార్హం. పసలేని వాదనలతో తనను కావాలనే ఈడీ చిక్కుల్లోకి నెడుతున్నదని ఆరోపించాడు. రాజకీయ ప్రయోజనాల కోసం తన కేసును వాడుకుంటున్నారన్నాడు. మరోవైపు ఈడీ మాత్రం తమ సమన్లకు నీరవ్ స్పందించడం లేదని కోర్టుకు తెలియజేసింది.

భారత్‌కు రానే రాను..

భద్రతా కారణాల దృష్ట్యా తాను భారత్‌కు రాలేనని నీరవ్ మోదీ మరోసారి స్పష్టం చేశాడు. ఈ స్కాంలో మరో కీలక నిందితుడైన నీరవ్ మోదీ మేనమామ, రత్నాల వర్తకుడు మెహుల్ చోక్సీ సైతం భద్రతా కారణాలతోపాటు అనారోగ్య కారణాలను చూపుతూ స్వదేశం రాలేనంటున్న విషయం తెలిసిందే. గతేడాది జనవరిలోనే వీరిరువురు కుటుంబ సభ్యులతో సహా దేశం విడిచి పారిపోగా, సీబీఐతోపాటు వివిధ దర్యాప్తు సంస్థలు, కోర్టులు భారత్‌కు తిరిగి రావాలని పదేపదే సమన్లు జారీ చేస్తున్నా చలించడం లేదు. నీరవ్ లండన్‌లో ఉండగా, చోక్సీ కరేబియన్ దేశంలో ఉన్నాడు. వీరి అప్పగింతకు కేంద్ర ప్రభుత్వం సైతం ఆయా దేశాలతో సంప్రదింపులు జరుపుతుండగా, పట్టుకునేందుకు ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసులనూ జారీ చేసిన సంగతి విదితమే. నకిలీ లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్స్ (ఎల్‌వోయూ), లెటర్ ఆఫ్ కంఫర్ట్ (ఎల్‌వోసీ)లతో ముంబైలోని పీఎన్‌బీ బ్రాడీహౌజ్ శాఖ కేంద్రంగా ఏండ్ల తరబడి జరిగిన ఈ మోసంలో నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీలకు చెందిన సంస్థలు వేల కోట్ల మోసానికి తెగబడ్డాయి.

డిసెంబర్ జీతాలూ హుళక్కేనా?

ఉద్యోగులను వేధిస్తున్న జెట్ ఎయిర్‌వేస్ ఆర్థిక సంక్షోభం

ముంబై, జనవరి 5: నిధులు లేక సతమతమవుతున్న ప్రైవేట్ రంగ విమానయాన సంస్థ జెట్ ఎయిర్‌వేస్ మరోసారి ఉద్యోగులకు వేతన చెల్లింపుల్లో విఫలమైంది. ఇప్పటికే సీనియర్ మేనేజ్‌మెంట్ ఉన్నతాధికారులు, పైలెట్లు, ఇంజినీర్లకు సకాలంలో జీతాలు ఇవ్వలేకపోతున్న సంస్థ.. డిసెంబర్ నెలకుగాను ఇతర సిబ్బందికీ ఇంకా ఇవ్వలేదు. ఈ మేరకు పీటీఐకి సంబంధిత వర్గాలు తెలిపాయి. నరేశ్ గోయల్‌కు చెందిన జెట్ ఎయిర్‌వేస్‌లో గతేడాది ఆగస్టు నుంచి నగదు కొరత కారణంగా ఉన్నతస్థాయి సిబ్బందికి సకాలంలో జీతభత్యాలు అందడం లేదన్న విషయం తెలిసిందే. సంస్థలో 16 వేల మందికిపైగా ఉద్యోగులున్నారు.



గోద్రేజ్ గ్రూపు చైర్మన్ ఆదీ గోద్రేజ్, హెచ్‌డీఎఫ్‌సీ గ్రూప్ నాన్-ఎగ్జిక్యూటివ్ చైర్మన్ దీపక్ పరేఖ్‌లకు 'జేవియర్స్ రత్నా' అవార్డులను అందచేస్తున్న మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు

స్టెర్లింగ్ బయోటెక్ డైరెక్టర్లపై ఓపెన్-ఎండెడ్ నాన్ బెయిలబుల్ వారెంట్లు

▪ ఈడీ అభ్యర్థనతో జారీ చేసిన ఢిల్లీ కోర్టు

న్యూఢిల్లీ, జనవరి 5: స్టెర్లింగ్ బయోటెక్ లిమిటెడ్ (ఎస్‌బీఎల్) యజమానులపై ఢిల్లీ కోర్టు శనివారం ఓపెన్-ఎండెడ్ నాన్ బెయిలబుల్ వారెంట్ల (ఎన్‌బీడబ్ల్యూ)ను జారీ చేసింది. రూ.8,100 కోట్ల మనీ లాండరింగ్ విచారణ కేసులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అభ్యర్థన మేరకు ఎస్‌బీఎల్ డైరెక్టర్లు నితిన్ జయంతీలాల్ సందేసరా, చేతన్‌కుమార్ జయంతీలాల్ సందేసరా, దీప్తీ చేతన్ సందేసరా, హితేశ్‌కుమార్ నరేంద్రభాయ్ పటేల్‌లకు ఇక్కడి అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి సతీశ్ కుమార్ అరోరా ఈ ఎన్‌బీడబ్ల్యూలను జారీ చేశారు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) సెక్షన్ల కింద గుజరాత్‌కు చెందిన ఎస్‌బీఎల్‌పై బ్యాంక్ మోసం ఆరోపణలకుగాను ఈడీ కేసును నమోదు చేసింది. ఎస్‌బీఎల్ డైరెక్టర్లు ఆదాయం పన్ను (ఐటీ) శాఖ సీనియర్ అధికారులకు లంచం ఇవ్వజూపారన్న ఆరోపణలపైనా ఈడీ దర్యాప్తు చేస్తున్నది. కాగా, ఎస్‌బీఎల్ డైరెక్టర్లకు వ్యతిరేకంగా రెడ్ కార్నర్ నోటీసులను జారీ చేయాలంటూ ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించామని గత నెల డిసెంబర్ 24న ఈడీ ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ నితేశ్ రాణా కోర్టుకు తెలిపారు. రెడ్ కార్నర్ నోటీసుల జారీకీ కోర్టు నుంచి ఓపెన్ ఎండెడ్ ఎన్‌బీడబ్ల్యూల అవసరం ఉందని చెప్పారు. నేర విచారణ నుంచి తప్పించుకునేందుకు వీరంతా కూడా అనుమానిత పరిస్థితుల్లో దేశం విడిచి పారిపోయారని ఈడీ కోర్టుకు చెప్పింది. ఇప్పటికే వీరిపై ఎన్‌బీడబ్ల్యూలు జారీ అవగా, వ్యాపార సంబంధాల దృష్ట్యా నైజీరియా, అమెరికా లేదా యూఏఈల్లో వీరున్నారన్న అనుమానాలను వ్యక్తం చేసింది. ఇక ఈ కేసులో నిందితుల ఆస్తులనూ ఈడీ జప్తు చేస్తున్న విషయం తెలిసిందే.

నమస్తే తెలంగాణ
ఆట
11
[కరీంనగర్]
ఆదివారం 6 జనవరి 2019
WWW.NTNEWS.COM



ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్‌లీగ్ విజయవంతం

క్రీడల్లోనే కాదు అన్నిరంగాల్లో రాణిస్తున్న గురుకుల విద్యార్థులు • రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ



శేరిలింగంపల్లి: దేశ విదేశాల్లో గురుకుల విద్యార్థులు అద్భుతంగా పురోగమిస్తూ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. హైదరాబాద్, గచ్చిబౌలిలోని బాలయోగి స్టేడియంలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాలల వార్షిక క్రీడోత్సవం ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్ ముగింపు వేడుకలకు శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడోత్సవాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. రాష్ట్రంలోని రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, బీసీ సంక్షేమ, మైనారిటీ సంక్షేమ గురుకుల పాఠశాలలకు చెందిన 4500 మంది విద్యార్థులు ఈ టోర్నీలో పాల్గొన్నారు. 11 క్రీడాంశాల్లో పోటీలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ చైర్మన్ ఎకే ఖాన్, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి ప్రవీణ్ కుమార్, క్రీడల, యువజన సర్వీసుల కార్యదర్శి బుర్రా వెంకటేశం, సాట్స్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముగింపు వేడుకల్లో భాగంగా నాగర్‌కర్నూల్, కల్వకుర్తి మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ అధ్వర్యంలో 136 మంది విద్యార్థులు 29 రాష్ట్రాలకు చెందిన సంప్రదాయ నృత్యాలు నిర్వహించారు. ఈ మేరకు ఈ ప్రదర్శనకు వండర్ బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు దక్కిందని వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ దక్షిణాసియా కో ఆర్డినేటర్ స్వర్ణశ్రీ తెలిపారు.

భళా.. బెంగళూరు

- ప్రొ కబడ్డీ లీగ్ టైటిల్ సొంతం
- పవన్ సూపర్ రైడింగ్



ట్రోఫీతో బెంగళూరు బుల్స్ కెప్టెన్ రోహిత్ కుమార్

ముంబై: రైడింగ్‌లో దుమ్మురేపిన బెంగళూరు బుల్స్.. ఆరో అంచె ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) టైటిల్‌ను గెలుచుకుంది. శనివారం జరిగిన హోరాహోరీ ఫైనల్లో బెంగళూరు 38-33తో నిరుటి రన్నరప్ గుజరాత్ ఫార్చ్యూన్‌జెయింట్స్‌పై చిరస్మరణీయ విజయాన్ని సొంతం చేసుకుంది. బుల్స్ స్టార్ రైడర్ పవన్ షెరావత్ 25 రైడింగ్స్‌లో 22 పాయింట్లు రాబట్టి అద్భుతం చేశాడు. సుమిత్ సింగ్ (3), ఆశిష్ సంగ్వాన్ (2), మహేందర్ (2) ఫర్వాలేదనిపించారు. గుజరాత్ తరఫున సచిన్ 10, ప్రపంజన్ 5, సునీల్ 4, పర్వేష్ 2 పాయింట్లు సాధించినా ప్రయోజనం లేకపోయింది. ఆరంభంలో దూకుడుగా ఆడిన గుజరాత్ తొలి అర్ధభాగానికి 16-9తో ఆధిక్యంలో నిలిచింది. కానీ రెండో అర్ధభాగంలో ఊహించని రీతిలో చెలరేగిన పవన్ ఒంటిచేత్తో ప్రత్యర్థి డిఫెన్స్‌ను తుత్తునీయలు చేశాడు. ఫలితంగా రెండుసార్లు గుజరాత్‌ను ఆలౌట్ చేసి పాయింట్ల వరద పారించాడు. మ్యాచ్ ప్రారంభంలో ఇరుజట్ల రైడర్లు మెరుగ్గా రాణించడంతో చాలాసేపు స్కోరు 4-4, 7-7తో సమమైంది. కానీ 10వ నిమిషం నుంచి వ్యూహం మార్చిన గుజరాత్.. రైడింగ్, ట్యాక్లింగ్‌లో చెలరేగుతూ బెంగళూరును ఓసారి ఆలౌట్ చేసింది. ఫలితంగా 16-9 ఆధిక్యంలోకి వెళ్లింది. ఎండ్‌లు మారిన తర్వాత బెంగళూరు డిఫెన్స్‌లో పదును చూపెట్టింది. దీంతో స్కోరు 17-21గా మారింది. ఈ దశలో షెరావత్.. రెండు రైడింగ్స్‌లో ఆరు పాయింట్లు తీసుకురావడంతో బుల్స్ 23-22 ఆధిక్యంలోకి వెళ్లింది. ఆట మరో 9 నిమిషాల్లో ముగుస్తుందనగా ఇరుజట్ల స్కోరు 29-29తో సమమైనా.. మళ్లీ పవన్ తన విశ్వరూపం చూపెట్టాడు. అద్భుతమైన రైడింగ్‌తో రెండు పాయింట్లు సాధించి 31-29 స్కోరును అందించాడు. ఫైనల్ విజిల్‌కు రెండు నిమిషాల ముందు కూడా రైడింగ్‌కు వెళ్లిన పవన్ మైదానంలో ఉన్న ఇద్దరిని ఔట్ చేయడంతో గుజరాత్ మరోసారి ఆలౌటైంది. విజేతగా నిలిచిన బెంగళూరుకు రూ. 3 కోట్లు, గుజరాత్‌కు రూ. 1లక్షా 80 వేల ప్రైజ్‌మనీ లభించింది. ఏడో అంచె పీకేఎల్ జూలైలో మొదలుకానుంది.

తిప్పేశారు!

జడేజా, కుల్దీప్ స్పిన్ మ్యాజిక్ • ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 236/6

వెలుతురులేమితో ఆటకు అంతరాయం

ఊహకందని అద్భుతం జరిగితే తప్ప.. ఆసీస్ గడ్డపై తొలిసారి టెస్ట్ సిరీస్‌ను గెలిచేందుకు భారత్‌కు సమయం ఆసన్నమైంది. నాలుగో టెస్ట్‌లోనూ పరుగులతో కోట కట్టిన భారత్.. బౌలింగ్‌తోనూ కంగారూలను వేటాడేసింది. మూడోరోజు కుల్దీప్ (3/71) మణికట్టు మాయాజాలానికి తోడు జడేజా (2/62) కూడా మెరువడంతో ఎదురీత మొదలుపెట్టిన ఆసీస్‌ను ఆఖర్లో వర్షం ఆదుకుంది. లేదంటే పరిస్థితి మరోలా ఉండేది. హారిస్ మినహా ఒక్కరు కూడా స్థాయికి తగ్గట్లుగా ఆడకపోవడంతో ఇప్పటికే బాగా వెనుకబడ్డ ఆతిథ్య జట్టు నాలుగో రోజైనా కోలుకుంటుందో లేదో చూడాలి. ఎన్ని సంచలనాలు జరిగినా ఈ మ్యాచ్‌లో గెలిచే అవకాశమున్నది టీమ్ఇండియాకు మాత్రమే. అయితే ఇంకా రెండు రోజుల ఆట మిగిలి ఉండటంతో డ్రానా.. డ్రామానా అన్న ఆసక్తి కూడా మొదలైంది.





కుల్దీప్ (3/71)

సిడ్నీ: 71 ఏండ్ల కలను తొందరగా నెరవేర్చుకుందామని భారీ ఆశలతో ఎదురుచూస్తున్న భారత్‌కు వాన దేవుడు అడ్డంకిగా మారాడు. చిరుజల్లులు కురువడం, వెలుతురులేమి కారణంగా దాదాపు గంటన్నర ముందుగానే ఆటను ఆపేసిన నేపథ్యంలో.. శనివారం మూడో రోజు తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 83.3 ఓవర్లలో 6 వికెట్లకు 236 పరుగులు చేసి ఎదురీత మొదలుపెట్టింది. ఆట ముగిసే సమయానికి హ్యాండ్స్‌కోంబ్ (28 బ్యాటింగ్), కమిన్స్ (25 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. హారిస్ (79), లబుషానే (38) మినహా మిగతా వారు నిరాశపర్చారు. కంగారూ జట్టు ఇంకా 386 పరుగులు వెనుకబడి ఉంది. 1947-48లో లాలా అమర్‌నాథ్ సారథ్యంలోని టీమ్ఇండియా ఆసీస్‌లో తొలి పర్యటనలోనే సిరీస్‌ను చేజార్చుకుంది. ఇక అప్పట్నించి ఎంత ప్రయత్నించినా ఇప్పటివరకు ఆ కల నెరవేరలేదు.

హారిస్ పోరాటం..

24/0 ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు ఆట కొనసాగించిన హారిస్, ఖవాజ వేగంగా పరుగులు రాబట్టారు. పిచ్ నుంచి పేసర్లకు సహకారం లభించకపోవడంతో షమీ, బుమ్రా పెద్దగా ప్రభావం చూపలేదు. దీంతో ఐదో ఓవర్‌లోనే జడేజా బౌలింగ్‌కు దిగాల్సి వచ్చింది. మూడు ఓవర్ల తర్వాత మణికట్టు స్పెషలిస్ట్ కుల్దీప్ కూడా రంగంలోకి వచ్చాడు. అయినా ఆసీస్ ఏడు ఓవర్లలోనే 50 పరుగులు రాబట్టింది. కానీ 22వ ఓవర్‌లో కుల్దీప్.. ఖవాజను ఔట్ చేసి తొలి ఫలితాన్ని అందించాడు. దీంతో ఈ ఇద్దరి మధ్య 72 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. 30వ ఓవర్‌లో ఆసీస్ 100 పరుగులకు చేరింది. లబుషానే మెరుగ్గా ఆడాడు. ఆరంభంలో బంతిని సరిగ్గా నియంత్రించలేకపోయిన జడ్డూ.. హారిస్‌కు వరుసగా ఫోర్లు సమర్పించుకున్నాడు. తొలి గంటలో 56 పరుగులు రాబట్టిన ఆసీస్.. రెండో గంటలో మరో 38 పరుగులు సాధించింది. మొత్తానికి పెర్త్ తర్వాత ఈ సెషన్‌లో ఆధిపత్యం చూపెట్టిన ఆసీస్ లంచ్ వరకు 122/1 స్కోరు చేసింది.

రివర్స్ స్వింగ్‌తోనే..

అప్పటివరకు కాస్త మందకొడిగా బౌలింగ్ చేసిన టీమ్ఇండియా పేసర్లు.. రివర్స్ స్వింగ్ మొదలయ్యాక చెలరేగిపోయారు. పరుగులు నిరోధించడంతో ఒత్తిడికి లోనైన హారిస్.. విరామం తర్వాతి మూడో ఓవర్ (43వ) లోనే జడేజాకు వికెట్ సమర్పించుకున్నాడు. మరో ఆరు ఓవర్ల తర్వాత షాన్ మార్ష్ (8)ను కూడా ఔట్ చేసి కంగారూలకు డబుల్ ఝలక్ ఇచ్చాడు. అతికష్టమ్మీద ఆసీస్ 52వ ఓవర్‌లో 150 పరుగులకు చేరుకున్నా.. ఇదే ఓవర్‌లో లబుషానే ఇచ్చిన క్యాచ్‌ను రహానే కండ్లు చెదిరే స్థాయిలో అందుకున్నాడు. ఓవరాల్‌గా 24 పరుగుల తేడాతో మూడు కీలక వికెట్లు పడటంతో ఆసీస్ స్కోరు 152/4గా మారింది. ఈ దశలో హెడ్ (20), హ్యాండ్స్‌కోంబ్ వికెట్‌ను కాపాడుకోవడంతో ఐదో వికెట్‌కు 40 పరుగులు జతయ్యాయి. అయితే టీ విరామానికి ఒక్క ఓవర్ ముందు హెడ్ అనవసరమైన షాట్‌తో మూల్యం చెల్లించుకోగా, పైన్ (5) క్రీజులోకి వచ్చాడు. 198/5 స్కోరుతో మూడో సెషన్ మొదలుపెట్టిన ఆసీస్‌ను కుల్దీప్ వదల్లేదు. ఆరో బంతికే పైన్‌ను ఔట్ చేసి షాకిచ్చాడు. అద్భుతమైన ఫుల్ లెంగ్త్ బంతిని డ్రైవ్ చేయబోయి లైన్ మిస్సయిన పైన్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. కొత్తగా వచ్చిన కమిన్స్.. హ్యాండ్స్‌కోంబ్‌కు చక్కని సహకారం అందించాడు. భారత స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కొన్న ఈ జోడీ ఏడో వికెట్‌కు 38 పరుగులు జోడించింది. 81వ ఓవర్‌లో భారత్ కొత్త బంతిని అడిగినా అంపైర్లు ఇవ్వలేదు. అప్పటికే వాతావరణం మేఘావృతం కావడం, చిరుజల్లులు పడుతుండటంతో 84వ ఓవర్ సగంలో ఆటను ఆపేశారు. దీంతో నాలుగో రోజు ఆటను ఓ గంట ముందుగానే ప్రారంభించాలని నిర్ణయించారు.

- నాలుగో టెస్ట్‌లో అద్భుతమైన బ్యాటింగ్‌తో చెలరేగిన చతేశ్వర్ పుజార, రిషబ్ పంత్‌కు అరుదైన గౌరవం దక్కింది. సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ ఆనర్స్ బోర్డుపై ఈ ఇద్దరు సంతకాలు చేశారు. ఈ మైదానంలో ఒకే ఇన్నింగ్స్‌లో సెంచరీ లేదా ఐదు వికెట్లు లేదా రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 10 వికెట్లు తీసిన ఆటగాళ్లను గౌరవించడం ఎస్‌సీజీ సంప్రదాయం. ఈ ఘనత సాధించిన ఆటగాళ్ల పేర్లను బోర్డుపై రాసి వాళ్ల సంతకాలు తీసుకోవడం ఆనవాయితీ



హారిస్ (79)

స్కోరు బోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 622/7 డిక్లేర్డ్

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: హారిస్ (బి) జడేజా 79, ఖవాజ (సి) పుజార (బి) కుల్దీప్ 27, లబుషేన్ (సి) రహానే (బి) షమీ 38, మార్ష్ (సి) రహానే (బి) జడేజా 8, హెడ్ (సి అండ్ బి) కుల్దీప్ 20, హ్యాండ్స్‌కోంబ్ బ్యాటింగ్ 28, పైన్ (బి) కుల్దీప్ 5, కమిన్స్ బ్యాటింగ్ 25,

ఎక్స్‌ట్రాలు: 6, **మొత్తం:** 83.3 ఓవర్లలో 236/6.

వికెట్లపతనం: 1-72, 2-128, 3-144, 4-152, 5-192, 6-198. **బౌలింగ్:** షమీ 16-1-54-1, బుమ్రా 16-4-43-0, జడేజా 27.3-9-62-2, కుల్దీప్ 24-6-71-3.

ఫైనల్లో నిఖత్ జరీన్



విజయనగర: తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ జాతీయ సీనియర్ బాక్సింగ్ టోర్నీలో అద్భుత ప్రదర్శన కొనసాగిస్తున్నది. బళ్లారి, జేఎస్‌డబ్ల్యూ అకాడమీలో జరుగుతున్న 3వ సీనియర్ మహిళల జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో ఫైనల్‌కు దూసుకెళ్లింది. 51 కేజీల విభాగంలో శనివారం జరిగిన సెమీస్‌లో ఆల్ ఇండియా పోలీస్(ఏపీపీ) బాక్సర్ వన్‌లై దుతిపై సునాయాసంగా విజయం సాధించింది. ప్రత్యర్థిపై పూర్తి స్థాయి ఆధిపత్యంతో మూడురౌండ్లలోనూ నిఖత్ పాయింట్లు రాబట్టింది. నిఖత్ జోరుతో దుతి ఎలాంటి ప్రతిఘటన చూపలేకపోయింది. సూపర్‌పంచ్‌లతో చెలరేగిన నిఖత్ 5-0 తేడాతో విజయం సాధించి టైటిల్ పోరుకు అర్హత సాధించింది.

'సిడ్నీ' గులాబీ మయం!



మెక్‌గ్రాత్‌తో కరచాలనంచేస్తున్న టీమ్ ఇండియా క్రికెటర్లు

సిడ్నీ: సిడ్నీ క్రికెట్ స్టేడియం(ఎస్‌సీజీ) శనివారం గులాబీ రంగు పులుముకుంది. మైదానం నలువైపులా ఎటుచూసినా గులాబీ వాతావరణమే కనిపించింది. రొమ్ము క్యాన్సర్‌తో తనువు చాలించిన క్రికెట్ దిగ్గజం గ్లెన్ మెక్‌గ్రాత్ భార్య జేన్ జ్ఞాపకార్థం ప్రతి ఏడాది క్రికెట్ ఆస్ట్రేలియా(సీఏ) ఏడాది మొదట్లో గులాబీ టెస్ట్‌ను నిర్వహిస్తున్నది. గత పదేండ్లుగా సీఏ ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ వస్తున్నది. ఇందులో భాగంగా భారత్, ఆస్ట్రేలియా మధ్య సిడ్నీ వేదికగా జరుగుతున్న నాలుగో టెస్ట్ మ్యాచ్‌ను రొమ్ము క్యాన్సర్ వ్యాధిగస్తులు, అవగాహనకై నిధుల సేకరణ కోసం సీఏ పూనుకుంది. మ్యాచ్ మూడో రోజు ఆటను జేన్ మెక్‌గ్రాత్ దినంగా ప్రకటించింది. ఈ బృహత్ కార్యానికి అటు ఆస్ట్రేలియా క్రికెటర్లతో పాటు భారత ఆటగాళ్లు సహృదయంతో ముందుకొచ్చారు. ఇరు జట్ల ఆటగాళ్లు తాము సంతకాలు చేసిన గులాబీ రంగు టోపీలను ఫౌండేషన్ చైర్మన్ మెక్‌గ్రాత్‌కు అందించారు. వీటిని వేలం వేయడం ద్వారా వచ్చే డబ్బుతో ఆస్ట్రేలియా వ్యాప్తంగా మెక్‌గ్రాత్ ఫౌండేషన్ రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులకు అండగా నిలువడంతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనుంది.

పంత్ మరో గిల్‌క్రిస్ట్

సిడ్నీ: భారత యువ వికెట్‌కీపర్, బ్యాట్స్‌మన్ రిషబ్‌పంత్‌పై ఆస్ట్రేలియా క్రికెట్ దిగ్గజం రికీ పాంటింగ్ ప్రశంసల వర్షం కురిపించాడు. పంత్ మరో గిల్‌క్రిస్ట్ అంటూ ఆకాశానికెత్తాడు. 'రిషబ్ పంత్‌లో అద్భుత ప్రతిభ దాగుంది. బంతిని బలంగా బాదడంలోనే కాదు పరిస్థితులను బట్టి ఇన్నింగ్స్‌ను నిర్మించడంలో పంత్ పరిణతి కనబరుస్తున్నాడు. ఐపీఎల్‌లో ఢిల్లీ జట్టుకు కోచ్‌గా పనిచేసినప్పుడు పంత్ ఆటను దగ్గరనుంచి గమనించాను. వికెట్ కీపింగ్‌లో నైపుణ్యాన్ని మెరుగుపర్చుకుంటే కెరీర్‌లో అతను దూసుకెళ్లవచ్చు. ఎప్పుడు ధోనీ గురించి మనం చాలా మాట్లాడుకుంటాం. కానీ భారత్ తరఫున చాలా టెస్ట్‌లాడిన ధోనీ కేవలం ఆరు సెంచరీలకు పరిమితమయ్యాడు. పంత్ అలా కాదు ఇప్పటికి 9 టెస్ట్‌ల్లో బరిలోకి దిగిన అతను రెండు సెంచరీలు చేశాడు. భవిష్యత్తులోనూ గిల్‌క్రిస్ట్‌లాగా మెరుపులు మెరిపించగల సత్తా రిషబ్‌కు ఉంది' అని పాంటింగ్ అన్నాడు.

పెరెర పోరాటం వృథా

మౌంట్ మౌన్‌గనుయి(న్యూజిలాండ్): న్యూజిలాండ్ పర్యటనలో శ్రీలంక వరుస పరాజయాల పరంపర కొనసాగుతూనే ఉన్నది. శనివారం లంకతో జరిగిన రెండో వన్డేలో కివీస్ 21 పరుగుల తేడాతో గెలిచింది. దీంతో మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌లో 2-0తో ముందంజ వేసింది. కివీస్ నిర్దేశించిన 320 పరుగుల లక్ష్యఛేదనలో లంక 46.2 ఓవర్లలో 298 పరుగులకు ఆలౌటైంది. ఇష్ సోధీ(3/55), నీశమ్(2/48), మ్యాట్ హెన్రీ(2/52) ధాటికి లంకేయులు 128 పరుగులకే 7 వికెట్లు కోల్పోయారు. గుణతిలక(71) మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. తిసార పెరెర(140) సెంచరీతో వీరవిహారం చేశాడు

తొక్క మంచిదే!

- కూరగాయలు, పండ్ల వ్యర్థాలతోనూ ఆరోగ్యం
- వంటకే కాదు.. ఇంటి శుభ్రతకూ ఉపయోగం
- షాంపూలు, వంటిసబ్బులకు చెక్ పెట్టొచ్చు
- పూలతో రూమ్‌ఫ్రెషనర్స్ తయారు చేయొచ్చు
- కాస్తంత కష్టపడితే అన్నీ ఇంట్లోనే రెడీ



ద్రాక్షరసం



సండే స్పెషల్

శిరందాస్ ప్రవీణ్‌కుమార్,
సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి- నమస్తే తెలంగాణ:

ఓ యాభై అరవై ఏండ్ల క్రితం షాంపూలు లేవు! సబ్బులున్నా.. వాడకం తక్కువే! రూమ్‌ఫ్రెషనర్లు, టూత్‌పేస్టుల ఊసేలేదు! కానీ.. ఇప్పుడు అవి నిత్యజీవితంలో భాగమైపోయాయి! వంటపాత్రలు తోమాలన్నా.. దుస్తులు ఉతకాలన్నా.. ఇల్లు శుభ్రం చేయాలన్నా.. అన్నీ రసాయనాలతో కూడినవే! కానీ.. కాస్తంత దృష్టి.. దానికి కాస్త శ్రమ జోడిస్తే.. ఇంట్లో లభ్యమయ్యే పండ్లు, కూరగాయల వ్యర్థాలనుంచే అన్నీ తయారుచేసుకోవచ్చని ఆచరణలో నిరూపిస్తున్నారు హైదరాబాద్‌లోని పద్మారావునగర్‌కు చెందిన శైలేంద్ర! చదివింది బీటెక్ అయినా.. ఆధ్యాత్మిక బాట పట్టిన శైలేంద్ర.. ప్రకృతి ప్రసాదించినవాటిని తిరిగి వినియోగించడం ద్వారా ప్రకృతికి, పర్యావరణానికి తనవంతు సేవ చేస్తున్నారు. థాయిలాండ్‌కు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ రుజుఖాన్ పరిశోధన ద్వారా రుజువైన అంశాలకు తన పరిశీలన జోడించి.. మరి కొన్ని విధానాలను కూడా శైలేంద్ర రూపొందించారు. ఆరోగ్యం, డబ్బు పొదుపు, పర్యావరణహితం దాగిన ఈ అంశాలను జనబాహుళ్యంలోకి తీసుకెళ్లాలని ఆకాంక్షిస్తున్నారు. ఇంటికి వచ్చే అతిథులందరికీ తన ఉత్పత్తుల ఫలితాలను వివరిస్తున్నారు. ఇందులో పెద్ద కిటుకేమీ లేదు.. కూరగాయలు, పండ్ల వ్యర్థాల్లో గార్బేజ్ ఎంజైమ్, ఫ్రూట్ ఎంజైమ్ (బయో ఎంజైమ్)లు ఉంటాయి. వాటిని ప్రాసెస్ చేస్తే.. మనకు తగిన విధంగా ఉపయోగపడుతాయి.

ఏవి.. ఎందుకు?



కుంకుడుకాయలు, బెల్లంతో చేసిన లిక్విడ్

- కుంకుడుకాయలు కలిపిన నీటితో వంటపాత్రలు కడుగొచ్చు. టాయిలెట్లు శుభ్రం చేయొచ్చు. 250 గ్రాముల కుంకుడుకాయలను లీటరు నీటిలో వారంపాటు నానబెట్టాలి. పైన పేరుకున్న నీటితో బట్టలు ఉతుకొచ్చు. దీనిని వాషింగ్‌మిషన్‌లోనూ వినియోగించొచ్చు. వాషింగ్ మిషన్ మన్నిక పెరుగడమేకాకుండా బట్టలు కూడా శుభ్రమవుతాయి. సువాసన వెదజల్లుతాయి.
- నిమ్మ, దానిమ్మ, బత్తాయి, పైనాపిల్ వంటి పండ్ల వ్యర్థాలకు తగుమోతాదులో బెల్లం కలిపి, 45 రోజులపాటు నీటిలో నానబెడితే వెనిగర్ తయారవుతుంది. దానిని ఇంటిని శుభ్రం చేసేందుకు వాడొచ్చు.
- నిమ్మ, దానిమ్మ, బత్తాయి, పైనాపిల్ వంటి పండ్లను బెల్లం, నీటితో 45 రోజులపాటు నానబెట్టి, వడకడితే జ్యూస్ వస్తుంది. అది ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. దాన్ని రోజూ తాగితే ఆరోగ్యానికి మంచిది.
- ఉసిరి, బెల్లం, నీటిని కలిపి చేసే జ్యూస్‌ను రోజూ తాగొచ్చు. అది నోటి దుర్వాసనను అరికట్టి, రోజంతా ఫ్రెష్‌గా ఉంచుతుంది.
- ద్రాక్షపండ్లు, బెల్లం కలిపి నీటిలో నానబెట్టి వడగట్టాలి. ఆ జ్యూస్‌ను గ్లాసుడు నీళ్లలో 15 మి.లీ. కలుపుకొని రోజూ తాగితే కీళ్లనొప్పులు మటుమాయం అవుతాయి. అంతేకాదు.. తేలికగా ఉంటారు. ఈ జ్యూస్‌ను యాపిల్‌తోనూ చేసుకోవచ్చు.
- పుదీనా, తమలపాకులను బెల్లంతో కలిపి నీటిలో 45 రోజులు నానబెట్టాలి. తేరుకున్న నీటిని కొంచెం తీసుకొని అదనంగా మంచినీటిని చేర్చి అతిథులకు జ్యూస్‌గా ఇవ్వొచ్చు.
- గులాబీ, మల్లె, చామంతి వంటి పూలను బెల్లంతో కలిపి నీళ్లలో నానబెట్టి రూమ్ స్ప్రేగా వాడుకోవచ్చు.
- రేగిపండ్లు, ఇరికి పండ్లను బెల్లంతో కలిపి నీళ్లలో నానబెడితే వచ్చిన క్రీమును మాయిశ్చరైజర్‌గా ఉపయోగించుకోవచ్చు. ఏ కాలంలోనైనా శరీరానికి ఈ క్రీమ్ రుద్దుకుంటే చర్మం నునుపుగా మారుతుంది.
- ముదిరిన బెండకాయలను ఆరు నుంచి ఎనిమిది గంటలపాటు నానబెట్టి ఆ నీటిని తాగితే ఎముకలు దృఢంగా తయారవుతాయి.
- జాక్ ఫ్రూట్, మామిడిపండ్ల తొక్కలతోనూ ఫ్లోర్ క్లీనర్లు తయారు చేసుకోవచ్చు.
- బూడిదను నీటిలో నానబెట్టండి. పైకి తేరుకున్న నీటితో తుడిస్తే అల్మారాలు, కిటికీలు, తలుపులు ప్రత్యేకించి అద్దాలు మెరుస్తాయి. కూరగాయలపైన ఉండే రసాయనాలు (ఎరువులు, క్రిమిసంహారకాల అవశేషాలు) పోవాలంటే ఈ బూడిద నీటితో కడిగితే చాలు.

జ్యూస్ తయారీ విధానం

ఏ పదార్థానికైనా బెల్లం కలిపితే ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. అందుకే చేసుకోవాలనుకునే జ్యూస్‌కు అవసరమైన పండ్లు/కూరగాయలు మూడు భాగాలు, బెల్లం ఒక భాగం, నీళ్లు పది భాగాలు ఉండేటట్లుగా చూసుకోవాలి. తీసుకునే పాత్రలో ఖాళీ భాగం కనీసం 20% ఉండేటట్టు చూసుకోవాలి. నానబెట్టినప్పుడు వాయువులు ఉత్పత్తవుతాయి. అందుకే ప్రతిరోజూ మూతతీసి వాయువులు బయటికి పోయేటట్టు చేయాలి. సూర్యరశ్మి తగులుతూ ఉండాలి. అలా 45 రోజులపాటు నానబెడితే కావాల్సిన జ్యూస్/క్రీం తయారవుతుంది. వాయువులు ఉత్పత్తి అవుతాయి కనుక గాజుకు బదులు గట్టి ప్లాస్టిక్ బాటిళ్లను, డబ్బాలను వినియోగించాలి. జ్యూస్ తయారైన తర్వాత ఇతర పాత్రల్లోకి తీసుకోవడం మంచిది. మొదటిసారిగా జూస్ లేదా క్రీమ్ తయారీకి 45 రోజులు తప్పనిసరి. అయితే.. రెండోసారి చేసుకునేటప్పుడు అప్పటికే తయారుచేసిన జూస్ లేదా క్రీమ్‌ను కాస్తంత కలిపితే 15 రోజుల్లోనే తయారవుతాయి.



పుదీనా, బెల్లం మిశ్రమం

అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణే లక్ష్యం

- ఎన్నార్‌ఎస్సీతో అటవీశాఖ ఉమ్మడి కార్యాచరణ
- 2019 ఏడాదిని 'ఫైర్ ఫ్రీ ఇయర్'గా ప్రకటించిన అటవీశాఖ



దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో అగ్నిప్రమాదాల నివారణపై సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అటవీశాఖ అధికారులు

ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ: అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణకు తెలంగాణ అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతున్నది. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్నార్‌ఎస్సీ)తో కలిసి ఉమ్మడి కార్యాచరణను సిద్ధంచేసింది. జీపీఎస్‌ను పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవడానికి అన్ని ఏర్పాట్లుచేసింది. రాష్ట్ర అటవీశాఖ.. 2019 సంవత్సరాన్ని 'ఫైర్ ఫ్రీ ఇయర్'గా ప్రకటించింది. అడవుల రక్షణకు దాదాపు 2,500 మందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి వీరికి ఎన్నార్‌ఎస్సీ సహకారంతో దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నది. శాటిలైట్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి జీపీఎస్ ద్వారా అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని గుర్తించి వెంటనే మంటలను ఆర్పడానికి చర్యలు తీసుకుంటున్నది. ఈ మేరకు పీసీసీఎఫ్ రఘువీర్ పర్యవేక్షణలో దూలపల్లి ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్ కోట తిరుపతయ్య ఆధ్వర్యంలో ఫైర్‌ఫైట్ శిక్షణ కార్యక్రమాలు మొదలయ్యాయి. ఈ ఏడాది ఒక్క అగ్నిప్రమాదం కూడా జరుగకుండా జాగ్రత్తపడటానికి ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు వెల్లడించారు. ఎండాకాలంలో లక్షల ఎకరాల్లో అడవులు అగ్నికి ఆహుతవుతుంటాయి. రాష్ట్రవ్యాప్తంగా 2004 నుంచి దాదాపు 14 వేలచోట్ల అగ్నిప్రమాదాలు జరిగినట్టు రికార్డులు చెప్తున్నాయి.



పులి చర్మాన్ని రవాణా చేస్తున్న నిందితులను అదుపులోకి తీసుకున్న అధికారులు

ఇచ్చోడలో పెద్దపులి చర్మం స్వాధీనం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ వద్ద అటవీశాఖ అధికారులు పెద్దపులి చర్మాన్ని శనివారం స్వాధీనం చేసుకొని నలుగురిని అరెస్ట్‌చేశారు. వైల్డ్‌లైఫ్ క్రైమ్ కంట్రోల్ బ్యూరో సహకారంతో రాష్ట్ర అటవీశాఖ అధికారులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు వరంగల్, కాగజ్‌నగర్, నిర్మల్ ప్రాంతాలకు చెందిన వారని అధికారులు వెల్లడించారు.

మహిళలు పరిశోధనల వైపు మళ్లాలి

- 2.8 లక్షల శాస్త్రవేత్తల్లో మహిళలు 14%
- లింగ అసమానతలను రూపుమాపాలి
- తల్లిదండ్రులు పిల్లల పట్ల వివక్ష చూపొద్దు
- స్థానిక భాషల్లోనూ సైన్స్ సాహిత్యం రావాలి
- మహిళా సైన్స్ కాంగ్రెస్‌లో కేంద్ర జౌళిశాఖ మంత్రి స్మృతి ఇరానీ

(జలంధర్ నుంచి నమస్తే తెలంగాణ ప్రతినిధి సిద్ధార్థ్ బీసగోని)



శనివారం ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో కమ్యూనికేటింగ్ సైన్స్ సెషన్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి రవిశంకర్

మహిళలు తమకు అడ్డుగా ఉన్న ప్రతిబంధకాలను తొలిగించుకుంటూ అన్నిరంగాల్లో దూసుకుపోవాలని కేంద్ర జౌళిశాఖ మంత్రి స్మృతి ఇరానీ పిలుపునిచ్చారు. శాస్త్ర సాంకేతికతపై ఆసక్తి పెంచుకోవాలని, పరిశోధనలు చేసేందుకు ముందుకురావాలని సూచించారు. సైన్స్‌తో ప్రత్యామ్నాయ, ఉన్నతమైన భవిష్యత్‌కు భారత్ బాటలువేస్తున్న నేపథ్యంలో మహిళలకు అపార అవకాశాలు ఉన్నట్టు చెప్పారు. పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న 106వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ (ఐఎస్సీ)లో భాగంగా శనివారం మహిళా సైన్స్ కాంగ్రెస్‌ను స్మృతి ఇరానీ ప్రారంభించారు. మహిళా సైన్స్ కాంగ్రెస్ సావనీర్‌ను ఆవిష్కరించిన అనంతరం మహిళాసాధికారతపై ఆమె కీలకోపన్యాసం చేశారు. తాను జౌళిశాఖ మంత్రిగా కాకుండా ఒక మహిళాప్రతినిధిగా ఇక్కడికి వచ్చినట్టు చెప్పారు. లింగ అసమానత్వం మహిళల సమస్య మాత్రమే కాదన్న ఆమె.. దానిని నిర్మూలించేందుకు పురుషులు సైతం బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అప్పుడే సోదరీమణులకు, ఆడబిడ్డలకు మంచి భవిష్యత్‌ను ఇవ్వడం సాధ్యమవుతుందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న పలు పరిశోధనాసంస్థల్లో 2.8 లక్షల మంది ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు సేవలందిస్తుంటే అందులో 14 శాతం మంది మాత్రమే మహిళలు ఉన్నట్టు చెప్పారు. అనేక రంగాల్లో మహిళలు అణచివేతకు గురవుతున్నారని, వారి ఆలోచనలు మొగ్గలోనే వాడి పోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. మరెందరో మహిళలు వారి ఆవిష్కరణలను ప్రపంచానికి తెలియచేయడంలో, వాణిజ్యపరంగా అభివృద్ధి పరుచడంలో వెనుకడుగు వేస్తున్నారని చెప్పారు. తల్లిదండ్రుల పెంపకంలో సైతం మార్పు రావాలని, లింగ సమానత్వంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కొందరు తల్లిదండ్రులు మగపిల్లలకు కారు, తుపాకీ, ఆట వస్తువులు కొనిస్తే ఆడపిల్లలకు మాత్రం ఇంటి వస్తువులు కొనిస్తారని అన్నారు. ఇలా చేయడం వల్ల చిన్ననాటి నుంచే లింగ వివక్షను భరించడం అలవాటుగా మారుతుందన్నారు. ఇంగ్లిష్ భాషలోనే సైన్స్ సాహిత్యం ఉండటం వల్ల సైన్స్‌రంగంలో రాణించడం యువతకు ప్రధాన అడ్డంకిగా మారుతుందన్నారు. ఇంగ్లిష్ భాషలోనే సైన్స్ ఉండాల్సిన అవసరం ఏముందన్న స్మృతీఇరానీ.. అన్ని స్థానిక భాషల్లోకి పరిశోధనాపత్రాలు, ఇతర పుస్తకాలను తర్జుమా చేసే బాధ్యతలను సైన్స్ కాంగ్రెస్ తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. పాఠశాలలకు, విద్యాసంస్థలకు వాటిని చేరవేయడం వల్ల చిన్నతనంలో విద్యార్థులు సైన్స్ పట్ల ఆకర్షితులు అవుతారని చెప్పారు. 2021 నాటికి 280 మిలియన్ విద్యార్థులు పాఠశాలల్లో ఉంటారని, ఇదే సమయంలో ఆన్‌లైన్ కోచింగ్ 62 శాతం వృద్ధి సాధించి 55 మిలియన్ డాలర్ల వ్యాపారం జరుగుతుందని తెలిపారు. ఆన్‌లైన్ కోచింగ్ అనేది బాలికావిద్యకు ఏవిధంగా తోడ్పడుతుందని ప్రశ్నించారు. అంతకు ముందు లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద అతి పెద్ద రొబోటిక్ నిర్మాణమైన మెటల్ మాగ్నాను స్మృతి ఇరానీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ జనరల్ ప్రెసిడెంట్ మనోజ్‌కుమార్ చక్రవర్తి, జనరల్ సెక్రటరీ పీపీ మాథూర్, వచ్చే మహిళా సైన్స్ కాంగ్రెస్ జనరల్ ప్రెసిడెంట్‌గా ఎంపికైన విజయలక్ష్మి, సక్సేనా, జనరల్ సెక్రటరీ గంగాధర్, పలు రంగాల్లో ఉన్నతస్థానాల్లో ఉన్న మహిళలు, యువ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



లవ్లీ యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద అతిపెద్ద రొబోటిక్ నిర్మాణమైన మెటల్ మాగ్నాను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి స్మృతి ఇరానీ

ఐటీ+ఐటీ= ఐటీ: కేంద్రన్యాయశాఖ మంత్రి రవిశంకర్

టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ అనే మూడు శక్తిమంతమైనవని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ చెప్పారు. టెక్నాలజీకి అవధులు లేవని, దాన్ని మానవాళి క్షేమం కోసమే వినియోగించాలన్నారు. ఐటీ (ఇండియాస్ టాలెంట్)+ (ఐటీ) ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ= ఐటీ (ఇండియాస్ టుమారో) అవుతుందని వ్యాఖ్యానించారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో భాగంగా నిర్వహించిన కమ్యూనికేటింగ్ సైన్స్ సెషన్‌లో రవిశంకర్ ప్రసంగించారు. ప్రధాని మోదీ ఇచ్చిన జై అనుసంధాన్ పిలుపునకు ఎంతో ప్రాముఖ్యం ఉందని, పరిశోధనల వేగం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతికరంగంలో భారత్ వేగంగా దూసుకుపోతున్నదని చెప్పారు.

త్వరలోనే స్మార్ట్ పాఠశాలలు: ప్రొఫెసర్ అనుజ్ సిన్హా, ఎన్సీఎస్టీసీ చైర్మన్



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది మరింత కీలకపాత్ర పోషించనుందని నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ కమ్యూనికేషన్ (ఎన్సీఎస్టీసీ) చైర్మన్ అనుజ్ సిన్హా అన్నారు. రక్షణరంగంలో సేవలు వినియోగించుకున్నట్టుగానే విద్యారంగంలోనూ ఉపయోగించుకోనున్నట్టు చెప్పారు. ఈ టెక్నాలజీ వల్ల ఆన్‌లైన్ లైబ్రరీలు ఏర్పాటవుతాయని, త్వరలోనే దేశంలోని స్కూళ్లు స్మార్ట్ పాఠశాలలుగా మారుతాయని తెలిపారు. పరిశోధన విద్యార్థుల నుంచి పాఠశాల విద్యార్థులవరకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎంతగానో ఉపయోగపడునుందన్నారు. చాలామంది పెళ్లి అంటే ఆసక్తి చూపెట్టలేకపోతున్నారని, వారు ఎక్కువగా వినియోగిస్తున్న గాడ్జెట్స్ కూడా ఓ కారణమన్నారు.

యూజీసీ నెట్ ఫలితాలు విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తమ ఆధ్వర్యంలో మొట్టమొదటిసారి డిసెంబర్ 18 నుంచి 22 వరకు నిర్వహించిన యూజీసీ నెట్ పరీక్షా ఫలితాలు విడుదలైనట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) శనివారం వెల్లడించింది. మొత్తం 9.56 లక్షల మంది పరీక్షకు నమోదు చేసుకోగా.. 6.81 లక్షల మంది పరీక్షలకు హాజరయ్యారని తెలిపింది. అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌కు 44,001 మంది, జేఆర్‌ఎఫ్- అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌కు 3,883 మంది అర్హత సాధించారని పేర్కొన్నది.

ఏబీవీపీ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా ప్రవీణ్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏబీవీపీ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నేత ప్రవీణ్‌రెడ్డి నియమితులయ్యారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన 64వ జాతీయ మహాసభల్లో ఏబీవీపీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సుబ్బయ్య ప్రవీణ్‌రెడ్డిని ఈ పదవిలో నియమించినట్టు ఏబీవీపీ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది.

ట్రేడింగ్ పేరుతో టోకరా

- షేర్‌మార్కెట్లో లాభాలంటూ డిమాట్ ఖాతాదారులకు ఫోన్లు
- సలహాలిస్తూ పెట్టుబడి వసూలు
- ఆపై నష్టపోయామంటూ మోసం
- మధ్యప్రదేశ్ ఇండోర్ కేంద్రంగా కుంభకోణం
- బయటపెట్టిన సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు
- నలుగురి అరెస్ట్, రూ.3.62 కోట్లు సీజ్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:





మీడియాకు కేసు వివరాలు వెల్లడిస్తున్న సైబరాబాద్ సీపీ సజ్జనార్, పక్క చిత్రంలో నిందితులు

హలో సార్.. మేం ట్రేడ్ అడ్వైజరీ కంపెనీ నుంచి ఫోన్ చేస్తున్నాం. మీరు స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెడుతున్నారు కదా.. మీకు మంచి లాభాలు వచ్చేలా సూచనలు ఇస్తాం. రేపు ఉదయం 9.30 నుంచి 9.45 గంటల వ్యవధిలో రెడ్డీ ల్యాబ్స్ కంపెనీ షేర్ ధర పెరుగుతుంది. ఆ తర్వాత పడిపోతుంది. మేం చెప్పిన వాటిని మీరు గమనించండి.

- పదిరోజుల తర్వాత మరోసారి ఫోన్‌చేసి.. 'హలో సార్ ఈ సారి ఇంట్రా ట్రేడింగ్‌లో పెట్టుబడి పెట్టండి. మంచి లాభాలొస్తాయి. (ఏ కంపెనీ షేర్ల ధరలు పెరుగుతాయో విశ్లేషణల ద్వారా, ఊహాజనితంగా చెప్తారు. అవి నిజమవుతుండటంతో నమ్మించి మోసం చేస్తారు.)
- ఆ తర్వాత మరోసారి అదే కంపెనీ నుంచి ఫోన్‌చేసి 'సార్ మీరు ఎందుకు రిస్క్ చేస్తారు. మా కంపెనీ ద్వారా పెట్టుబడి పెట్టండి. 45 రోజుల్లో భారీ లాభాలు తెచ్చిపెడ్తాం. ఇందుకు అదనంగా రిజిస్ట్రేషన్ ఫీజు, ప్రాజెక్టు రిపోర్టు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది' అని నమ్మిస్తారు.
- (పెట్టుబడి పెట్టిన తర్వాత) ఖాతాదారుకు మళ్లీ ఫోన్ చేయరు. అతడే ఫోన్‌చేస్తే 'మీరు పెట్టుబడి పెట్టిన షేర్ల ధరలు పడిపోయాయి. మరో రూ.50 వేలు ఇవ్వండి' అని అడుగుతారు. ఆ తర్వాత ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసేస్తారు.

ఇలా షేర్ మార్కెట్‌లో లాభాల పేరిట పెట్టుబడులు పెట్టించి రూ.కోట్లలో మోసాలకు పాల్పడుతున్న కుంభకోణాన్ని సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు బయటపెట్టారు. చిట్కాల పేరుతో డిమాట్ ఖాతాదారులనుంచి డబ్బు కొల్లగొట్టిన అడ్వైజరీ సంస్థల డొంక కదిలించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ కేంద్రంగా సాగుతున్న ఈ స్కాంలో నలుగురు నిందితులను అరెస్ట్‌చేసి, ఆయా సంస్థల ఖాతాల్లోని రూ.3.62 కోట్లను సీజ్ చేశామని సైబరాబాద్ సీపీ సజ్జనార్ శనివారం వెల్లడించారు. స్కాంను బయటపెట్టిన సిబ్బందిని అభినందించి, వారికి రివార్డులను అందించారు. అడ్వైజరీ సంస్థల అక్రమాలపై సెబీ అధికారులకు లేఖలు రాస్తామని, ఫిర్యాదులు వచ్చినా ఎందుకు స్పందించలేదనే అంశాలను నివృత్తి చేసుకుంటామని చెప్పారు. స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌చేసే వినియోగదారులు.. మోసపూరిత ప్రకటనలను నమ్మి బోల్తాపడొద్దని సూచించారు.

ప్రొఫెసర్ ఫిర్యాదుతో కదిలిన డొంక

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మణికొండ ప్రాంతానికి చెందిన ప్రొఫెసర్ రామచంద్ర ఆర్యాశ్రీకి 2017 జూన్‌లో ట్రేడ్ బిజ్ రిసెర్చ్ సంస్థ నుంచి ఓ ఫోన్ వచ్చింది. కంపెనీ ప్రతినిధుల మాటలు నమ్మి రూ.2 లక్షల పెట్టుబడి పెట్టి.. ఆ తర్వాత మోసపోయానని గుర్తించాడు. రామచంద్రంతో పాటు మరికొంత మంది బాధితులు సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించడంతో ఇది బయటకొచ్చింది. సైబర్ క్రైం డీసీపీ జానకీ షర్మిల నేతృత్వంలో ఏసీపీ శ్రీనివాస్‌రావు సారథ్యంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ విజయ్‌వర్ధన్ బృందం బాధితులు డబ్బు జమచేసిన ఖాతాలు, ఫోన్ నంబర్ల ఆధారంగా అడ్వైజరీ సంస్థల చిరునామాను ఇండోర్‌లో గుర్తించారు. హైబ్రో మార్కెట్ రిసెర్చ్ ఇన్వెస్ట్‌మెంట్స్ అడ్వైజర్స్ ప్రై.లిమిటెడ్‌కు చెందిన స్వప్నిల్ ప్రజాపతి, ఈక్యూకామ్ ఫైనాన్సియల్ రిసెర్చ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన అఖిలేశ్ రఘువంశి, ట్రేడ్ బిజ్ రిసెర్చ్ సంస్థకు చెందిన సంతోష్‌సింగ్ పరిహార్, సఫల్ రిసెర్చ్ సంస్థకు చెందిన సాగర్ సాహులను అరెస్ట్‌చేశారు. ఈ సంస్థల ప్రతినిధులు ఎన్‌ఐఎస్‌ఎం (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్) ద్వారా ఆన్‌లైన్ కోర్సుచేసి స్టాక్‌మార్కెట్ ట్రేడింగ్ సర్టిఫికెట్‌ను పొందారని, వాటిని సెబీ వద్ద దరఖాస్తుచేసుకుని అడ్వైజరీ లైసెన్స్ తీసుకున్నారని గుర్తించారు. అనంతరం కాల్‌సెంటర్ల ద్వారా అక్రమంగా డీమాట్ ఖాతాదారుల వివరాలను పొంది మోసగిస్తున్నట్టు ప్రాథమికంగా తేల్చారు. ఇండోర్‌లోని విజయనగర్ కాలనీలో ఈ ఎన్‌ఐఎస్ సర్టిఫికెట్ల ద్వారా 161 సంస్థలు సెబీ అనుమతిపొందగా మరో 400 సంస్థలు అనుమతుల్లేకుండానే నడుస్తున్నాయని, వారు స్టాక్ మార్కెట్‌లో లాభాలకోసం చిట్కాలు చెప్తామంటూ దేశవ్యాప్తంగా ప్రతిరోజు 50 వేల మంది డీమాట్ ఖాతాదారులను ఫోన్లు, ఎస్సెమ్మెస్‌ల ద్వారా ఆకర్షించి మోసాలకు పాల్పడుతున్నట్టు గుర్తించారు. ప్రాథమికంగా ఈ సంస్థల లావాదేవీలను పరిశీలిస్తే ఇప్పటివరకు రూ.1000 కోట్లు కొల్లగొట్టి ఉంటాయని పోలీసులు అంచనావేస్తున్నారు.



ఆడబిడ్డల సంరక్షణ కోసం.. కుంచెను ప్రచార సాధనంగా వాడుకుంటున్న చిత్రకారుడు..

సింగిడిలో..

తెలుగులో 13 యేండ్ల తర్వాత.. మహేష్‌తో కత్రినా కైఫ్ జోడీ!

చిత్రంలో..



నమస్తే తెలంగాణ

జిందగీ

ఆదివారం 6 జనవరి 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

సినిమా నా ప్యాషన్!



ఓటమిని పరిగెత్తించు అది నిన్ను విజయం దాకా తీసుకెళ్తుంది అంటూ సాయిమాధవ్ బుర్రా సంభాషణలు జీవితపు సారాన్ని బోధిస్తాయి. నాయకుడంటే నమ్మించేవాడు కాదు నడిపించేవాడు, గెలిచేవాడు కాదు గెలిపించేవాడు అంటూ నాయకుడి గొప్పతనాన్ని చెబుతాయి. మనమే కాదు మనం ఉండే చోటు బతకాలా.. తోటోడు బతకాలా అంటూ పరోపకార గుణం ఆవశ్యకతను వివరిస్తాయి. కళ అంటే బతుకునిచ్చేదే అనుకోకు, బతుకు నేర్పేది అంటూ కళల గొప్పతనాన్ని ఆవిష్కరిస్తాయి.. మానవ జీవితాల్లోని సంఘర్షణను చాటిచెబుతూ అద్భుతమైన సంభాషణలతో తెలుగు చిత్రసీమలో మంచి రచయితగా గుర్తింపును సొంతం చేసుకున్నారు సాయిమాధవ్ బుర్రా. కృష్ణం వందే జగద్గురుమ్, మళ్లీ మళ్లీ ఇది రాని రోజు, మహానటి, గౌతమీపుత్ర శాతకర్ణి చిత్రాలు ఆయన ప్రతిభకు తార్కాణాలుగా నిలిచాయి. రచయితగా తన ప్రయాణాన్ని గురించి సాయిమాధవ్‌బుర్రా 'జిందగీ'తో పంచుకున్న ముచ్చట్లివి...

- **క్రిష్‌తో మీ ప్రయాణం ఎలా ప్రారంభమైంది? తొలి సినిమా అవకాశం ఎలా వచ్చింది?**
- క్రిష్ నాకు సినీ జీవితాన్ని ప్రసాదించారు. ఆయనతో ఐదు నిమిషాలు మాట్లాడితే ఓ మంచి పుస్తకం చదివిన భావన కలుగుతుంది. ఆయన దర్శకత్వం వహించిన గమ్యం సినిమా చూసి జీవితంలో అలాంటి ఒక్క సినిమాకైనా పనిచేయాలని కోరుకున్నాను. అలాంటిది క్రిష్ స్వయంగా కృష్ణం వందే జగద్గురుమ్ సినిమాకు సంభాషణల రచయితగా నాకు అవకాశం ఇవ్వడం ఎప్పటికీ మర్చిపోలేను. ఆ సినిమా నాకు ఎనలేని పేరు తెచ్చిపెట్టినా మరో సినిమా అవకాశం రెండేళ్లు పట్టింది. ఆ విరామంలో సినిమా ఇండస్ట్రీలోని లోతుపాతులు, దర్శకనిర్మాతలతో లౌక్యంగా ఎలా మెలగాలో నేర్చుకున్నాను. ఈ గ్యాప్ రచయితగానే కాకుండా మనిషిగా నాలో పరిపూర్ణతను తీసుకొచ్చింది. ఆ తర్వాత వచ్చిన 'మళ్లీ మళ్లీ ఇది రాని రోజు', 'గోపాల గోపాల' సినిమాలు విజయవంతమవ్వడంతో రచయితగా వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది.

- **మీ సంభాషణల్లో ఎక్కువ తాత్వికత, మానవ జీవితాల్లోని సంఘర్షణ గోచరిస్తుంటాయి. ఆ సంభాషణలకు ప్రేరణ ఎక్కడ నుంచి వస్తుంది?**
- పాత్ర అనుభవిస్తున్న కష్టాలు, విజయాలు, కన్నీళ్లు, ప్రేమానురాగాలు, భావోద్వేగాలతో సహానుభూతి చెందుతూ సినిమాలకు సంభాషణలు రాస్తుంటాను. సినిమాలోని పాత్రనే స్ఫూర్తిగా తీసుకుంటాను.

- **కళారంగంతో మీ పరిచయం ఎలా ప్రారంభమైంది?**
- అమ్మానాన్న ఇద్దరూ రంగస్థల కళాకారులు. పౌరాణిక నాటకాలు వేసేవారు. ఊహ తెలిసినప్పటి నుంచి ఇంట్లో హార్మోనియం స్వరాలు వింటూ పెరిగాను. తల్లిదండ్రుల స్ఫూర్తితో ఆరేళ్ల వయసులో నటుడిగా మారాను. తొలిసారి సత్యహరిశ్చంద్రుడి నాటకంలో హరిశ్చంద్రుడు కొడుకైనా లోహితాస్యుడి వేషం వేశాను. నా నట ప్రయాణం కాకతాళీయంగా మొదలైంది. లోహితాస్యుడి వేషం వేసే కుర్రాడు రాకపోవడంతో నన్ను స్టేజ్ ఎక్కించారు. ఆ పాత్ర కోసం ఎలాంటి రిహార్సల్స్ చేయలేదు. అంతా ఐదు నిమిషాల్లోనే జరిగిపోయింది. అలా రంగస్థల కళాకారుడిగా నా జీవితం ప్రారంభమైంది.

- **మీలోని రచయితకు ఎప్పుడూ బీజం పడింది?**
- లోహితాస్యుడితో మొదలైన నా నాటక ప్రయాణం చాలా యేండ్ల పాటు కొనసాగించింది. ఆ సమయంలో ప్రజానాట్య మండలితో అనుబంధం ఏర్పడింది. అభ్యుదయ కళాసమితి తరుపున సామాజిక ఇతివృత్తాలతో కూడిన పలు నాటకాలు వేశాను. ప్రజానాట్య మండలిలో చేరిన తర్వాతే సమాజంపై అవగాహన, ప్రశ్నించాలనే మనస్తత్వం అలవడ్డాయి. పండిత పరమేశ్వరశర్మ, నాగేశ్వరరావులాంటి మహానుభావులతో పరిచయం ఏర్పడింది. అక్కడే నాలోని రచయితకు బీజం పడింది. ఓ వైపు నటనను కొనసాగిస్తూనే నాటకాలు రాయడం ప్రారంభించాను. రాయడంలో ఉండే కిక్ నాలో అంతులేని సంతృప్తినిచ్చింది. నేను రాసిన నాటకాల్లో 'అద్దంలో చందమామ' అనేక పరిషత్తుల్లో అవార్డులను సొంతం చేసుకున్నది.

- **సినిమాలపై ఇష్టం ఎలా మొదలైంది?**
- నాటకాలపై ఉన్న ఆసక్తి క్రమంగా సినిమాలపై మరలింది. సినిమాల్లోనే బతుకాలని నిశ్చయించుకున్నాను. ఆ కోరిక ఎలా, ఎప్పుడు అంకురార్పణ పడిందో తెలియదు. చిన్నతనం నుంచి పలానా హీరో, పలానా కథ అనే భేదాలు విడుదలైన ప్రతి సినిమా చూడడం అలవాటైంది. కాలేజ్ ఎగ్గొట్టి రోజూ ఓ సినిమా చూశాను. ఆ సినిమాలు చూసి అందులోని తప్పొప్పుల్ని స్నేహితులతో విశ్లేషించేవాణ్ణి. అవన్నీ సినిమాల్లో పట్ల నాకున్న ఇష్టాన్ని మరింతగా పెంచాయి.

- **రచయితగా ఎవరి వద్ద శిష్యరికం చేశారు?**
- పలు సినిమాలకు ఘోస్ట్ రైటర్‌గా పనిచేసిన నూతలపాటి సత్యనారాయణ నా తొలి గురువు. మంచి రచనకు ఉండాల్సిన లక్షణాలేమిటో, ఏ విధంగా రాయాలో ఆయన దగ్గరే నేర్చుకున్నాను. ఆ తర్వాత ప్రముఖ రచయిత బొల్లిముంత శివరామకృష్ణ సహచర్యం నా ఆలోచన విధానంలో పరిణితిని తీసుకొచ్చింది.

- **రచయితగా అవకాశం ఇవ్వమని ఎవరైనా అడిగిన సందర్భాలున్నాయా?**
- సినిమాల పట్ల ఇష్టం, ఆసక్తితో పరిచయస్తులు ఎవరూ లేకపోయినా ధైర్యంగా హైదరాబాద్‌కు వచ్చాను. నాకు మొహమాటం ఎక్కువ. దీంతో రచయితగా నాకోవకాశం ఇవ్వమని ఎవరిని అడుగలేకపోయాను. అప్పట్లో రచయితలంతా వయసుపరంగా అనుభవజ్ఞులే కనిపించేవారు. వారితో పోలిస్తే నా వయసు చాలా తక్కువ కావడంతో అవకాశం ఇవ్వమని అడిగితే ఎగతాళిగా చూస్తారన్న బిడియం చాలా ఉండేది. దాంతో చుక్కాని లేని నావ మాదిరిగా హైదరాబాద్‌లో నా ప్రయాణం ఎలాంటి ఎదుగు లేకుండా చాలా రోజులు సాగిపోయింది. ఇప్పటికీ నా కెరీర్‌లో డైలాగ్ రైటర్‌గా తమ సినిమా కోసం నన్ను తీసుకోమని ఎవరి దగ్గరకు వెళ్లలేదు. ఎవరినీ అడుగలేదు.

- **సినీ కష్టాలు ఏమైనా ఎదుర్కొన్నారా?**
- రైటర్‌గా అవకాశాలు రాకముందు నేను కొన్ని సినీ కష్టాలు ఎదుర్కొన్నాను. సినిమాల్లో అవకాశాలు రాకపోవడంతో ఆర్థిక అవసరాల కోసం ఇంట్లో వాళ్లపై ఆధారపడ్డాను. వారు పంపించే డబ్బు వారం రోజుల్లో అయిపోయేది. ఆ విషయం అమ్మానాన్నలకు తెలిస్తే హైదరాబాద్‌లో కష్టాలు పడుతున్నానని బాధపడుతారని చెప్పకుండా దాచిపెట్టాను. అన్నం దొరక్క ఆకలితో అలమటించిన రోజుల్ని అడ్వెంచర్స్‌గా భావించాను. ఆకలి రాజ్యం సినిమాలో కమల్‌హాసన్ పస్తులతో ఉన్నాడు. నేను అలా ఉంటేనే గెలుస్తానని భావించాను. అలా నా జీవితంలోని ప్రతి సంఘటనను సినిమాగానే చూశాను. సినిమాలతోనే పోల్చుకున్నాను. నా స్నేహితులంతా జీవితమంటే సినిమా కాదు అని హెచ్చరించేవారు. కానీ, నాకు మాత్రం సినిమానే జీవితం అయ్యింది.

- **రచయితగా మీపై ఎక్కువగా ప్రభావం చూపించిన వారెవరూ?**
- చలం, రావిశాస్త్రి, గోపీచంద్ రచనలు నన్ను చాలా ప్రభావితం చేశాయి. ఆత్రేయ, పరుచూరి బ్రదర్స్, జంధ్యాల, ముళ్లపూడి వెంకటరమణ, ఎమ్వీఎస్ హరనాథరావు ముందు తరానికి చెందిన సినీ రచయితల ప్రభావం నాపై ఉంది. నా సినిమాలకు సంబంధించి ఓ సన్నివేశం రాసేటప్పుడు ఫలానా సన్నివేశంలో ముళ్లపూడిగారయితే ఎలా ఆలోచిస్తారో, జంధ్యాల ఎలా రాస్తారో ఊహించుకుంటుంటాను. అలాగని వారిని అనుకరించను. వారికంటే బాగా రాయాలనో, వారిలా రాయాలనో ఆలోచిస్తుంటాను. నా తర్వాతి తరం రచయితలపై నా ప్రభావం ఉంటే రచయితగా నేను విజయవంతమైనట్లేనని నమ్ముతాను.



- **సినిమాల్లోకి రావడానికి ముందు టీవీ సీరియల్స్‌కు పనిచేశారు? అవి మీ కెరీర్‌కు ఎంతవరకు ఉపయోగపడ్డాయి?**
- హైదరాబాద్‌కు వచ్చిన తొలినాళ్లలో రాజా చంద్రవర్మ అనే టీవీ డైరెక్టర్‌తో ఏర్పడిన పరిచయం నా జీవితాన్ని మలుపు తిప్పింది. నా రచనాశైలి నచ్చడంతో టీవీ రంగంలోకి రమ్మని ఆహ్వానించారు. కానీ, నేను సినిమాలకు మాత్రమే పనిచేస్తానని చెప్పాను. టెలీఫిల్మ్‌కు సంభాషణలు రాయడం అంటే సినిమాలకు పనిచేసినట్లే అని ఆయన నాకు భరోసానిచ్చారు. ఆయన దర్శకత్వంలో వచ్చిన అభినందన అనే టెలీఫిలిమ్ డైలాగ్ రైటర్‌గా నాకు మంచి పేరు తెచ్చిపెట్టింది. ఆ టెలీఫిల్మ్ ద్వారా క్రిష్ నిర్మాణంలో రూపొందిన పుత్తడిబొమ్మ అనే డైలీ సీరియల్‌కు మాటలు రాసే అవకాశం వచ్చింది. కానీ, డైలీ సీరియల్‌కు పనిచేస్తే జీవితాంతం టీవీ రంగానికే పరిమితమైపోతాననే సంశయంతో చాలా రోజులు ఆ సీరియల్‌కు మాటలు రాయాలా? వద్దా అని ఆలోచించాను. చివరకు ధైర్యం చేసి అంగీకరించాను. ఆ సీరియల్ నాకు సినిమాల్లో అవకాశాల్ని తెచ్చిపెట్టింది. నాలోని రచయితను ప్రపంచానికి పరిచయం చేసింది.

- **రచయితగా సమాజాన్ని ప్రభావితం చేసే సంభాషణలు రాయడానికి ఇష్టపడుతుంటారా?**
- సమాజానికి మంచి చెప్పే అవకాశం వస్తే ఎప్పుడూ వదులుకోను. అలాగే నా సంభాషణల ద్వారా చెడు ప్రభావం పడకూడదని కోరుకుంటాను. అలాంటివి ఎప్పుడూ రాయను. అలాంటివి రాయమని కొందరు అడిగారు. కానీ ఆ పని నేను చేయనని చెప్పాను. అలాగే పూజనీయమైన పాత్రల్ని వ్యంగ్యంగా ఆవిష్కరించడం ఇష్టం ఉండదు. ఇతరుల నమ్మకాల్ని దెబ్బతీసే సన్నివేశాలు నా సినిమాల్లో కనిపించవు.

- **జంధ్యాల, ముళ్లపూడి వెంకటరమణ లాంటి రచయితలు ప్రస్తుతం కనపడడం లేదు? కారణమేమిటని అనుకుంటున్నారు?**
- మంచి కథలు రాకపోవడం వల్లే జంధ్యాల, ముళ్లపూడిలాగా అద్భుతమైన సంభాషణలు రాసే రచయితలు తగ్గిపోయారు. మళ్లీ మళ్లీ ఇది రాని రోజు, గౌతమీ పుత్ర శాతకర్ణి లాంటి కథలు దొరికితే ఏ రచయిత అయినా గొప్పగా డైలాగ్‌లు రాయగలరని నా నమ్మకం.

- **తెలుగు చిత్రసీమ ధోరణిలో ఎలాంటి మార్పులు వస్తున్నాయని అనుకుంటున్నారు?**
- ప్రస్తుతం నవతరం దర్శకులు అద్భుతమైన కథాంశాలతో సినిమాలు చేస్తున్నారు. మూసధోరణిలో సినిమాలు చేస్తే ప్రేక్షకులు చూడడం లేదు. కొత్తదనం ఉంటేనే థియేటర్లకు వస్తున్నారు. గతంలో వినోదసాధనంగా సినిమా ఒక్కటే ఉండేది. ఇప్పుడు అనేక మార్గాలు ఉన్నాయి. అలాంటప్పుడు సినిమాలకు రావాలంటే వైవిధ్యత ఉండాల్సిందే.

- **రచయితగా ఎలాంటి సినిమాలకు పనిచేయడంలో మీకు సౌలభ్యం ఎక్కువగా ఉంటుంది?**
- కమర్షియల్, బయోపిక్, ప్రేమకథలు.. ఇలా పలానా కథాంశాలకే సంభాషణలు రాయాలనే పరిమితులేవీ పెట్టుకోను. సినిమా చేయడమే నా డ్రీమ్. ఇప్పుడు ఆ డ్రీమ్‌లోనే బతుకుతున్నాను. అన్ని రకాల కథలకు నేను న్యాయం చేయగలనని నిరూపించుకోవాలి. అందరు దర్శకులతో పనిచేయాలన్నదే నా సిద్ధాంతం.

... నరేష్ నెల్కి

సీఎం ప్రవీణ్‌కుమార్

వంట చిట్కాలు

- ఫ్రూట్ సలాడ్‌పై కొంచెం నిమ్మరసం వేసి ఉంచితే చాలా కాలం నిల్వ ఉంటుంది.
- ఫ్రిజ్‌లో ఉంచిన నిమ్మకాయను పది నిమిషాలు వేడి నీటిలో ఉంచి కోస్తే రసం బాగా వస్తుంది.
- టీ డికాషిన్‌లో పాలు పోసినప్పుడు నారింజ రంగులోనికి మారితే కల్తీ పొడని, గోధుమ రంగు వస్తే మంచి పొడని గుర్తించండి.
- బొంబాయి రవ్వ, టీ పొడిలో చిన్న అయస్కాంతాన్ని ఉంచితే అందులో ఉన్న ఇనుప రజను కల్తీ ఉంటే దానికి అంటుకుంటుంది.
- తెల్లబెల్లంలో సల్ఫర్ ఎక్కువగా ఉంటుంది. కాబట్టి నల్ల బెల్లం వాడడం మంచిది.
- కందిపప్పు త్వరగా పాడవ్వకుండా ఉండాలంటే ఎండు కొబ్బరిచిప్పను డబ్బాలో ఉంచండి.



మరో శిఖరమెక్కిన అరుణిమ!



కావాల్సినంత గుర్తింపు వచ్చిన తర్వాత చాలామంది ఆగిపోతారు. ఇక చాల్లే అనుకుంటారు. కానీ.. కొందరు మాత్రం మరో విజయం కోసం అగ్నిపర్వతంలా రగులుతూనే ఉంటారు. ఆ కోవకు చెందినదే అరుణిమ సిన్హా. ఖండాలు దాటి, శిఖరాలు అధిరోహించి మరో రికార్డు సృష్టించింది.

ఎవరెస్ట్ శిఖరం అధిరోహించిన మొదటి దివ్యాంగురాలిగా 2013లో రికార్డు సృష్టించి ప్రపంచాన్ని నివ్వెరపరిచింది అరుణిమ. ఇప్పుడు మరో శిఖరం అధిరోహించి సరికొత్త రికార్డు తన పేరిట రాసుకున్నది. అంటార్కిటికాలోని అత్యంత ఎత్తైన పర్వతం మౌంట్ విన్సన్‌ను అధిరోహించింది అరుణిమ. 4897 మీటర్ల ఎత్తున్న ఈ శిఖరంపైకి మైనస్ జీరో డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో ఎక్కి మువ్వన్నెల జెండా ఎగురవేసింది. తన వైకల్యాన్ని ధిక్కరించి ఆత్మవిశ్వాసంతో శిఖరం అంచులకు చేరింది. ఉత్తరప్రదేశ్‌లోని అంబేద్కర్ జిల్లాలో జన్మించిన అరుణిమ జాతీయస్థాయిలో ఫుట్‌బాల్, వాలీబాల్ క్రీడాకారిణి. అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతున్న క్రమంలో ఓ ప్రమాదంలో కాలును కోల్పోయింది. ఆ ప్రమాదం ఆమెను ఆటకు దూరం చేసింది. కానీ ఆమె మనసు మాత్రం ఏదో చేయాలనే తహతహలాడేది. దేశం నా గురించి చర్చించుకోవాలి అని ఆలోచించింది. అంతే ఎవరెస్ట్ పర్వతాధిరోహణ గురించి తెలుసుకున్నది. అప్పటి వరకు వైకల్యంతో బాధపడుతున్న ఎవరూ ఎవరెస్ట్ ఎక్కలేదని తెలుసుకున్నది. అంతే.. తొలిసారి ఎవరెస్ట్ ఎక్కిన మహిళ అయిన బిచేంద్రిపాల్ దగ్గర ట్రైనింగ్ తీసుకున్నది. ఏడాది కాలం పాటు కఠిన శిక్షణ తర్వాత ఎవరెస్ట్ ఎక్కి రికార్డు సృష్టించింది. మళ్లీ ఇప్పుడు మౌంట్ విన్సన్ పర్వతం ఎక్కి దేశ ఖ్యాతిని మరోసారి ఖండాలు దాటించింది.

సిరిముగ్గు

17 చుక్కలు
3 వరుసలు
3 వచ్చేవరకు



మీరు ముగ్గులు పంపాల్సిన మా చిరునామా:

సిరి ముగ్గు, నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9,
కృష్ణాపురం, బంజారాహిల్స్,
రోడ్ నెం - 10, హైదరాబాద్ - 500034.
zindagi.nt@gmail.com



సునేత్రి బూర్గుల
విరాట్ నగర్,
హైదరాబాద్

నమస్తే తెలంగాణ
సింగిడి
[హైదరాబాద్]
ఆదివారం 6 జనవరి 2019

ఫిట్‌నెస్‌తో వచ్చేందుకు!

ఈ కొత్త ఏడాది రిజల్యూషన్‌లో ఫిట్‌నెస్ ఉందా? మీకు స్ఫూర్తి కలిగించే వారి కోసం వెతుకుతున్నారా? అయితే బాలీవుడ్ సుందరి దీపిక పదుకొనె చేస్తున్న ఈ వర్కౌట్ వీడియోను చూడండి. వావ్ దీపికా.. అనకుండా ఉండలేరు.





మూవీ సెలబ్రిటీలు ఫిట్‌నెస్‌కు చాలా ఇంపార్టెన్స్ ఇస్తుంటారు. ఎంత తింటున్నాం.. ఎంత కొవ్వుని కరిగిస్తున్నామని లెక్కలు వేసుకుంటూ రోజూ గంటల తరబడి జిమ్‌లో వర్కౌట్స్ చేస్తుంటారు. తమ ఫిట్‌నెస్‌ను చాటుకోవడంతో పాటు ఫ్యాన్స్‌లోనూ స్ఫూర్తిని రగిలించేలా సోషల్‌మీడియాలో తమ వర్కౌట్స్‌కి సంబంధించిన వీడియోలను పోస్ట్ చేస్తుంటారు. తమ అభిమాన తారల అందాల వెనుక ఇంత కష్టం ఉందన్న విషయం ఈ వర్కౌట్స్ ద్వారానే వారి ఫ్యాన్స్‌కు తెలుస్తుంది. ఇటీవల పెండ్లి చేసుకున్న దీపిక లేటెస్ట్‌గా కపిల్ శర్మ వివాహ రిసెప్షన్, జోయ అక్తర్ క్రిస్మస్ పార్టీలో తళుక్కుమంది. పెండ్లి, పార్టీలతో కాస్త బరువెక్కిందో ఏమోకానీ ఇప్పుడు ఎక్స్‌ట్రా క్యాలరీలను కరిగించే పనిలో పడింది. తన కొత్త వర్కౌట్స్‌కు సంబంధించిన వీడియోలో దీపిక మెట్లు వేగంగా ఎక్కుతూ, దిగుతూ వర్కౌట్స్ చేస్తుంది. తన పర్సనల్ ఫిట్‌నెస్ ట్రైనర్ నమ్ పర్యవేక్షణలో దీపిక ఈ వర్కౌట్స్ చేస్తుంది. ఇందులో దీపిక పదుకొనె వేగం, సామర్థ్యాన్ని ఆమె ఫ్యాన్స్ తెగమెచ్చుకుంటున్నారు. దీపిక వర్కౌట్ వీడియో చూస్తే.. కొత్త సంవత్సరంలోనైనా ఫిట్‌నెస్‌పై కాస్త ఎక్కువ ధ్యాసపెట్టాలన్న స్ఫూర్తి అందరికీ కలుగుతుంది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



సాధారణంగా ఏ ఆటగాడైనా విషాదాన్ని చూసి భయపడడు. లక్ష్యసాధనలో ఎన్నో సార్లు పడతాడు, లేస్తాడు, మళ్లీ పరిగెడతాడు, మళ్లీ పడతాడు లేస్తాడు. కానీ, వెనకడుగు వేయడు. అది అసలైన ఆటగానికి ఉండే స్ఫూర్తి. ఆ స్ఫూర్తితోనే చందీప్ సింగ్ దేశానికి పేరు తెచ్చాడు. ఇంతకీ ఇతను ఏం చేశాడో తెలుసా ?

విజయం బానిసైంది!

చందీప్ సింగ్‌ది జమ్ము కశ్మీర్. 11 యేండ్ల వయసులో అతను కరెంట్ షాక్‌కు గురయ్యాడు. సుమారు 11వేల వోల్టుల విద్యుత్ ప్రమాదం అది. డాక్టర్లు పరీక్షించి చేతులు పూర్తిగా తీసేయాలని చెప్పారు. ఫుట్‌బాల్ ఆటగాడిగా ఉన్న చందీప్ జీవితంలో ఈ ఘటనతో విషాదం చోటు చేసుకుంది. అయినా అతనూ, తల్లిదండ్రులు భయపడలేదు. చేతులు లేకుండా భవిష్యత్‌లో ఏం చేయొచ్చో ఆలోచించారు. చేతులు లేకుండా ఫుట్‌బాల్ ఆటలో రాణించటం కష్టం. అందుకు స్కేటింగ్‌ను ఎంచుకున్నాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పారా స్కేటింగ్‌లో చాంపియన్ అయ్యాడు. వంద మీటర్ల దూరాన్ని కేవలం 13.95 సెకన్లలో చేరుకుని తాజాగా ప్రపంచ రికార్డు సాధించాడు. ఇది కేవలం సెకన్ల వ్యవధిలో సాధించిన విజయం కాదు. స్కేటింగ్‌లో బ్యాలెన్సింగ్ ముఖ్యం. దాని కోసం తీవ్ర కసరత్తు చేశాడు. విషాదాన్ని తల్చుకుంటూ ఎన్నో రోజులు ఏడ్చాడు. వందల సార్లు పడ్డాడు. అయినా తిరిగి లేచాడు. ఇంతటి క్రీడాస్ఫూర్తి ముందు విజయం తలవంచక తప్పలేదు. ఇప్పుడు చాంపియన్‌గా నిలబడ్డాడు. అంతటితో చందీప్ ఆగలేదు. తైక్వాండోలో చేరి యుద్ధ విద్యలు నేర్చుకున్నాడు. దక్షిణ కొరియాలో నిర్వహించిన తైక్వాండో చాంపియన్‌షిప్‌లో భారత్‌కు గోల్డ్ మెడల్స్ తెచ్చాడు. అంతకు ముందే వియత్నాంలో జరిగిన ఆసియా, అంతర్జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్స్ సాధించాడు. నిజానికి ఈ రెండు క్రీడల్లో చేతులు తప్పనిసరి. కానీ, వాటి అవసరం లేకుండానే చందీప్ దేశం గర్వపడేలా చేశాడు.



అభిమానం కాదు అంతకు మించి!

ఓ ఇంటిరియర్ డిజైనర్ తన శరీరమంతా టాటూలు వేయించుకుని అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాడు. టాటూలు అంటే మామూలు టాటూలు కాదు. భారత ఆర్మీలో అమరులైన వీర జవాన్ల పేర్లు అవి. వాటితో పాటుగా భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అసువులు బాసిన పోరాట యోధుల ఫొటోలూ వేయించుకున్నాడు.

కశ్మీర్‌కు చెందిన గౌతమ్ చౌదరి అనే వ్యక్తి తన శరీరంపై 593 టాటూలు వేయించుకున్నాడు. అందులో 560 కార్గిల్‌లో మృతి చెందిన వారి పేర్లు. మిగతావి స్వాతంత్ర్య సమర యోధుల పేర్లు. ఎవరైనా అభిమానాన్ని చాటుకోవడానికి పేరును టాటూగా వేయిస్తారు. కానీ, గౌతమ్‌ది అభిమానం కాదు.. అది తన దేశభక్తి. అదే అమరులకు అర్పించే నివాళి అంటాడు. ఇలా టాటూలు వెయించుకోవడానికి తనకు ఎనిమిది రోజులు పట్టిందట. రోజుకూ ఆరు గంటలు కష్టపడ్డాడు. దీని కోసం డాక్టర్ సలహా కూడా తీసుకుని టాటూలు వేయించుకున్నాడు. అయితే ఇంతలా తన దేశభక్తి చాటుకోవడానికి కారణాలేంటని అడిగితే.. ఒక రోజు కశ్మీర్‌లోని లడఖ్ జిల్లాలో మిత్రులతో కలిసి పర్యటిస్తున్నప్పుడు ప్రమాదం జరిగిందట. ఈ ప్రమాదంలో అతని మిత్రుడ్ని అక్కడున్న జవాన్లు రక్షించారనీ చెప్తున్నాడు. అలాగే 'మన కోసం సైనికులు ఉన్నారు, మనల్ని ఎల్లప్పుడూ రక్షించడానికి వారు విధుల్లో కష్టపడుతున్నారు' అంటూ వాళ్లకోసం ఏదైనా చేయాలనుకున్నాడు. జవాన్ల గొప్పతనం తెలుసుకొని ఇలా తన నివాళిని అర్పించాడు గౌతమ్. 'నిజానికి దేశభక్తి అంటే జనవరి 26న, ఆగస్టు15న, పాకిస్తాన్-ఇండియా మ్యాచ్‌లో ప్రదర్శించేది కాదు. అది నిరంతరం ఉండాలి. ఈ టాటూల వల్ల నా దేశభక్తిని, దేశంపట్ల నా కర్తవ్యాన్ని రోజూ గుర్తు చేసుకుంటాను' అంటున్నాడు గౌతమ్.

ఆడబిడ్డ రక్షణ కోసం!

అదో అమానుషకాండ. దేశం మొత్తం కన్నీరు కార్చిన ఘటన. మానవ మృగాలు కామంతో కొవ్వెక్కి.. ఓ ఆడబిడ్డను దారుణాతి దారుణంగా చెరిపి, చంపిన నిర్భయ దుర్ఘటన. ఆ ఘటన వార్త విని అందిరిలాగే తానూ కన్నీళ్లు పెట్టుకున్నాడు. 'ఇలాంటి వాటిని ఆపేందుకు ఏం చెయ్యలేమా?.. నలుగురికైనా ఆడపిల్ల విలువ చెప్పలేమా?' అంటూ తనతోనే సంభాషణ మొదలెట్టాడు. సంఘర్షణ మొదలైంది. ఎవరో రావాలి! ఏదో చెయ్యాలి! మార్పు తీసుకురావాలి! అని ఎదురుచూడలేదు. ఆడపిల్ల బతుకు కోసం తన కుంచెను కదిపాడు. 'సేవ్ గర్ల్ చైల్డ్' అంటూ ఎంతోమంది హృదయాలను కదిలిస్తున్నాడు.











బిడ్డగా.. తోబుట్టువుగా, స్నేహితురాలిగా, భార్యగా, కోడలిగా, అమ్మగా.. ఓ స్త్రీ పాత్ర సమాజంలో వెలకట్టలేనిది. అలాంటిది కొందరు ఆడబిడ్డను పురిట్లోనే చంపేస్తున్నారు. ఒకవేళ తల్లిదండ్రులు తమ బిడ్డను ప్రేమగా పెంచుకొని కాపాడుతున్నా.. వయసొచ్చేనాటికి మానవ మృగాలు వదలడం లేదు. వెరసి.. స్త్రీ సమాజంలో బతికేందుకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నది. మనిషి మృగంలా కాకుండా.. మనిషిగా మారితే ఎన్ని అద్భుతాలు చెయ్యొచ్చో తన కుంచె ద్వారా చెబుతున్నాడు చిత్రకారుడు తుపాకుల మహేశ్ (రామాంజినేయరెడ్డి). కుంచెతోనే సమాజంలో మార్పు కోసం ప్రయత్నిస్తున్నాడు. ఆడపిల్లను ఇష్టంగా చదివించి.. పూర్తి స్వేచ్ఛనిస్తే.. దేశ గతిని మార్చి ప్రగతి పథంలో నడిపించే సారథులవుతారని దృఢంగా నమ్ముతున్న వ్యక్తి మహేశ్. అందుకే ఆడపిల్ల బతుకు కోసం తన కుంచెను ప్రచారంగా వాడుతున్నాడు. ఆయా రంగాల్లో నిస్వార్థంగా సేవ చేస్తూ.. గుర్తింపు తెచ్చుకున్న వారిని కలిసి, తద్వారా 'సేవ్ గర్ల్ చైల్డ్' నినాదాన్ని మరింత బలపరుస్తున్నాడు.

మహేశ్ ఏం చేస్తాడంటే?

'సేవ్ గర్ల్' నినాదాన్ని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు చిత్రకళను ఎంచుకున్నాడు మహేశ్. ఈ సమాజంలో నలుగురి మంచికోరే వ్యక్తులు, మంచి పనులు చేస్తున్నవారు, రాజకీయ, సినీ, క్రీడా, విద్యా, సామాజిక రంగాల్లో ఆదర్శవంతంగా ఉన్న వారికి.. వారి బొమ్మను పెయింటింగ్‌గా వేసి ఇస్తుంటాడు. దానికి అందమైన ఫ్రేమ్ కట్టి.. ఆ పెయింటింగ్‌పై 'సేవ్ గర్ల్ చైల్డ్' లోగోను వేసి వారికి ఇస్తుంటాడు. అదికూడా పూర్తిగా ఉచితంగా. మీడియా, సోషల్ మీడియా, తెలిసిన వ్యక్తుల ద్వారా వారి గొప్పతనాన్ని తెలుసుకొని.. వారి కాంటాక్ట్ సంపాదిస్తాడు. వారికి తన లక్ష్యాన్ని చెప్పి.. వారి ఫొటో తీసుకుంటాడు. వారి అనుమతితో అందమైన పెయింటింగ్ వేస్తాడు. ఫలాన రోజు ఇస్తానని చెప్పి.. అ సమయానికి అందజేస్తాడు. ఇలా చేస్తున్నందుకు ఎక్కడా, ఎవ్వరినీ రూపాయి ఆశించడు మహేశ్. అంతా ఉచితంగానే చేస్తాడు. 'ఎందుకు ఇలా చేస్తున్నావ్' అని ఎవరైనా అడిగితే.. 'వారి ద్వారా ఒక్క ఆడపిల్ల బతికినా చాలు. నా లక్ష్యం నెరవేరినట్లే' అంటాడు. ఒక బొమ్మ గీసేందుకు అయ్యే పెయింటింగ్, కుంచె, ఫ్రేమ్, గ్లాస్.. వగైరా ఖర్చులన్నీ తానే సొంతంగా భరిస్తాడు. అంతేకాదు.. ఆ పెయింటింగ్ వారికి ఇచ్చేందుకు వెళ్లడానికి అయ్యే రవాణా, ఫుడ్ ఖర్చులన్నీ తనయే. ఎవ్వరినీ చేయిచాచి డబ్బులు అడగడు. అంతటి చిత్తశుద్ధితో పనిచేస్తున్నాడు మహేశ్.

భార్యను ఎమ్మార్వో చేయించాడు!



ఆడపిల్లలు చదువు విషయంలో ఎంత చురుగ్గా ఉంటారో తన కుటుంబమే ఓ ఉదాహరణ అంటాడు మహేష్. తన భార్య ఇంటర్ తర్వాత చదువు ఆపేయాల్సి వచ్చింది. దీంతో డిగ్రీలో జాయిన్ చేయించాడు. భర్త కష్టాన్ని తెలుసుకున్న ఆమె ఇష్టంతో చదివి ఫస్ట్ క్లాస్‌లో పాసైంది. తర్వాత పీజీలో మైక్రోబయోలజీ 4వ ర్యాంకులో పాసైంది. 2012 పోటీ పరీక్షల్లో ఎమ్మార్వోగా ఉద్యోగం సంపాదించింది. ఇంటర్ చదువుతున్న తన కూతురిని.. ఆమెకు ఇష్టమైన ఇస్రోలో ఉద్యోగం సంపాదించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నాడు. మొదట్లో భార్యను చదివిస్తున్నప్పుడు, ఇప్పుడు అధికారులను కలిసేటప్పుడు ఎన్నో రకాలుగా అవమానాలను ఎదుర్కొన్నాడు మహేశ్. అయినా అవేమీ పట్టించుకోకుండా ధైర్యంగా నిలబడ్డాడు కాబట్టే.. నలుగురు చెప్పుకునే శక్తిలా మారాడు. ఈ ప్రాజెక్ట్‌లో సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు చెబుతున్నాడు.

స్ఫూర్తిదాతలే ప్రచార సారథులు!

మన హైదరాబాద్‌లో తాజాగా జరిగిన సంఘటనే ఓ ఉదాహరణ. మద్యం మత్తులోన్న ఓ యాచకురాలు తన బిడ్డకు పాలు ఇవ్వలేని స్థితిలో ఉంది. తన భర్త ద్వారా విషయం తెలుసుకున్న లేడీ కానిస్టేబుల్ ప్రియాంక.. స్టేషన్‌కు వెళ్లి ఆ పాపకు పాలిచ్చి ప్రాణం నిలబెట్టింది. ఇలా సమాజానికి ఆదర్శవంతంగా ఉన్నవారిని ఎంచుకొని వారి బొమ్మను పెయింటింగ్ వేసి ఇస్తుంటాడు మహేశ్. ఈ జాబితాలో సామాన్యుడి నుంచి ఆయా రంగాల్లో నిష్ణాతులైన వారూ ఉన్నారు. ఇప్పటి వరకు దాదాపు 200లకుపైగా ప్రముఖులకు వారి బొమ్మలతో కూడిన పెయింటింగ్స్ అందించాడు. అంతేకాకుండా ఆదర్శవంతంగా పనిచేస్తున్న 100 మంది ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లకు కూడా పెయింటింగ్స్ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఇంకా ఇవ్వాల్సినవి 300 పెయింటింగ్స్ తన దగ్గర ఉన్నాయి. 'సమాజంలోని ఆడపిల్లలను చదివించాలి. వారిపై వివక్షను దూరం చేయాలన్నదే నా తపన. అందుకే నాకు తెలిసిన చిత్రకళను ఓ మార్గంగా ఎంచుకున్నా' అంటున్నాడు మహేశ్. 'నీ ఆటోగ్రాఫ్ తీసుకొనే రోజు త్వరలో రావాలని ఆశిస్తున్నా' అంటూ సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్న మాటలు.. తనకెంతో స్ఫూర్తినిచ్చాయని అంటున్నాడు. పెద్దా, చిన్నా తారతమ్యం లేకుండా వారందరినీ ఈ ప్రచారంలో భాగస్వాములను చేస్తున్నాడు.

మార్పు తన నుంచే..

కడప జిల్లా ముద్దనూరు మండలం, చిన్న దుద్యాలలో పుట్టాడు మహేశ్. ఆడిపాడే ఐదేండ్ల వయసులోనే పోలియో కాటేసింది. గ్రామంలో తాగునీరు సరిగా లేకపోవడంతో అక్కడున్న చాలామందికి పోలియో సోకింది. వారిలో మహేశ్ ఒక్కడే నడవగలిగి, తన పనులు తాను చేసుకుంటూ ఉంటున్నాడు. పుట్టింది రెడ్డి కుటుంబంలోనే అయినా.. ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడ్డాడు. తండ్రి పేదరైతు. చిన్నప్పుడు కుటుంబం గడిచేందుకు కట్టెలు కొట్టి అమ్మేవాడు. బడికి వెళ్తూనే దసరా సెలవుల్లో పనులకు వెళ్లేవాడు. దీంతో చదువు అబ్బలేదు. అనారోగ్యం కారణంగా తమ్ముడు చనిపోవడంతో ఉన్న భూమిని కూడా అమ్ముకోవాల్సి వచ్చింది. దీంతో 40 కిలోమీటర్లు సైకిల్‌పై ముద్దనూరుకు వెళ్లి బేల్దార్(తాపీ) పనులు చేసేవాడు. ఆ తర్వాత ఎర్రగుంట్ల దగ్గర్లోని థర్మల్ ప్లాంట్‌లో పనికి వెళ్లాడు. అయితే, ప్లాంట్‌లో పనిచేసేటప్పుడు తోటి పనివారి ఒత్తిడి మేరకు దొంగతనం చేయాల్సి వచ్చింది. ఉగాది పండుగ సమీపిస్తుండడం, చేతిలో డబ్బులు లేకపోవడంతో దొంగగా మారాడు. అదేదో పెద్ద దొంగతనం కూడా కాదు.. నాలుగు వైర్లు అమ్మితే రూ.1000 వస్తాయి. వాటిని అమ్మడానికి తీసుకెళ్లిన వ్యక్తి.. తిరిగి రాలేదు. అప్పుడే కష్టపడి సంపాదించుకోవాలనే ఆలోచన వచ్చింది. అదే మార్పు అతన్ని మహర్షిని చేసింది. చేసిన తప్పు తెలుసుకున్నాడు. వెంకట్ మాస్టర్, మరో ఇద్దరి దగ్గర పెయింటింగ్ ఇష్టంతో నేర్చుకున్నాడు. పెద్ద చిత్రకారుడు అయ్యాడు. ఇప్పుడు అదే థర్మల్ ప్లాంట్‌లో పనిచేస్తున్న సీఈఓకు కూడా తన పెయింటింగ్ ఇచ్చే పనిలో ఉన్నాడు మహేశ్. పెద్దగా చదువుకోకపోయినా.. చిత్రకళలో రాణిస్తున్నాడు.

కేసీఆర్ కోసం సైకిల్‌పై వస్తా..

తెలంగాణ ముఖ్యమంత్రి గారిది మొండిపట్టుదల. యాదానికైనా ఆ సామి సిద్దంగా ఉంటడు. అసుంటి గొప్ప మనిషిని కలిసేందుకు మూడేండ్ల సంది సూస్తుండా. ఆ సామి బిడ్డ కేటీఆరూ.. తండ్రికి తగ్గ బిడ్డ. శానా మంచి మనసుంది ఆ అబ్బికి. వారికి ఈడగూడ అభిమానులుండారు. కేసీఆర్ సార్‌ని కలిసే గొప్ప అవకాశం వస్తే.. కడప నుంచి సైకిల్ తొక్కుకుంటా వస్తా. ఆయన సేసే పనులన్నీ బాగుండాయి. ఆయన మాటతీరు నచ్చుతది. ఆడబిడ్డ బతుకుకు రక్షణ కల్పిస్తూ.. దండిగా పనులు చేయిస్తా ఉండారు. ఆయన కోసం మంచి పెయింటింగ్ వేసినా. అవకాశం కోసం సూస్తుండా. నలుగురికి మంచిచేసే వ్యక్తులు గురించి మీకు తెలిస్తే.. 9866913354 నంబర్‌కు ఫోన్ చెయ్యండి.

– తుపాకుల మహేశ్, సేవ్ గర్ల్ చైల్డ్ ప్రచారకర్త

... డప్పు రవి

సుడోకు

డైలీ సుడోకు 28 సమాధానం

7	9	8	1	2	5	3	4	6
1	6	3	7	9	4	8	5	2
2	4	5	8	3	6	9	1	7
8	1	2	9	4	7	6	3	5
9	3	7	6	5	2	4	8	1
4	5	6	3	8	1	7	2	9
3	7	9	2	1	8	5	6	4
5	8	1	4	6	9	2	7	3
6	2	4	5	7	3	1	9	8

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -29

				6				
2					8	6	1	
		7	9	2		8		4
4		2			5			1
				8		3	6	
1			7				8	5
	1				3	9		
							4	
	5		8	1				

ట్వీట్



రామ్‌గోపాల్ వర్మ
@RGVzoomin

మీ చుట్టూ ఎంత మంది ఉన్నా ఒంటరిగా ఉన్నట్టు భావిస్తున్నారా..? అయితే హర్రర్ సినిమాలు చూడండి. మీ పక్కన ఎవరూ లేకున్నా చాలా మంది ఉన్నట్టు అనిపిస్తుంది.

వర్మను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య 3,287,096

కామన్‌మ్యాన్ వాయిస్

పూజలు చేస్తే పిల్లలు పుడతారు అని నమ్మినప్పుడు.. పిల్లలు వద్దు అనుకున్నప్పుడు కూడా పూజ చేయొచ్చు కదా.. అబార్షన్స్ ఎందుకు?

–Karthik

హుందాతనం అంటే ఏమీ లేదు. ఒంటరిగా మహిళల్ని పట్టుకుని దుక్కలా ఉన్నావు అనడం, మహిళల్ని బెదిరిస్తూ మాతో పెట్టుకుంటే ఫినిష్ అయిపోతావ్. బయట కనిపిస్తే కొడతారు అనడం. అంతేనా?

–Kris Posts

ఆర్థిక అభివృద్ధిపరంగా చూపించడానికి ఏమీ లేనప్పుడు, మతపరమైన విశ్వాసాల గురించి చర్చ లేవదీయడం రాజకీయ వ్యూహాల్లో భాగమే ఈ మత కల్లోలాలు.

–Harish Azad

వైరల్ వీడియో



వీరనారి ఝాన్సీలక్ష్మీ బాయి జీవిత చరిత్ర తెరపైకి వస్తున్నది. కంగనా రనౌత్ మణికర్ణికగా ఆమె పాత్రను పోషిస్తున్నది. ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్ యూట్యూబ్ ట్రెండింగ్ వీడియోగా నిలిచింది.

Manikarnika – The Queen Of Jhansi | Official Telugu Trailer | Kangana Ranaut | 25th January

Total views : 581,402+

Published on Jan 3, 2019



బాలకృష్ణ

తెలుగు సినీ, రాజకీయ యవనికపై శిఖరసమానుడిగా కీర్తింపబడ్డారు దివంగత ఎన్టీఆర్. తొలి తెలుగు సూపర్‌స్టార్‌గా అశేష అభిమానుల నీరాజనాలందుకున్నారు. ఆయన జీవిత చరిత్రను వెండితెర దృశ్యమానం చేస్తూ రూపొందిస్తున్న చిత్రం 'ఎన్టీఆర్'. ఆయన తనయుడు బాలకృష్ణ టైటిల్ రోల్‌ని పోషిస్తున్నారు. క్రిష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కథానాయకుడు, మహానాయకుడు అనే రెండు భాగాలుగా తెరకెక్కించారు. 'ఎన్టీఆర్ కథానాయకుడు' ఈ నెల9 న ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా నందమూరి బాలకృష్ణ 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా సంభాషించారు.

ఎవరైనా సరే నన్ను ఫాలో కావాల్సిందే!

'ఎన్టీఆర్' బయోపిక్‌కు అంకురార్పణ ఎలా జరిగింది?

• ప్రాచీన ఆంధ్ర చరిత్ర సృష్టికర్త గౌతమి పుత్ర శాతకర్ణి అయితే, ఆధునిక ఆంధ్ర చరిత్ర సృష్టికర్త నందమూరి తారకరామారావుగారు. నాన్నగారు పోషించిన పౌరాణిక పాత్రలు కొన్నింటిని నేనూ చేయాలనే కోరిక బలంగా ఉండేది. కానీ ఆయన జీవిత చరిత్ర చేస్తానని ఎప్పుడూ అనుకోలేదు. ఓసారి నాన్నగారి స్వస్థలం నిమ్మకూరు వెళ్లినప్పుడు ఆ ఆలోచన కలిగింది. ఆ ఊరు స్థలమహిమో, లేదా అమ్మానాన్నల దీవెనల బలమో కాకతాళీయంగా ఈ బయోపిక్‌కు శ్రీకారం చుట్టడం జరిగింది.

తండ్రి జీవిత కథ చిత్రంలో ఆయన తనయుడు కథానాయకుడిగా నటించడం భారతదేశ చరిత్రలోనే ప్రథమం. ఈ అరుదైన ఘనత సాధించడం ఎలా అనిపిస్తున్నది?

• గౌతమి పుత్ర శాతకర్ణి కథ ఆధారంగా సినిమా చేయాలని నాన్నగారు ఒకప్పుడు అనుకున్నారు. ఎందుకో గానీ అది కార్యరూపం దాల్చలేదు. ఆ సినిమా చేసే అదృష్టం నాకు దక్కింది. ఒకే ధోరణిలో సాగే మూస సినిమాలు కాకుండా ట్రెండ్ సెట్ చేసే సినిమాలు చేయాలన్నది నా ఆశయం. తెలుగులో ఫ్యాక్షన్ సినిమాల ఒరవడి నాతోనే మొదలైంది. ఇప్పుడు ఎన్టీఆర్ వంటి మహనీయుడి బయోపిక్ చేయడం ఆనందంగా ఉంది. ఎన్టీఆర్‌గారిది విస్తృతమైన జీవితం. ఆయన కేవలం ఒకే పార్శ్వానికి పరిమితమైపోలేదు. సినిమా, రాజకీయం, ప్రజాసేవ...ఇలా బహుముఖరంగాల్లో ఆయన ప్రభావశీలిగా ఉన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి జీవితకథలో నటించడం పూర్వజన్మసుకృతంగా భావిస్తున్నాను.

• బసవతారకం పాత్ర కోసం విద్యాబాలన్ ఎంతో పరిశోధన చేసింది. మా కుటుంబ సభ్యులందరిని కలిసి అమ్మగారి గురించి ఎన్నో విషయాలు తెలుసుకుంది. అందుకే బసవతారకం పాత్రలో అద్భుతంగా రాణించిందామె.

ఈ సినిమాలో మీరు ఎన్టీఆర్ పోషించిన కొన్ని పాత్రల్లో కనిపించబోతున్నారని తెలిసింది. వాటికోసం ఎలాంటి కసరత్తులు చేశారు?

• ఎన్టీఆర్‌గారు నాకు కేవలం తండ్రి మాత్రమే కాదు.. గురువు, దైవం అన్నీ ఆయనే. అందుకే ఈ సినిమాకు ఏదీ కష్టమనిపించలేదు. చిన్నప్పటి నుంచి నాన్నగారి సినిమాలు చూస్తూ పెరిగాను కాబట్టి ఆయన పాత్రలు చేయడం ఏమాత్రం ఇబ్బందిగా అనిపించలేదు. ప్రతి పాత్రను మనసారా ఆస్వాదించాను. ఈ సినిమాలో ప్రతి పాత్రకు నటులందరూ దేవుడు తెచ్చి పెట్టిన చందంగా అద్భుతంగా కుదిరారు. విద్యాబాలన్, రానా, సుమంత్, కల్యాణ్‌రామ్, రకుల్‌ప్రీత్‌సింగ్, ప్రణీత ఇలా ప్రతి ఒక్కరు తమ పాత్రల్లో చక్కగా ఒదిగిపోయారు. సహజత్వం కోసం సురభి నాటక కళాపరిషత్తు నుంచి కొందరిని తీసుకొని నటింపజేశాం.


ఆరంభంలోనే రెండు భాగాలుగా ఈ సినిమా చేద్దామనుకున్నారా?

• తొలుత రెండో భాగం ఆలోచనే లేదు. 'ఒక పార్ట్‌లో నాన్నగారి జీవితచరిత్రకు న్యాయం చేయలేం బాబు..రెండో పార్ట్ చేద్దాం' అని క్రిష్ అడిగారు. కథానాయకుడు, మహానాయకుడు అనే టైటిల్స్‌ను కూడా ఆయనే సూచించారు. దైవబలం, సంకల్పసిద్ధి వల్ల సినిమాను రెండు భాగాలుగా తీయడం సాధ్యమైంది. మరో విషయమేమిటంటే వ్యాపార ప్రయోజనాలను ఆశించి ఈ సినిమా తీయలేదు. ఫలానా రేంజ్‌లో తీయాలనే లెక్కలు కూడా వేసుకోలేదు.

• ఫలితం ఎప్పుడైనా వస్తుంది కానీ మనం ప్రయత్నం మొదలుపెట్టాలి. తెలుగు సినిమా బొమ్మ అంతర్జాతీయ యవనికపై మెరవాలన్నది నాన్నగారి ఆశయం. అదే సంకల్పంతో ఈ సినిమా కోసం శ్రమించాను.

ఇండస్ట్రీకి ఎన్టీఆర్, ఏఎన్నార్ రెండు కళ్లలాంటివారు. ఈ సినిమాలో ఏఎన్నార్‌గారి పాత్ర చిత్రణ ఎంతవరకు ఉంటుంది?

• ఏఎన్నార్‌ను మేమంతా బాబాయ్ అనే సంబోధించేవాళ్లం. ఏఎన్నార్‌గారి తల్లిగారు అక్కినేని పున్నమ్మను మరో నానమ్మగా భావించేవాళ్లం. పున్నమ్మగారు మా నాన్నను తన పెద్దకొడుకు అని పిలుచుకునేది. అక్కినేని కుటుంబాన్ని నాన్నగారు సొంత ఇంటి మనుషులే అనుకునేవారు. అంతటి గొప్ప బాంధవ్యం మాది. ఈ సినిమాలో ఏఎన్నార్ పాత్రను సుమంత్ అద్భుతంగా పోషించాడు.



ఈ సినిమాతో నిర్మాతగా మారడం ఎలాంటి అనుభూతినిచ్చింది?

• ఏది ఎప్పుడు జరగాలో అప్పుడే జరుగుతుంది. బ్రహ్మతేజ ప్రొడక్షన్స్ అనే సంస్థ పేరును రిజిష్టర్ చేయించి ఎప్పుడో సినిమా చేద్దామనుకున్నాను. చిత్ర నిర్మాణానికి కావాల్సిన అన్ని హంగులుండి సినిమా తీయలేకపోయాను. ఇప్పుడు విధి లిఖితంలా నాన్నగారి బయోపిక్‌తో నిర్మాతగా మారాను. నాన్నగారి బయోపిక్ చేస్తానని లైఫ్‌లో ఎప్పుడూ అనుకోలేదు. ఈ సినిమా స్టిల్స్, ట్రైలర్స్ చూసిన వారు నేను అచ్చు రామారావులాగానే వున్నాడంటున్నారు. నాన్నగారి తర్వాత 'ఆదిత్య 369' వంటి ఫాంటసీ సినిమాల్ని నేనే చేశాను. పౌరాణిక, చారిత్రక ఇతివృత్తాల్ని ఎంచుకొని చక్కటి సినిమాలు చేయాలన్నది నా అభిమతం. ఆ తరహా సినిమాలు చేయాలనే లక్ష్యంతో నిర్మాతగా ప్రయాణం ఆరంభించాను. తెలుగు చిత్రసీమలో ట్రెండ్‌సెట్టర్స్ మేమే. ట్రెండ్ విషయంలో ఎవరైనా సరే నన్ను ఫాలో కావాల్సిందే.

వ్యక్తిగతంగా జీవితాన్ని మీరు ఎలా ఆస్వాదిస్తారు?

• నా జీవితమంతా ఓపెన్‌బుక్. నాకు తోచినట్లుగా జీవితాన్ని గడుపుతాను. కొందరు నన్ను ముక్కోపి అంటారు. అలాంటి మాటల్ని అస్సలు లెక్కచేయను. హీరోలు బయట విగ్ తీయడానికి సంశయిస్తారు. కానీ నేను అలాంటి వాటిని పట్టించుకోను. ఎన్నో సందర్భాల్లో విగ్ తీసి కనిపించాను. దానివల్ల ఏమైనా నష్టం జరిగిందా? నా సినిమాలు ఏమైనా ఫ్లాప్ అయ్యాయా? షూటింగ్ లొకేషన్లలో విగ్ తీసినప్పుడు కొందరు జనాలు నవ్వేవారు. అలాంటి విషయాల్ని తేలిగ్గా తీసుకుంటాను. ఇక క్రమశిక్షణ, సమయపాలన అనే అంశాల్ని నాన్నగారి దగ్గరి నుంచి నేర్చుకున్నాను. ఆయనలాగే నేను ఉదయం నాలుగుగంటలలోపే నిద్రలేస్తాను. ఏ పనినైనా చెప్పిన టైమ్‌లో పూర్తి చేయాలని తపిస్తాను.

గన్‌షూటింగ్ ప్రాక్టీస్

గత ఏడాది బాలీవుడ్‌లో హ్యాట్రిక్ విజయాల్ని సొంతం చేసుకున్నది తాప్సీ. ఆమె కథానాయికగా నటించిన సూర్మ, మన్‌మర్జియాన్, ముల్క్ చిత్రాలు మంచి వసూళ్లను సాధించాయి. ఈ చిత్రాల్లో తాప్సీ అభినయానికి చక్కటి ప్రశంసలు లభించాయి. ఈ సక్సెస్‌లు అందించిన స్ఫూర్తితో మరిన్ని ప్రయోగాలపై దృష్టిసారిస్తున్నది ఈ పంజాబీ సొగసరి. తాప్సీ కథానాయికగా హిందీలో 'ఉమెనియాన్' పేరుతో ఓ సినిమా తెరకెక్కనున్నది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన చందూ తోమర్, ప్రకాశీ తోమర్ అనే సోదరీమణులు వృద్ధాప్యంలో షూటింగ్ క్రీడలో ప్రతిభను కనబరిచి వందకుపైగా పథకాలు సాధించారు. ఈ అక్కాచెల్లెల్ల జీవితాల ఆధారంగా రూపొందనున్న సినిమా కోసం ప్రస్తుతం తాప్సీ గన్ షూటింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నది. అంతర్జాతీయ క్రీడాకారుడి ఆధ్వర్యంలో షూటింగ్‌లో మెళకువలను నేర్చుకుంటున్నది. ఈ సినిమాలో తాప్సీ అరవై ఏళ్ల వయసు పైబడిన వృద్ధురాలిగా కనిపించబోతున్నట్లు తెలిసింది. హాలీవుడ్ ప్రోస్థటిక్ మేకప్ ఆర్టిస్ట్‌ల సహకారంతో ఆమె పాత్రను తీర్చిదిద్దనున్నారు. గ్రామీణ నేపథ్య కథాంశంతో తెరకెక్కనున్న ఈ చిత్రం ఫిబ్రవరి నెలలో సెట్స్‌పైకి రానుంది. అనురాగ్ కశ్యప్, శిభాషిష్ సర్కార్, నిధి పర్మార్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. తుషార్ హీరానందానీ దర్శకత్వం వహించనున్నారు.



తాప్సీ



విశ్వనాథ్, వినాయక్, ధృవ

యమ్6 రహస్యం!

ధ్రువ, శ్రావణి, అశ్విని, తిలక్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'యమ్6'. జైరామ్‌వర్మ దర్శకుడు. విశ్వనాథ్ ఫిలిం ఫ్యాక్టరీ, శ్రీలక్ష్మి వెంకటాద్రి క్రియేషన్స్ పతాకంపై విశ్వనాథ్ తన్నీరు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ట్రైలర్‌ని ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్ శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'వినాయక్‌గారు విడుదల చేసిన ట్రైలర్‌కు మంచి స్పందన లభిస్తున్నది. ఇదొక సస్పెన్స్ థ్రిల్లర్. ఆద్యంతం కొత్తగా ఉంటుంది. ఖర్చుకు వెనుకాడకుండా మంచి క్వాలిటీతో నిర్మించాం. కొత్తవాళ్లయిన ధ్రువ, అశ్విని అద్భుతంగా నటించారు. సరికొత్త నేపథ్యంలో ఆకట్టుకునే కథ, కథనాలతో రూపొందిన ఈ చిత్రం తప్పకుండా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది. కెమెరా, సంగీతం, యాక్షన్ సన్నివేశాలు చిత్రానికి హైలైట్‌గా నిలుస్తాయి. యమ్6 వెనకున్న రహస్యం ఏమిటన్నదే ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి చిత్రాన్ని త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అన్నారు. నా తొలి చిత్ర ట్రైలర్‌ను వి.వి.వినాయక్ వంటి ప్రముఖదర్శకుడు విడుదల చేయడం ఆనందాన్ని కలిగిస్తున్నది. ఈ చిత్రంలో అన్ని వర్గాలకు నచ్చే అంశాలన్ని ఉన్నాయి' అని హీరో ధ్రువ తెలిపారు.



రక్షిత్, నక్షత్ర

1978లో ఏం జరిగింది?

రక్షిత్ కథానాయకుడిగా నటించనున్న చిత్రం 'పలాస 1978'. తమ్మారెడ్డి భరద్వాజ సమర్పణలో అప్పారావు బెల్లన, అట్లూరి వరప్రసాద్ నిర్మించనున్నారు. కరుణ కుమార్ దర్శకుడు. నక్షత్ర కథానాయికగా పరిచయమవుతున్నది. ఫిబ్రవరి 9న రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. దర్శకుడు మాట్లాడుతూ 'యథార్థ ఘటనల ఆధారంగా రూపొందనున్న చిత్రమిది. ప్రేమ, వినోదం, భావోద్వేగాలు, సెంటిమెంట్ ప్రధానంగా సాగుతుంది' అని తెలిపారు. నిర్మాతలు మాట్లాడుతూ '1978లో పలాసలో ఓ ప్రేమజంటకు ఎదురైన పరిణామాలేమిటన్నది ఈ చిత్ర ఇతివృత్తం. సహజత్వానికి ప్రాధాన్యతనిస్తూ రూపొందిస్తున్నాం. 'లండన్‌బాబులు' ఫేమ్ రక్షిత్ హీరోగా నటిస్తున్నారు. దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ఈ చిత్రానికి సమర్పకుడిగా వ్యవహరిస్తుండటం ఆనందంగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో చిత్రీకరణ జరుపుతాం' అని అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: విన్సెంట్ అరుల్, సంగీతం: రఘు కుంచె, సాహిత్యం: భాస్కరభట్ల, లక్ష్మీభూపాల్, కూర్పు: కోటగిరి వెంకటేశ్వరరావు.

భయపెట్టే బంజార

నాగుల్ దర్శకత్వంలో వర్కింగ్ యాంట్స్ పతాకంపై రూపొందుతున్న చిత్రం 'బంజార'. కోయ రమేష్ బాబు నిర్మాత. అమృత, తేజేష్ వీర, హరీష్ గౌరి ప్రధాన పాత్రలను పోషిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. నిర్మాత మాట్లాడుతూ 'రొటీన్‌కు భిన్నమైన కథాంశంతో రూపుదిద్దుకున్న హారర్ చిత్రమిది. 'క్షుద్ర' చిత్రంతో ప్రతిభను చాటుకున్న దర్శకుడు నాగుల్ నవ్యమైన పాయింట్‌తో రూపొందించారు. తనకు జరిగిన అన్యాయంపై ఓ బంజార యువతి ఎలా ప్రతీకారం తీర్చుకున్నదన్నది ఆకట్టుకుంటుంది. కథలోని మలుపులు అలరిస్తాయి. తెలుగు, తమిళ భాషల్లో రూపొందించిన ఈ చిత్రాన్ని నెలాఖరున విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు.



అమృత



విజయ్, బాబీ, హరనాథ్‌బాబు

ధీవర ప్రేమకథ

నాగసాయి, విద్యా చైతన్య జంటగా నటిస్తున్న చిత్రం 'ధీవర'. కె. విజయ్ జక్కి దర్శకుడు. హరనాథ్ బాబు నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను దర్శకుడు బాబీ విడుదలచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'యువతను ఆకట్టుకునే కథాంశమిది. పోస్టర్ బాగుంది. యూనిట్ అందరికి ఈ చిత్రం మంచి పేరు తెచ్చిపెట్టాలి' అని తెలిపారు. దర్శకుడు మాట్లాడుతూ 'టైటిల్‌కు తగినట్లుగానే వైవిధ్యమైన కథ, కథనాలతో రూపొందుతున్న సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది. అంతర్లీనంగా చక్కటి ప్రేమకథ మిళితమై ఉంటుంది. ప్రేమ నుంచి ఎవరూ పారిపోలేరనే కాన్సెప్ట్ ఆధారంగా రూపొందిస్తున్నాం. రెండు జోనర్స్ కలయికగా ఆసక్తిని రేకెత్తిస్తుంది. స్క్రీన్‌ప్లే ప్రధానంగా సాగే ఈ చిత్రం వినూత్నమైన అనుభూతిని పంచుతుంది' అని చెప్పారు. 'యూత్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాల్ని జరుపుతున్నాం. త్వరలో చిత్ర గీతాలతో పాటు ట్రైలర్‌ను విడుదల చేస్తాం. ఫిబ్రవరి నెలాఖరున సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని నిర్మాత పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: అద్దంకి వెంకటేష్, సినిమాటోగ్రఫీ: సాగర్ గొల్లా.

నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం —

ఈఎస్ఐసీలో 329 ఖాళీలు

న్యూఢిల్లీలోని భారత కార్మిక మంత్రిత్వశాఖకు చెందిన ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) రీజియన్లలో ఖాళీగా ఉన్న గ్రేడ్-2 స్పెషలిస్ట్ (మెడికల్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.



- **మొత్తం ఖాళీలు:** 329
- **విభాగాలు:** కార్డియాలజీ, ఎండోక్రిమినాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, హెమటాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, ఆంకాలజీ, యూరాలజీ, అనెస్థీషియా, బయోకెమిస్ట్రీ, డెర్మటాలజీ అండ్ ఎస్‌టీడీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, మైక్రోబయాలజీ, ఒబెస్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ, ఆప్తల్మాలజీ, ఆర్థోపెడిక్స్, ఓటో రినో లారింగాలజీ (ఈఎన్‌టీ), పాథాలజీ, పీడియాట్రిక్స్, పల్మనరీ మెడిసిన్, రేడియోడయాగ్నసిస్, సైకియాట్రీ
- **పోస్టు పేరు:** గ్రేడ్-2 స్పెషలిస్ట్ (సీనియర్ స్కేల్)
- **రీజియన్లవారీగా ఖాళీలు:** ఢిల్లీ-16, గుజరాత్-3, హర్యానా-5, హిమాచల్ ప్రదేశ్-2, కర్ణాటక-7, కేరళ-7, మధ్యప్రదేశ్-2, మహారాష్ట్ర-7, పంజాబ్-5, రాజస్థాన్-5, తమిళనాడు-3, ఉత్తరప్రదేశ్-8, పశ్చిమబెంగాల్-2
- **పోస్టు పేరు:** గ్రేడ్-2 స్పెషలిస్ట్ (జూనియర్ స్కేల్)
- **రీజియన్ల వారీగా ఖాళీలు:** అసోం-1, బీహార్-1, చండీగఢ్-1, ఢిల్లీ-24, గుజరాత్-43, హర్యానా-16, హిమాచల్ ప్రదేశ్-7, కర్ణాటక-7, జమ్ముకశ్మీర్ -3, జార్ఖండ్-10, కర్ణాటక-1, కేరళ-24, ఒడిశా-4, పంజాబ్-13, రాజస్థాన్-20, తమిళనాడు-6, ఉత్తరప్రదేశ్-83
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మాస్టర్ డిగ్రీ (ఎండీ/ఎంఎస్, ఎంసీహెచ్, డీఎం)/పీహెచ్‌డీ లేదా ఎమ్మెస్సీలో ఉత్తీర్ణత. సంబంధిత విభాగం లేదా బోధనా రంగంలో అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 2019 జనవరి 24 నాటికి 45 ఏండ్లు మించరాదు.
- **పేస్కేల్:** సీనియర్ స్కేల్ పోస్టులకు రూ. 78,800/- జూనియర్ స్కేల్ పోస్టులకు రూ. 67,700/ - (7వ వేతన పేస్కేల్ అనుసరించి)
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 500/-, ఎస్సీ/ఎస్టీ/పీహెచ్‌సీ, ఎక్స్‌సర్వీస్‌మెన్, మహిళా అభ్యర్థులకు ఫీజు లేదు.
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** జనవరి 24
- **వెబ్‌సైట్:** www.esic.nic.in

టెక్నికల్ అసిస్టెంట్లు

న్యూఢిల్లీలోని భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన క్రాప్స్ డివిజన్ (కాంట్రాక్టు ప్రాతిపదికన) ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 32
- **విభాగాలవారీగా ఖాళీలు:** నేషనల్ కన్సల్టెంట్-6, కన్సల్టెంట్-4, ప్రోగ్రామ్ మేనేజర్-1, సీనియర్ ప్రోగ్రామర్-1, ప్రోగ్రామర్-1, టెక్నికల్ అసిస్టెంట్-18
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్ డిగ్రీ, పీహెచ్‌డీ, ఎంటెక్ ఉత్తీర్ణతతో పాటు సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- **పేస్కేల్:** టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులకు రూ. 45,000/- (పోస్టులను బట్టి వేర్వేరుగా పేస్కేల్స్ ఉన్నాయి)
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** జనవరి 22
- **వెబ్‌సైట్:** www.indiaseeds.com

బార్క్‌లో సైంటిఫిక్ ఆఫీసర్లు

డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ (డీఏఈ)కి చెందిన బాబా అటామిక్ రిసెర్చ్ సెంటర్ (బార్క్) ఖాళీగా ఉన్న సైంటిఫిక్ ఆఫీసర్ తదితర పోస్టుల ప్రకటన విడుదల చేసింది.

- **మొత్తం ఖాళీలు:** 13
- **విబాగాలవారీగా ఖాళీలు:** సైంటిఫిక్ ఆఫీసర్ (మెడికల్)-9, ఫార్మసిస్ట్-2, టెక్నీషియన్-2
- **అర్హత:** ఇంటర్ లేదా 10+2, సంబంధిత విభాగాల్లో ట్రేడ్ సర్టిఫికెట్, డిప్లొమా, పీజీ, ఎంబీబీఎస్‌తోపాటు ఎండీఎస్, ఎండీ/డీఎన్‌బీ ఉత్తీర్ణత. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జనవరి 25
- **వెబ్‌సైట్:** www.barc.gov.in

ఎస్‌సీఆర్‌లో వాక్ ఇన్ ఇంటర్వ్యూ

సికింద్రాబాద్ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) పరిధిలోని సెంట్రల్ హాస్పిటల్‌లో ఖాళీగా ఉన్న సీనియర్ రెసిడెంట్ (కాంట్రాక్టు పద్ధతిన) పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.




- **పోస్టు:** సీనియర్ సిడెంట్
- **మొత్తం పోస్టులు:** 10
- **విభాగాలవారీగా ఖాళీలు:** ఆప్తల్మాలజీ-2, ఒబెస్టెట్రిక్స్ & గైనకాలజీ-2, జనరల్ మెడిసిన్-2, జనరల్ సర్జరీ-2, డెర్మటాలజీ-2
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ, డీఎం, డీఎస్‌బీ, డిప్లొమా, పోస్టు డాక్టోరల్ డిగ్రీ/ తత్సమాన పరీక్ష లేదా ఎంబీబీఎస్‌తోపాటు ఐదేండ్ల అనుభవం. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో సభ్యత్వం ఉండాలి.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో. ఇంటర్వ్యూ రోజున సంబంధిత అధికారి వద్ద హాజరు కావాలి.
- **చిరునామా:** ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ కార్యాలయం, దక్షిణ మధ్య రైల్వే, రైల్ నిలయం సికింద్రాబాద్.
- **ఇంటర్వ్యూతేదీ:** జనవరి 7
- **వెబ్‌సైట్:** www.scr.indianrailways.gov.in

ఐఐటీలో 'లా' ప్రవేశాలు

ఖరగ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) ఎల్ఎల్‌బీ/ఎల్ఎల్ఎం ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.



- **కోర్సుపేరు:** మూడేండ్ల లా డిగ్రీ (ఆనర్స్ ఇన్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ)
- **అర్హత:** ఇంజినీరింగ్/టెక్నాలజీ, మెడిసిన్ విభాగంలో ప్రథమశ్రేణిలో బ్యాచిలర్ డిగ్రీ లేదా సైన్స్/ఫార్మసీ లేదా ఎంబీఏ 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- **కోర్సుపేరు:** రెండేండ్ల ఎల్ఎల్ఎం
- **అర్హత:** మూడేండ్లు లేదా ఐదేండ్ల లా డిగ్రీ కోర్సుల్లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 3000 (ఎస్సీ/ఎస్టీలకు రూ. 1500)
- **ఎంపిక:** ప్రవేశ పరీక్ష, ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 15
- **ప్రవేశ పరీక్షతేదీ:** ఏప్రిల్ 20
- **వెబ్‌సైట్:** www.iitkgp.ac.in



కత్రినాకైఫ్

మహేష్‌బాబు సరసన..?

మహేష్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మహర్షి'. వంశీ పైడిపల్లి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ చివరి దశకు చేరుకుంది. ఇందులో మల్టీమిలియనీర్‌గా మహేష్ కనిపించబోతున్నారు. ఈ చిత్రం తరువాత ఆయన సుకుమార్ దర్శకత్వంలో ఓ సినిమాచేయబోతున్నారు. ఇందులో బాలీవుడ్ సోయగం కత్రినాకైఫ్ కథానాయికగా నటించనున్నట్లు చిత్ర వర్గాల సమాచారం. తెలుగులో మల్లీశ్వరి, అల్లరి పిడుగు చిత్రాల తరువాత బాలీవుడ్ సోయగం కత్రినాకైఫ్ మరో తెలుగు సినిమాలో నటించలేదు. దాదాపు 13 ఏళ్ల విరామం తరువాత ఆమె తెలుగులో అంగీకరించిన సినిమా ఇదే కానుంది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ చివరి దశకు చేరుకుంది. మైత్రీ మూవీమేకర్స్ సంస్థ నిర్మించనున్న ఈ చిత్రం కోసం మహేష్‌కు జోడీగా కత్రినాకైఫ్‌ని ఖరారు చేయాలనే ఆలోచనలో దర్శకుడు సుకుమార్ వున్నట్లు చిత్ర వర్గాల సమాచారం. మహేష్ నటన బాగుంటుందని, అతనితో నటించే అవకాశం వస్తే తప్పకుండా నటిస్తానని గతంలో ఓ బాలీవుడ్ మీడియాకు కత్రినాకైఫ్ వెల్లడించిన విషయం తెలిసిందే.